సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 296

బుధవారం 17-1-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి '



సుమిత్ సంచలనం

ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్‌లో 27వ ర్యాంకర్ బుబ్లిక్‌పై విజయం -12లో



లాభాల స్వీకరణ

అయిదు రోజుల ర్యాలీకి బ్రేక్. ఇంట్రాడేలో తాజా గరిష్టాల నమోదు -13లో



దక్షిణ కొరియా మన శత్రువు

దక్షిణ కొరియాతో స్నేహబంధం అనే భావనను రాజ్యాంగం నుంచి తొలగించాలని ఉ. కొరియా నియంత కిమ్ ఆదేశించారు.

వివరాలు 6లో ▸



తొలి ప్రైమరీలో ట్రంప్ విజయం

రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అయోవా రాష్ట్రంలో జరిపిన ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ భారీ విజయం సాధించారు.

వివరాలు 6లో ▸



హాజరవడం కష్టమే

అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అందిన ఆహ్వానాన్ని తమ పార్టీ నేతలు తిరస్కరించడాన్ని రాహుల్ సమర్థించారు.

వివరాలు 6లో ▸



దొంగతనం కేసులో..

దుకాణాల్లో వస్తువుల దొంగతనం ఆరోపణలపై న్యూజిలాండ్ మహిళా ఎంపీ గోలిజ్ గ్రాహమన్ తన పదవికి రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



తమ్మినేని ఆరోగ్యం విషమం

హెల్త్ బులెటిన్ విడుదల చేసిన ఏఐజీ

సాక్షి, హైదరాబాద్: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం విషమంగా ఉందని ఏఐజీ ఆస్పత్రి ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. స్వగ్రామమైన ఖమ్మం జిల్లాలోని తెల్దారుపల్లిలో ఉన్న తమ్మినేనికి సోమవారం సాయంత్రం ఒంట్లో నలతగా ఉండటంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పల్స్ తక్కువగా ఉండటాన్ని గుర్తించి వెంటనే చికిత్స అందించారు. అయితే గుండె కొట్టుకోవడంలో తేడాలున్నాయని వైద్యులు చెప్పారు. దీంతో కుటుంబసభ్యులు తమ్మినేనిని వెంటిలేటర్ సపోర్టుతో ఖమ్మం నుంచి హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. గుండె పనిచేయకపోవడం, గుండె కొట్టుకోకపోవడంతో అసాధారణ పరిస్థితి నెలకొందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. దీంతోపాటు మూత్రపిండాలు పనిచేయకపోవడం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం వల్ల ఇన్వాసివ్ వెంటిలేషన్ అవసరమైంది. బీపీ మెరుగుపరిచేందుకు మందులు అందిస్తున్నారు. ఊపిరితిత్తుల నుంచి నీరు తొలగించి, గుండె సాధారణ స్థితికి వచ్చేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. డాక్టర్ సోమరాజు, డాక్టర్ డీఎన్ కుమార్ మార్గదర్శకత్వంలో మిగతా 3వ పేజీలో ▶

బాబుపై స్కిల్ కేసును కొట్టేయలేం

ఈ కేసులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు



స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

- సీఐడీ ఎఫ్ఐఆర్ సరైనదే... దాన్ని కొట్టేయాలనటం సరికాదు
- చంద్రబాబును జైలుకు పంపడం సమర్థనీయమే
- ముందస్తు అనుమతి లేదనే కారణంతో రిమాండ్ ఉత్తర్వుల్ని కొట్టేయలేం
- సెక్షన్ 17(ఏ) వర్తింపుపై ఇరువురు న్యాయమూర్తులు భిన్న తీర్పులు
- అది వర్తిస్తుందని ఒకరు.. ఈ కేసుకు వర్తించదని మరొకరు తీర్పు
- దీంతో ముగ్గురు సభ్యులుండే విస్తృత ధర్మాసనానికి ఈ అంశం
- సీఐడీ ఎఫ్ఐఆర్‌లో... ఐపీసీ 409, 120బి కింద కూడా బాబుపై కేసులు
- ఈ తీర్పుతో వాటిలో ముందుకెళ్లడానికి సీఐడీకి పచ్చజెండా... సెక్షన్ 409 కింద నేరం రుజువైతే బాబుకు యావజ్జీవ ఖైదు
- సెక్షన్ 17ఏపై తేల్చడానికి విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేయనున్న సీజేఐ
- సుప్రీం టాప్ 4 సీనియర్ జడ్జీల్లో ఒకరి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం
- ఆ సీనియర్ న్యాయమూర్తి ఎవరి తీర్పును సమర్థిస్తే... 17ఏపై అ తీర్పే ఖరారు
- సెక్షన్ 17ఏతో సంబంధం లేకుండా తొలిసారి బోనెక్కనున్న చంద్రబాబు





జస్టిస్ అనిరుద్ధ బోస్ జస్టిస్ బేలా త్రివేదీ

చాలా కేసుల్లో బాబు 'మేనేజ్‌మెంట్ స్కిల్స్'.. ఈసారి పారని పాచిక 2లో

జస్టిస్ అనిరుద్ధ బోస్ ఏం చెప్పారంటే...

- స్కిల్ కేసుకు సెక్షన్ 17(ఏ) వర్తిస్తుంది.. చంద్రబాబుపై కేసు నమోదుకు ముందు గవర్నర్ అనుమతి తప్పనిసరి.. ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ నుంచి అనుమతి తీసుకోవచ్చు
- అనంతరం చంద్రబాబు విషయంలో ముందుకెళ్లొచ్చు

జస్టిస్ బేలా త్రివేదీ ఏం చెప్పారంటే...

➤ 2018కి ముందు నేరాలకు సెక్షన్ 17(ఏ) వర్తించదు ➤ సెక్షన్ 17(ఏ) అమల్లో లేని కాలానికి దానిని వర్తింపజేయలేం ➤ చట్ట సవరణ చేసిన శాసనవ్యవస్థ ఉద్దేశం కూడా ఇదే ➤ 2018కి పూర్వ నేరాలకు వర్తింప చేస్తే చాలా వివాదాలు తలెత్తుతాయి ➤ గత నేరాలకు వర్తింప చేస్తే ప్రతికూల ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది ➤ అంతేకాక చట్ట సవరణ తీసుకొచ్చిన ఉద్దేశమూ నెరవేరకుండా పోతుంది ➤ భిన్నమైన భాష్యం ప్రాథమిక దశలో దర్యాప్తునకు విఘాతం కలిగించడమే ➤ సెక్షన్ 17 (ఏ) తెచ్చింది అవినీతిపరులను కాపాడేందుకు కాదు ➤ వేధింపుల నుంచి నిజాయతీపరులైన వారిని కాపాడేందుకే ➤ అధికార విధుల్లో భాగం కాని నిర్ణయాలకు సెక్షన్ 17(ఏ) కింద రక్షణ సాధ్యం కాదు ➤ చంద్రబాబు రిమాండ్ విషయంలో ఏసీబీ కోర్టు సరిగ్గానే వ్యవహరించింది ➤ తన పరిధి మేరకే నిర్ణయం తీసుకుంది ➤ 17(ఏ) కింద అనుమతి లేదని రిమాండ్ ఉత్తర్వులు కొట్టేయలేం ➤ హైకోర్టు తీర్పులో కూడా ఎలాంటి చట్ట విరుద్ధత లేదు ➤ ఏసీబీ కోర్టు, హైకోర్టు తీర్పుల్లో ఏ రకంగానూ జోక్యం అవసరం లేదు



'నాసిన్' అకాడమీ కొత్త క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి నిర్మల, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ సీఎం వైఎస్ జగన్

పేదరికంపై పోరాడి గెలిచాం

ఏపీలో 'నాసిన్' అకాడమీ ప్రారంభోత్సవంలో ప్రధాని మోదీ

తొమ్మిదేళ్లలో 25 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- విద్య, వైద్యం, ఉపాధి రంగాలపై భారీగా వ్యయం చేశాం
- నకిలీలను ఏరివేయడంతో ప్రతి పైసా నేరుగా అర్హులకు.. ప్రజల సొమ్మును తిరిగి వారికే అందిస్తున్నాం
- రామరాజ్యం గురించి మహాత్ముడు, తులసీదాస్ గొప్పగా వర్ణించారు
- జటాయువు నేలకొరిగిన ఈ ప్రాంతాన్ని రామాలయ ప్రతిష్ఠాపనకు ముందు సందర్శించడం నా అదృష్టం
- పుణ్యకాలంలో పురాతన ఆలయాల్లో ఆశీర్వాదాలు పొందుతున్నా
- విజయనగర సామ్రాజ్య సుపరిపాలన మూలాలు ఈ ప్రాంతంలోనే ..

సాక్షి, పుట్టపర్తి (శ్రీసత్యసాయి జిల్లా): దేశంలో పేదరికాన్ని ఓడించే సత్తా తమ ప్రభుత్వానికే ఉందని, గత తొమ్మిదేళ్లలో సుమారు 25 కోట్ల మంది ప్రజలకు పేదరికం నుంచి విముక్తి కల్పించామని ప్రధాని నరేంద్రమోదీ తెలిపారు. నీతి ఆయోగ్ తాజా నివేదికలోనూ ఇదే విషయం స్పష్టమైందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, స్వయం ఉపాధి రంగాలకు ప్రభుత్వం భారీగా ఖర్చు చేసి పేదలకు సౌకర్యాలు పెంచిందని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడ్డాక పేదరిక నిర్మూలన కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టామన్నారు. వివిధ పథకాల ద్వారా ప్రజల సొమ్మును తిరిగి వారికే ఇస్తున్నామని చెప్పారు. గత పదేళ్లలో 10 కోట్ల నకిలీ పేర్లను తొలగించడంతో నేడు ప్రతి పైసా అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరుతోందన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు మిగతా 2వ పేజీలో ▶

ప్రపంచ స్థాయికి 'నాసిన్' కీర్తి 2లో

'అనంత'లో నెలకొల్పడం ఆనందదాయకం: సీఎం జగన్

లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించండి



సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శులు, జాతీయ ప్రధాన కార్యదర్శులకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సూచించారు.

- వివరాలు 5లో▶

పోలీస్ స్పందన 7 నిమిషాల్లో..

డయల్ 100కు బాధితులు ఫోన్ చేసినప్పటి నుంచి వారిని పోలీసులు చేరుకొనేందుకు ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరిన ఏడు నిమిషాల సమయం (రెస్పాన్స్ టైమ్) పడుతుండగా దాన్ని ఈ ఏడాది మరింత తగ్గించాలని పోలీసులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

- వివరాలు 10లో▶

అయోధ్యలో సంప్రదాయ క్రతువులు ఆరంభం

రామాలయం గర్భగుడికి ఏర్పాటు చేసిన ద్వారం



చారిత్రక నగరం అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన సంప్రదాయ క్రతువులు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రాణప్రతిష్ఠ దాకా ఇవి నిరంతరాయంగా కొనసాగుతాయని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది. 6లో

దావోస్‌లో సీఎం బృందం

- తొలిరోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్గ్‌తో భేటీ
- ఇథియోపియా ఉప ప్రధానితో పారిశ్రామిక రూట్ మ్యాప్‌పై చర్చ.. రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ పెంపుపై నాస్కామ్ ప్రెసిడెంట్‌తో సంప్రదింపులు

3లో

హైదరాబాద్‌లో సీ4ఐఆర్

- డబ్ల్యూఈఎఫ్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం.. బయో ఏషియా సదస్సులో భాగంగా ఫిబ్రవరిలో ప్రారంభం



బోర్గ్ బ్రెండెతో సీఎం రేవంత్

రూ.5 లక్షలు.. 500 చ.అ. ఇల్లు!

ఇందిరమ్మ పథకం కింద పేదలకు రూ.5 లక్షలు ఇస్తామన్న కాంగ్రెస్

- ఆ మొత్తంతో 450 చ.అ. నుంచి 500 చ.అ.ల్లో ఇంటి నిర్మాణానికి వీలుందని భావిస్తున్న ప్రభుత్వం
- అందుకు చుట్టూ వదలాల్సిన ఖాళీ స్థలంతో కలిపి 70 గజాలు కావాలి.. అప్పుడు రూ.5 లక్షల మొత్తం పూర్తిగా ఖర్చయ్యే అవకాశం
- మరి తక్కువ స్థలం ఉన్న పేదల సంగతేంటి?
- రాష్ట్రంలో 60 గజాల కంటే తక్కువగా స్థలం ఉన్న పేదలే ఎక్కువ ఉంటారని అంచనా
- తక్కువ స్థలంలో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల కంటే తక్కువ ఖర్చవుతుందని అంచనా
- అప్పుడు మిగిలే మొత్తాన్ని ఏం చేస్తారు?
- 'దుర్వినియోగం' ఖాతాలోకి వెళ్లే చాన్స్ ఉందని అధికారుల్లో అనుమానాలు.. ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ముందుకు సాగని పథకం

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ పథకం అమలుపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఈ పథకం కింద గృహ నిర్మాణానికి ఒక్కో లబ్ధిదారుకు రూ.5 లక్షలు ఇవ్వాల్సి ఉండగా, ఆ మొత్తంతో దాదాపు 450 చదరపు అడుగుల (చ.అ) నుంచి 500 చ.అ. విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేందుకు వీలుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనితో పాటు నిబంధనల ప్రకారం చుట్టూ ఖాళీ స్థలం వదలాలంటే 70 చ.గజాల వరకు స్థలం కావాలని అంచనా వేస్తోంది. ఇలా 70 గజాల స్థలం ఉన్నా, అంత కంటే ఎక్కువున్నా పరవాలేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు పూర్తిగా ఖర్చు చేసి 500 చ.అ. విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ రాష్ట్రంలో 60 గజాల కంటే తక్కువగా సొంత స్థలం ఉన్న మిగతా 2వ పేజీలో ▶



ఇదండీ సంగతి



.. మనసులో మాట వింటున్నారు!

అనూహ్యంగా తెరపైకి బల్మూరి వెంకట్

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్ఎస్‌యూఐ నేత

మరో ఎమ్మెల్సీగా అద్దంకి దయాకర్

నామినేషన్లు సిద్ధం చేసుకోవాల్సిందిగా ఏఐసీసీ సమాచారం!

హైకమాండ్ ఏ క్షణంలోనైనా ప్రకటించే అవకాశం





బల్మూరి వెంకట్ అద్దంకి దయాకర్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట నర్సింగరావు పేరు తెరపైకి వచ్చింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ పేరు దాదాపు ఖరారైందని ప్రచారం జరిగినా, మంగళవారం అనూహ్యంగా వెంకట్ రేసులోకి వచ్చారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్‌తో పాటు వెంకట్‌ను రెండో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం నుంచే ప్రచారం జరిగినా అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. అయితే ఇద్దరికీ ఏఐసీసీ నుంచి వ్యక్తిగతంగా సమాచారం అందిందని, నామినేషన్లు సిద్ధం చేసుకోవాల్సిందిగా మిగతా 3వ పేజీలో ▶



'నేత' రాత మారేదెలా?

- ఆరేళ్లుగా ఎన్నికల ఊసే లేదు...పర్సన్ ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగింపు

చేనేత సహకార సంఘాలకు ఎప్పుడో ముగిసిన పదవీకాలం

సాక్షి, యాదాద్రి: ఆరేళ్లుగా చేనేత సహకార సంఘాల ఎన్నికల ఊసే లేదు. దీంతో క్షేత్రస్థాయిలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు పట్టించుకునేవారే లేకుండా పోయారు. ఎన్నికలు జరగని కారణంగా టెస్కో ఉనికిలో లేకుండాపోయింది. 2018లో సహకార సంఘాల పదవీ కాలం ముగిసింది. అయితే గత ప్రభుత్వం కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయకుండా పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించింది. రాష్ట్ర స్థాయి పాలకవర్గం లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లడానికి ఇబ్బందిగా మారింది. గత ప్రభుత్వం టెస్కోకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్, మిగతా 5వ పేజీలో ▶




క్లుప్తంగా...

ఈడీ విచారణకు హాజరు కాలేను: కవిత



సాక్షి, హైదరాబాద్, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీలో డబ్బులు చేతులు మారాయనే కేసుకు సంబంధించి ఈనెల 16న ఢిల్లీలో విచారణకు రావాల్సిందిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు నోటీసులు జారీ చేసింది. అయితే ఈడీ విచారణకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున తాను హాజరు కాలేనంటూ కవిత ఈనెల 15న లేఖ రాశారు. కవిత రాసిన లేఖపై ఈడీ నుంచి మళ్లీ ఎలాంటి తిరుగు సమాధానం రాలేదని బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి. కాగా, గతంలో రెండు పర్యాయాలు ఈడీ నోటీసులు జారీ చేయగా.. కవిత విచారణకు హాజరయ్యారు. ఈడీ ఇచ్చిన సమన్లు రద్దు చేయాలని సుప్రీంను ఆశ్రయించారు. ఈడీ కార్యాలయంలో మహిళల విచారణ సీఆర్పీసీకి విరుద్ధం అంటూ ఆమె మొదటి నుంచి వాదిస్తున్నారు. నళిని చిదంబరం తరహాలో ఇంటివద్దే తనను విచారణ జరపాలని ఆమె అప్పట్లో సుప్రీంకోర్టును కోరారు. కవిత దాఖలు చేసిన పిటిషన్ విచారణ తరచూ వాయిదా పడుతూ వస్తోంది. ఈనెల 23న ఆమె పిటిషన్ బెంచ్ మీదకు వచ్చే అవకాశం ఉన్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది మార్చిలో ఎమ్మెల్సీ కవిత విచారణలో భాగంగా ఈడీకి తన సెల్‌ఫోన్‌లను అప్పగించిన విషయం తెలిసిందే. ఈ కేసులో భాగంగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను కూడా ఈ నెల 18 19 తేదీల్లో విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు జారీ చేసింది.

హజ్ యాత్రకు 11,140 దరఖాస్తులు



సాక్షి, హైదరాబాద్: 2024 హజ్ యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా 11,140 దరఖాస్తులు అందాయని రాష్ట్ర హజ్ కమిటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఇర్ఫాన్ షరీఫ్ తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 70 ఏళ్లపై బడిన వారి నుంచి 378 దరఖాస్తులు వచ్చాయని, వీరు నేరుగా యాత్రకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల చివరి వారంలో లేదా వచ్చే నెల మొదటి వారంలో కంప్యూటర్ పద్ధతిలో కేంద్ర హజ్ కమిటీ డ్రాలు నిర్వహిస్తుందని స్పష్టం చేశారు. డ్రాలో ఎంపికైన వారు కేంద్ర హజ్ కమిటీ సూచనల ప్రకారం యాత్రకయ్యే ఖర్చులకు మిగతా డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.


ఏపీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలిగా షర్మిల నియమితులయ్యారు. పీసీసీ అధ్యక్ష పదవికి గిడుగు రుద్రరాజు సోమవారం రాజీనామా చేయగా.. షర్మిలను ఏపీ అధ్యక్షురాలిగా నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021 జూలై 8న వైఎస్సార్‌టీపీని ప్రారంభించిన షర్మిల.. ఈ నెల 4వ తేదీన ఢిల్లీలో ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. కాగా.. గిడుగు రుద్రరాజును సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా కాంగ్రెస్ అధిష్టానం నియమించింది.

అన్ని జిల్లాల్లో యూరియా నిల్వలు



సాక్షి, హైదరాబాద్: లారీల సమ్మె విరమణతో ప్రస్తుతం అన్ని జిల్లాల్లో సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని వ్యవసాయ సంచాలకుడు గోపి తెలిపారు. నిర్మల్ జిల్లాలో యూరియా కొరత అంశంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం సమీక్షించారు. మిర్చి ధర, తెగుళ్ల నియంత్రణ చర్యలతో మార్కెట్ సంబంధిత సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంచాలకుడు మాట్లాడుతూ ఇటీవల లారీల సమ్మె కారణంగానే యూరియా కొరత ఏర్పడిందని మంత్రికి స్పష్టం చేశారు. రైతుల ఆదాయం, పంటల వైవిధ్యం పెంపుపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. రాష్ట్రంలో వివిధ పంటలకు విత్తన లభ్యత అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధిక వరి పంట ఎగుమతి చేసుకునేలా భారత ప్రభుత్వానికి నివేదిక సమర్పించేందుకు ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ ఉద్యోగుల సమస్యలపై అన్ని సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించమని మంత్రి తుమ్మల వ్యవసాయ సంచాలకుడు గోపిని కోరారు.

బాబుపై స్కిల్ కేసును కొట్టేయలేం

ఈ కేసులో రాజకీయ దురుద్దేశాలు, కక్ష సాధింపులు లేవు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు

సాక్షి, అమరావతి: యువతలో ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుస్తామంటూ వందల కోట్లు కొట్టేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సుప్రీంకోర్టు కోలుకోలేని షాక్ ఇచ్చింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ఏర్పాటు పేరిట షెల్ కంపెనీల ద్వారా వందల కోట్ల రూపాయల్ని కాజేసినందుకు చంద్రబాబుపై సీఐడీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేసేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. బాబుకు రిమాండ్ విధిస్తూ విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించింది. అంతేకాకుండా ఈ కేసులో ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు, ప్రభుత్వ కక్షసాధింపులు లేనేలేవని జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన సుప్రీం ధర్మాసనం మంగళవారం తీర్పునిచ్చింది. సీమెన్స్ సంస్థకు తెలియకుండానే ఆ కంపెనీ మాజీ అధికారులను తెరపైకి తెచ్చి... బోగస్ ఒప్పందాలతో... ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు నేరుగా వందల కోట్లను తన ఖాతాల్లోకి మళ్లించుకున్న వ్యవహారంలో ఆయనపై ఆధారాలతో సహా ఏపీ సీఐడీ విభాగం కేసు నమోదు చేయటం తెలిసిందే. కేసులో బాబును అరెస్టు చేసి, ఏసీబీ ప్రత్యేక కోర్టు ఎదుట హాజరు పరచటంతో... కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది. 52 రోజులు రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉండి... ఆరోగ్యం బాగాలేదని, ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటానని చెప్పి షరతులతో బెయిలు తీసుకుని బయటకు వచ్చారు.

చంద్రబాబు మొదటి నుంచీ తనకు ఈ కేసుతో సంబంధం లేదనిగానీ, తాను అక్రమాలకు పాల్పడలేదని గానీ, డబ్బుల్ని షెల్ కంపెనీల్లోకి మళ్లించలేదని గానీ, సీమెన్స్ సంస్థ పేరిట బోగస్ ఒప్పందం చేసుకోలేదని గానీ వాదించకుండా... తాను మాజీ ముఖ్యమంత్రిని కాబట్టి, తనను అరెస్టు చేయాలంటే అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17ఏ ప్రకారం గవర్నరు అనుమతి తీసుకోవాలని, అలా తీసుకోకుండా సీఐడీ తనను అరెస్టు చేసింది కాబట్టి ఈ అరెస్టు చెల్లదని... కాబట్టి మొత్తం కేసును కొట్టేయాలని (క్వాష్ చెయ్యాలని) చంద్రబాబు వాదిస్తున్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం తీర్పును వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం... మంగళవారం తన తీర్పును వెలువరించింది. కేసును క్వాష్ చెయ్యాలన్న చంద్రబాబు అభ్యర్థనను తిరస్కరించింది. సీఐడీ పెట్టిన ఎఫ్‌ఐఆర్‌ను, ప్రత్యేక న్యాయస్థానం విధించిన రిమాండ్‌ను... అన్నింటినీ సుప్రీంకోర్టు బెంచ్ సమర్థించింది. అయితే గవర్నరు అనుమతి తీసుకున్నాకే చంద్రబాబును అరెస్టు చేయాలన్న సెక్షన్ 17ఏ విషయంలో ధర్మాసనంలోని ఇరువురు న్యాయమూర్తులూ భిన్నమైన తీర్పును వెలువరించారు. చంద్రబాబు నాయుడికి సెక్షన్ 17ఏ వర్తిస్తుందని, ఇప్పుడైనా రాష్ట్ర ప్రభుత్వం గవర్నరు నుంచి అనుమతి తీసుకోవచ్చని జస్టిస్ అనిరుద్ధ బోస్ పేర్కొనగా... సెక్షన్ 17ఏ రాకముందే ఈ నేరం జరిగింది కాబట్టి చంద్రబాబుకు ఆ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా ఎం త్రివేదీ స్పష్టంచేశారు.

మరి ఇప్పుడేం జరుగుతుంది?

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణమనేది రాజకీయ దురుద్దేశాలతో పెట్టినదని, తనను కక్షసాధింపుతోనే అరెస్టు చేశారని చంద్రబాబు చెబుతున్నారు. సుప్రీంకోర్టు మాత్రం ఈ వాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ఇది అవినీతికి సంబంధించిన స్పష్టమైన కేసు అని, దీన్లో రాజకీయ దురుద్దేశాలు గానీ, కక్ష సాధింపుగానీ లేవని తేల్చిచెప్పింది. సీఐడీ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను క్వాష్ చెయ్యడానికి సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో... ఎఫ్‌ఐఆర్‌లో ఐపీసీ 409 (ప్రజల నమ్మకాన్ని నేరపూరితంగా వంచించటం), సెక్షన్ 120బి (దురుద్దేశపూర్వక కుట్ర) వంటివి సెక్షన్ 17ఏతో సంబంధం లేనివి కనక యథాతథంగా కొనసాగుతాయి. ఐపీసీ 409 కింద నేరం గనక రుజువైతే యావజ్జీవ శిక్ష పడుతుంది. కాకపోతే సెక్షన్ 17ఏ వర్తిస్తుందా? లేదా? అన్న విషయంలో మాత్రం బెంచ్‌లోని ఇద్దరు న్యాయమూర్తులూ భిన్నమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు కాబట్టి... ఈ అంశాన్ని ఇద్దరికన్నా ఎక్కువ మంది జడ్జీలుండే విస్తృత ధర్మాసనానికి నివేదించాల్సిందిగా కోరుతూ... అందుకు వీలుగా కేసు ఫైళ్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచాలని కోర్టు రిజిస్ట్రీని బెంచ్ ఆదేశించింది.

ప్రాథమిక దశలోనే దర్యాప్తునకు విఘాతం కలిగించినట్లవుతుంది...

శాసనవ్యవస్థ సెక్షన్ 17(ఏ)ను తీసుకొచ్చిన ఉద్దేశానికి మరో రకమైన భాష్యం చెప్పినా కూడా అది అసమంజసమే అవుతుందని జస్టిస్ బేలా త్రివేదీ తెలిపారు. అంతేకాక ప్రాథమిక దశలోనే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలిగించినట్లు అవుతుందన్నారు. "2018కి ముందు కేసులకు కూడా సెక్షన్ 17(ఏ) వర్తిస్తుందన్న సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనతో ఏకీభవిస్తే, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లోని విచారణలు, దర్యాప్తులు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. దీని వల్ల చాలా కేసులు నిరర్థకంగా మారతాయి. అవినీతిని రూపుమాపేందుకు తీసుకొచ్చిన చట్టం తాలుకు ముఖ్య ఉద్దేశం నెరవేరకుండా పోతుంది. అసలు అధికార విధుల్లో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై వేధింపులకు గురికాకుండా నిజాయితీపరులైన అమాయక అధికారులను కాపాడటానికే సెక్షన్ 17ఏను తీసుకువచ్చారు. అంతేతప్ప అవినీతిపరులైన పబ్లిక్ సర్వెంట్లకు రక్షణ కల్పించడానికి కాదు" అని జస్టిస్ బేలా తన తీర్పులో చెప్పారు. అవినీతి నిరోధక చట్టం సెక్షన్లతో పాటు ఐపీసీ సెక్షన్ల కింద కూడా కేసు నమోదైనప్పుడు, కేసు నమోదుకు ముందు సెక్షన్ 17(ఏ) కింద అనుమతి తీసుకోలేదన్న కారణంతో ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేయడం సాధ్యం కాదన్నారు. ఏసీబీ కోర్టు తనకున్న పరిధి మేరకే రిమాండ్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. చంద్రబాబును రిమాండ్‌కు పంపడం ద్వారా ఏసీబీ ప్రత్యేక కోర్టు ఎలాంటి తప్పు చేయలేదని జస్టిస్ బేలా త్రివేది తన తీర్పులో పేర్కొన్నారు.

సెక్షన్ 17(ఏ)ను తేల్చనున్న సీనియర్ జడ్జి

ఇరువురు న్యాయమూర్తులు భిన్న తీర్పులు వెలువరించిన నేపథ్యంలో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన విస్తృత ధర్మాసనం ఏర్పాటవుతుంది. ఈ విషయంలో సీజే జస్టిస్ చంద్రచూడ్ పాలనాపరమైన నిర్ణయం తీసుకుంటారు. జస్టిస్ బోస్ కన్నా సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం ఏర్పాటు చేస్తారు. జస్టిస్ బోస్ ఇప్పుడు సీనియారిటీలో 5వ స్థానంలో ఉన్నారు. కాబట్టి ఆయన కన్నా సీనియర్లు అయిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ లేదా రెండవ స్థానంలో ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నా, లేదా మూడవ స్థానంలో ఉన్న జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ లేదా నాల్గవ స్థానంలో ఉన్న సూర్య కాంత్.. ఈ నలుగురిలో ఒకరి నేతృత్వంలో విస్తృత ధర్మాసనం ఏర్పాటవుతుంది. ఈ విస్తృత ధర్మాసనంలో కొత్తగా వచ్చే సీనియర్ న్యాయమూర్తితో పాటు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా త్రివేది కూడా ఉంటారు. ఈ ముగ్గురు కలిసి తిరిగి మొదటి నుంచి చంద్రబాబు కేసును విచారిస్తారు. జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేది ఇప్పటికే ఓ నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో విస్తృత ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి నిర్ణయం కీలకమవుతుంది. అలాగే జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేది కేవలం సెక్షన్ 17(ఏ) విషయంలోనే భిన్నమైన తీర్పులు ఇచ్చిన నేపథ్యంలో విస్తృత ధర్మాసనం సైతం ఇదే అంశంపై ప్రధానంగా దృష్టి సారిస్తుంది. విస్తృత ధర్మాసనంలో ఉండే సీనియర్ న్యాయమూర్తి ఇప్పటికే నిర్ణయం వెలువరించిన ఇరువురు న్యాయమూర్తుల్లో ఒకరి నిర్ణయాన్ని సమర్థించవచ్చు. ఎవరి తీర్పును సమర్థిస్తారో అప్పుడు 2 :1గా మెజారిటీతో ఆ తీర్పు ఖరారు అవుతుంది. ఒకవేళ జస్టిస్ బోస్, జస్టిస్ బేలా త్రివేదిల నిర్ణయాలతో ఏకీభవించకుండా ఆ సీనియర్ న్యాయమూర్తి మరో భిన్నమైన నిర్ణయాన్ని వెలువరిస్తే, అప్పుడు ప్రధాన న్యాయమూర్తి ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి ఈ కేసును పంపాల్సి ఉంటుంది.

మొట్టమొదటిసారి.. విచారణ ముంగిట బాబు

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసును కొట్టేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో చంద్రబాబు ఈ కేసులో తొలిసారిగా కోర్టు విచారణను ఎదుర్కోనున్నారు. స్కిల్ కేసులో సీఐడీ తన దర్యాప్తును పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసిన తరువాత ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం విచారణను మొదలు పెడుతుంది. విచారణ జరిగే ప్రతీ సందర్భంలోనూ చంద్రబాబు కోర్టు ఎదుటకు హాజరు కావడం తప్పనిసరి. చంద్రబాబు ఓ కేసులో కింది కోర్టులో విచారణను ఎదుర్కోవడం ఇదే తొలిసారి.

ఇక ఇప్పుడేమని ఆరుస్తారు..?


కేసు కొట్టివేతకు సుప్రీంకోర్టు నిరాకరించిన నేపథ్యంలో... రాష్ట్ర ప్రభుత్వం తనపై అన్యాయంగా కేసు పెట్టిందని, తనను రాజకీయంగా వేధించేందుకు జైల్లో పెట్టారంటూ చంద్రబాబు నాయుడు, ఆయన వందిమాగధులు చేస్తూ వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిపోయింది. తన తండ్రి విషయంలో ఏసీబీ కోర్టు అన్యాయంగా వ్యవహరించిందంటూ నారా లోకేష్ ఎల్లో మీడియా ఇంటర్వ్యూల్లో చేసిన ఆరోపణలు బూటకమని రుజువైంది.

జస్టిస్ బోస్ ఏం చెప్పారంటే..

చంద్రబాబుపై కేసు నమోదు చేసే ముందు సెక్షన్ 17(ఏ) ప్రకారం ముందస్తు అనుమతి (గవర్నర్ నుంచి) తీసుకోవడం తప్పనిసరి అని జస్టిస్ బోస్ తన తీర్పులో పేర్కొన్నారు. అలా ముందస్తు అనుమతి తీసుకోకుండా చేపట్టే విచారణ లేదా దర్యాప్తు చట్ట విరుద్ధమవుతుందని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(1)(సీ), 13(1)(డీ), 13(2) ప్రకారం చంద్రబాబు విషయంలో ముందుకు వెళ్లడానికి వీల్లేదన్నారు. అయితే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా గవర్నరు నుంచి ముందస్తు అనుమతి తీసుకోవచ్చని, తదనంతరం అవినీతి నిరోధక చట్టం కింద (పీసీ యాక్ట్) చంద్రబాబు విషయంలో ముందుకెళ్లవచ్చునని తెలిపారు. అలాగే తనపై సీఐడీ నమోదు చేసిన కేసును, తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కొట్టేయాలన్న చంద్రబాబు అభ్యర్థనను తోసిపుచ్చుతున్నట్లు జస్టిస్ బోస్ తన తీర్పులో స్పష్టంగా పేర్కొన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17(ఏ) కింద ముందస్తు అనుమతి తీసుకోనంత మాత్రాన రిమాండ్ ఉత్తర్వులు చెల్లుబాటు కాకుండా పోవని ఆయన తేల్చి చెప్పారు.

జస్టిస్ బేలా త్రివేది..

17 (ఏ) ప్రకారం ముందస్తు అనుమతి తీసుకోవాలని జస్టిస్ బోస్ తన తీర్పులో వ్యక్తం చేసిన అభిప్రాయాలతో మరో న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం త్రివేది విభేదించారు. సెక్షన్ 17(ఏ) అమల్లోకి రాకమునుపే ఈ నేరం జరిగిందని... అది అమల్లో లేని కాలానికి దానిని వర్తింప చేయలేమని జస్టిస్ త్రివేది తీర్పునిచ్చారు. అవినీతి నిరోధక చట్టానికి 2018లో సవరణలు చేసి సెక్షన్ 17(ఏ)ను చేర్చిన నేపథ్యంలో... 2018కి ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17(ఏ) వర్తించదని, 2018, ఆ తరవాత జరిగిన నేరాలకే ఈ సెక్షన్ వర్తిస్తుందని ఆమె స్పష్టంగా పేర్కొన్నారు. చట్ట సవరణ చేసిన శాసనవ్యవస్థ ఉద్దేశం కూడా ఇదేనన్నారు. "17(ఏ)ను పూర్వ నేరాలకు వర్తింప చేయడానికి ఎంత మాత్రం వీల్లేదు. 17(ఏ) రావడానికి ముందున్న కాలానికి దీన్ని వర్తింప చేస్తే కొత్తగా అనేక వివాదాలకు తెరలేపినట్లవుతుంది. 2018కి ముందు జరిగిన నేరాలకు సెక్షన్ 17(ఏ)ను వర్తింప చేస్తే చట్ట సవరణ చేసిన ఉద్దేశం నెరవేరకుండా పోతుంది" అని ఆమె తేల్చి చెప్పారు.



సాక్ష్యాధారాలు బలంగా ఉన్నందుకే జోక్యం చేసుకోని సుప్రీంకోర్టు

- ప్రాజెక్ట్ రూపకల్పన నుంచి నిధులు
- కొల్లగొట్టడం వరకు అంతా ఆయనే
- సీమెన్స్ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్ట్
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ రూ.3,300 కోట్లకు పెంపు
- ఆధారాలు సంపాదించి కోర్టు ముందుంచిన సీఐడి
- అందుకే చంద్రబాబుకు రిమాండ్.
- జైల్లో 52 రోజులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

రూ.5 లక్షలు.. 500 చ.అ ఇల్లు!

▶ మొదటి పేజీ తరువాయి

పేదలే ఎక్కువమంది ఉంటారని అంచనా. కాగా తక్కువ స్థలంలో చిన్న ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల లోపే ఖర్చవుతుందని, 60 గజాల కంటే తక్కువ స్థలం ఉన్న పేదలకు రూ.5 లక్షలు ఇస్తే, ఖర్చు కాగా మిగిలే మిగతా మొత్తం 'దుర్వినియోగం' ఖాతాలోకి చేరుతుందని గృహ నిర్మాణ శాఖ అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పష్టత లేకపోయేసరికి ఇప్పటివరకు అధికార యంత్రాంగం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.

ఆ ప్లాన్‌లు ఎలా అమలు చేస్తారు?

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మూడు నమూనాలు సిద్ధం చేసి, వాటి ఆధారంగా నిర్మాణం చేపడతామని గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సొంత జాగాలో ఇళ్లను నిర్మించుకునే క్రమంలో ఈ నమూనాలు కూడా ఆటంకంగా మారే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పేదలకు ఉండే సొంత జాగాలు అన్నీ ఒకే ఆకృతిలో ఉండే అవకాశం ఉండదు. కొన్ని పొడవుగానో, వంకర టింకరగానో ఉంటే, ప్రభుత్వం రూపొందించిన ప్లాన్ల ప్రకారం ఇళ్లను నిర్మించుకునే వీలుండదు. అప్పుడేం చేయాలనే సందేహాలు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, అప్పుడే ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కసరత్తు ముందుకు సాగుతుందని అంటున్నారు.

ఎందుకీ సమస్య?

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ పథకం ఉన్న సంగతి తెలిసిందే. కాగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణ పథకం గృహలక్ష్మి కింద ఒక్కో లబ్ధిదారుకు రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. అయితే కాంగ్రెస్ పార్టీ దానిని ఇందిరమ్మ పథకంగా మార్చి ఆర్థిక సాయాన్ని రూ.5 లక్షలకు పెంచి ప్రకటించింది. అంటే అర్హులైన ప్రతి లబ్ధిదారుకు రూ.5 లక్షలు అందిస్తారన్నదే ఆ ప్రకటన సారాంశం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలుత ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్ల పథకంలో ఒక్కో ఇంటికి దాదాపు రూ.5.20 లక్షల వరకు ఖర్చయింది. ఆ మొత్తంతో 500 చ.అ.కు మించిన విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణం జరిగింది. లిఫ్టు వసతి లాంటి అదనపు హంగుల వల్ల జీహెచ్‌ఎంసీ పరిధిలో యూనిట్ కాస్ట్‌ను రూ.7 లక్షలుగా ఖరారు చేశారు. అయితే ఇప్పుడు ఇందిరమ్మ పథకంలో అందరికీ సమంగా రూ.5 లక్షల చొప్పున ఇస్తే, నిబంధనల ప్రకారం ఖర్చు చేస్తే డబ్బులు మిగిలి దుర్వినియోగం కింద జమకట్టే ప్రమాదం ఉంటుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఇందిరమ్మ పథకంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణల్లో కూడా ఇలాంటి అంశాలే ఎక్కువగా ఉన్నాయని కొందరు గుర్తు చేస్తున్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

ఆలయాన్ని సందర్శించిన ప్రధాని మోదీ

- వీరభద్రుడికి స్వయంగా హారతి
- తోలుబొమ్మలాటను వీక్షించి తన్మయత్వం



లేపాక్షి వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న ప్రధాని మోదీ

లేపాక్షి (శ్రీసత్యసాయి జిల్లా): చారిత్రక లేపాక్షి ఆలయంలో శిల్పకళా సంపద అద్భుతమని ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసించారు. భారతీయ చరిత్ర, పురాతన వైభవం, విజయనగర సామ్రాజ్య సంస్కృతిని లేపాక్షి ఆలయ శిల్పకళా సంపద ప్రతిబింబిస్తోందని చెప్పారు. ప్రధాని మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో లేపాక్షి చేరుకుని స్థానిక పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయాలను సందర్శించారు. ప్రధానికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో వీరభద్రస్వామి, పాపనాశేశ్వరస్వామి, దుర్గాదేవి అమ్మవారికి ప్రధాని ప్రత్యేక పూజలు చేశారు. వీరభద్రస్వామికి స్వయంగా మహామంగళ హారతి ఇచ్చారు. గర్భగుడిలో పాపనాశేశ్వర లింగానికి అభిముఖంగా ప్రత్యేక పీఠంపై కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. టీటీడీ వేద విజ్ఞాన పాఠశాల ఆధ్వర్యంలో రంగనాథ రామాయణ పారాయణం నిర్వహించగా మహిళా కళాకారులు త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. నిమ్మలకుంట కళాకారులు రామాయణంలో సీతాపహరణ ఘట్టాన్ని తోలుబొమ్మల రూపంలో ప్రదర్శించారు. వీటన్నింటినీ ఆస్వాదించిన ప్రధాని మోదీ తన్మయత్వం చెందారు.

వేలాడే స్తంభం..

గర్భగుడి ప్రదక్షిణ అనంతరం మహా మంటపం పైకప్పు మీద చిత్రీకరించిన 25 X 14 అడుగుల వీరభద్రస్వామి ఉగ్రరూపాన్ని ప్రధాని తదేకంగా తిలకించారు. పది చేతుల్లో వివిధ ఆయుధాలు, పొడవాటి కత్తి, దక్షయజ్ఞం సందర్భంగా దక్షుడి తలను దునుమాడటం లాంటి ఘట్టాలను చరిత్రకారుడు మైనాస్వామి వివరించారు. నాట్యమంటపంలోని శిల్పాలు, తైలవర్ణ చిత్రాలను చూసిన ప్రధాని ముగ్ధులయ్యారు. వేలాడే స్తంభాన్ని ఆసక్తిగా తిలకించారు. వేలాడే స్తంభం ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. స్తంభం దిగువన మైనాస్వామి ఒక పలుచటి వస్త్రాన్ని ఉంచగా ప్రధాని దాన్ని స్వయంగా స్తంభం నుంచి వెలుపలకు తీశారు. కిరాతార్జునీయ ఘట్టం, గిరిజా కల్యాణం, వీరభద్ర అనుగ్రహం పొందిన ఆలయ నిర్మాత విరుపణ్ణ, ఆయన పరివారం తైలవర్ణ చిత్రాలను తదేకంగా పరిశీలించారు. వటపత్రసాయి వర్ణచిత్రం గురించి చరిత్రకారుడు వివరించినప్పుడు బాలకృష్ణుడి కన్నులను చిత్రీకరించిన విధానాన్ని మూడు వైపుల నుంచి తిలకించారు. నాట్య మంటపంలోని భిక్షాటనమూర్తి సుందర రూపాన్ని తనివి తీరా చూశారు. భిక్షాటనమూర్తి విగ్రహాలలో భేదాల గురించి ఆసక్తిగా ఆలకించారు. ప్రధాని మోదీని ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం ఆలయ అర్చకులు, కళాకారులను ప్రధాని సన్మానించారు. ప్రధానిని చూసేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

పేదరికంపై పోరాడి గెలిచాం



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

▶ మొదటి పేజీ తరువాయి

పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెంచామన్నారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో జాతీయ కస్టమ్స్, పరోక్ష పన్నులు, నార్కోటిక్స్ అకాడమీ (నాసిన్) కొత్త క్యాంపస్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఎగ్జిబిషన్‌ను తిలకించి ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్‌ఎస్) 74, 75వ బ్యాచ్‌లకు చెందిన ట్రైనీ అధికారులతో పాటు భూటాన్ రాయల్ సివిల్ సర్వీస్ ట్రైనీ ఆఫీసర్లతో ప్రధాని ముచ్చటించారు. పాలసముద్రం విశిష్టతను గుర్తు చేస్తూ ఘన వారసత్వం కలిగిన ఈ ఆధ్యాత్మిక ప్రాంతం దేశ నిర్మాణం, సుపరిపాలనతో మమేకమవుతోందన్నారు. రామాయణంలో ప్రస్తావించిన జటాయు నేలకొరిగిన స్థలం ఇక్కడకు సమీపంలోనే ఉండటం, అయోధ్యలో రామాలయ ప్రతిష్టాపనకు ముందు ఈ ప్రాంతాన్ని సందర్శించడం, ఈ పుణ్యకాలంలో పురాతన ఆలయాల్లో ఆశీర్వాదాలు అందుకోవటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి సత్యసాయిబాబా, స్వాతంత్ర్య సమరయోధుడు పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు, ప్రఖ్యాత తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావు ఈ ప్రాంతవాసులే కావడం గర్వకారణమన్నారు. అద్భుతమైన విజయనగర సామ్రాజ్య సుపరిపాలన మూలాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయని గుర్తు చేశారు.

పన్నుల వసూలులో 'రెవెన్యూ'కీలక పాత్ర

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరామ మందిర ప్రతిష్ఠాపనకు ముందు 'నాసిన్'ను ప్రారంభించడం శుభ సూచకమని ప్రధాని పేర్కొన్నారు. ప్రాచీన తమిళ కవి తిరువల్లువర్ కవితలను ఉటంకిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రజల సంక్షేమానికి దోహదం చేసే పన్నుల వసూలులో రెవెన్యూ అధికారుల కీలక పాత్రను ప్రస్తావించారు. దేశానికి జీఎస్టీ రూపంలో తాము ఆధునిక వ్యవస్థను అందించడంతోపాటు ఆదాయపు పన్నును సరళీకృతం చేశామన్నారు.

మహాత్ముడు కలలుకన్న 'రామరాజ్యం'

'జాతిపిత మహాత్మాగాంధీ పలు సందర్భాల్లో రామరాజ్యం గురించి చెప్పారు. అలాంటి సుపరిపాలన అందాలని ఆకాంక్షించారు. రామరాజ్యం ఆలోచన నిజమైన ప్రజాస్వామ్యం వెనుక ఉన్న భావన అని అన్నారు. రామరాజ్యంలో పన్నుల వ్యవస్థ గురించి తులసీదాస్ రామ్ చరిత్ మానస్‌లోనూ ఎంతో గొప్పగా వర్ణించారు'అని ప్రధాని పేర్కొన్నారు. 'రామ రాజ్య వాసి (పౌరులు).. తల ఎత్తుకుని న్యాయం కోసం పోరాడు.. అందరినీ సమానంగా చూడు.. బలహీనులను రక్షించు.. ధర్మాన్ని నిలబెట్టు'అనే సంస్కృత శ్లోకాన్ని ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటం, అవినీతిపరులపై చర్యలు తీసుకోవడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. దేశ నిర్మాణంలో తమ కృషిని గుర్తించాలని అధికార యంత్రాంగాన్ని కోరారు. పాలసముద్రం పర్యటనకు ముందు లేపాక్షిలోని వీరభద్ర స్వామి ఆలయాన్ని ప్రధాని సందర్శించారు. భక్తులతో కలిసి భజనలు, కీర్తనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, పరోక్ష పన్నుల బోర్డు చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ స్థాయికి 'నాసిన్' కీర్తి

'అనంత'లో నెలకొల్పడం ఆనందదాయకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, పుట్టపర్తి: అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రపంచస్థాయి సంస్థ 'నాసిన్' అకాడమీని నెలకొల్పినందుకు ప్రధాని నరేంద్రమోదీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధన్యవాదాలు తెలియచేశారు. మంగళవారం శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) అకాడమీ ప్రారంభోత్సవంలో సీఎం జగన్ ప్రధానితో కలసి పాల్గొన్నారు. 'నాసిన్'ను తీసుకొచ్చే గొప్ప ప్రయత్నం చేయడమే కాకుండా పట్టుబట్టి సాధించేందుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలుసార్లు ఇక్కడికి రావడం మన కళ్లెదుటే కనిపించిన వాస్తవమన్నారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక సంస్థ మన రాష్ట్రం పేరు, ప్రతిష్టలను దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిబింబిస్తూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, అన్నింటిని అనుసంధానించే గొప్ప సంస్థగా నిలవాలని ఆకాంక్షించారు.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి: ప్రధాని

పీఎం జన్‌మన్ పథకం లబ్ధిదారులతో వర్చువల్ సమావేశం



వర్చువల్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రధాని

కడ్తాల్: ఆదివాసీలకు ప్రభుత్వ పథకాలు అందజేయడమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. జన్‌మన్ పథకం లబ్ధిదారులైన చెంచు తెగలతో సోమవారం ఆయన ఢిల్లీ నుంచి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గిరిజన వసతిగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ సుశీల్ విమల్, గురుకుల కార్యదర్శినవీన్ నికోలస్, జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా షెడ్యూల్ తెగల జనాభా 10.45 కోట్లు ఉందని, 18 రాష్ట్రాలు, అండమాన్ నికోబార్ దీవుల్లో 75 ఆదివాసీ తెగలు సామాజికంగా, విద్య, ఆర్థిక రంగాల్లో పూర్తిగా వెనకబడి ఉన్నట్లు గుర్తించామని ప్రధాని తెలిపారు. వీరికి సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని వివరించారు. ఆదివాసీ కుటుంబాలకు వ్యక్తిగత హక్కులు కల్పించడం, సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషిచేస్తోందని తెలిపారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తెస్తాం

ఎస్టీఎఫ్ కేలండర్ ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తెస్తామని, రాష్ట్రంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. విద్యార్థులకు సరైన విద్యను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీఎఫ్) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 కేలండర్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు తదితరులు ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను సత్కరించారు.

నేడు ధరణి కమిటీ మలిభేటీ

రోడ్‌మ్యాప్ తయారీలో భాగంగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ పునర్నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ రెండో సమావేశం నేడు(బుధవారం) జరగనుంది. సచివాలయంలో ఉదయం 11 గంటలకు కమిటీ సభ్యులు భేటీ కానున్నారు. కమిటీ పనితీరును నిర్దేశించుకోవడంలో భాగంగా రోడ్‌మ్యాప్ రూపకల్పనకు అవసరమైన అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని తెలుస్తోంది. కాగా, ఇప్పటికే ధరణి పోర్టల్‌కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కమిటీ సభ్యులు రెవెన్యూ శాఖ నుంచి తీసుకున్నారని తెలుస్తోంది.

దావోస్‌లో రేవంత్ వ్యాఖ్యలు అసంబద్ధం



సాక్షి, హైదరాబాద్: దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంబద్ధ, అసమర్థ వ్యాఖ్యలు చేస్తూ రాష్ట్రానికి అపకీర్తి తీసుకురావద్దని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ఒక ప్రకటనలో హితవు పలికారు. అణు రియాక్టర్స్, రింగ్ రోడ్లు, డూప్లికేట్ వంటి అర్థ రహిత వ్యాఖ్యలు.. సీఎంకు వ్యక్తిగతంగా, తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి ప్రశంసలు తీసుకురాలేవని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వేదికలపై రేవంత్ చౌకబారు రాజకీయ వాచాలతను ఆపేయాలని సూచించారు. శ్రీధర్‌బాబును పక్కన పెట్టి, తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులను నాశనం చేయడంతోపాటు రాష్ట్రానికి సీఎం అప్రతిష్ట తెస్తున్నారని విమర్శించారు.

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బెదిరింపు కాల్స్

నిందితులపై చర్యలకు డీజీపీకి లేఖ

సాక్షి, హైదరాబాద్: తనను చంపుతామని, తన కుమారుడిని కిడ్నాప్ చేస్తామంటూ కొందరు ఆగంతకులు తరచూ ఫోన్‌కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ ఆరోపించారు. తనకు ఫోన్‌కాల్స్ చేసి బెదిరిస్తున్న వారిపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేయించాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రాజాసింగ్ మంగళవారం డీజీపీ రవిగుప్తాకు లేఖ రాశారు. శ్రీరామ నవమి శోభాయాత్ర సైతం చేయవద్దని ఆగంతకులు బెదిరిస్తున్నట్టు పేర్కొన్నారు. కొన్ని ఉగ్రవాద సంస్థలకు చెందిన వారి నుంచి ఈ బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, గతంలో ఇదే అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని తెలిపారు. ఈనెల 14 ఉదయం 9 గంటల నుంచి బెదిరింపు ఫోన్‌కాల్స్ మళ్లీ మొదలయ్యాయని పేర్కొన్న రాజాసింగ్ ఏ సమయంలో, ఏ నంబర్ల నుంచి వచ్చాయో డీజీపీకి రాసిన లేఖలో పేర్కొన్నారు.

దావోస్‌లో సీఎం బృందం

- తొలిరోజు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రెసిడెంట్ బోర్గ్‌తో భేటీ
- ఇథియోపియా ఉప ప్రధానితో పారిశ్రామిక రూట్ మ్యాప్‌పై చర్చ
- రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ పెంపుపై నాస్కామ్ ప్రెసిడెంట్‌తో సంప్రదింపులు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రతినిధి బృందం రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా పలు భేటీల్లో పాల్గొంటోంది. ఐటీ, జీవ, వైద్య రంగాల్లో తెలంగాణ శక్తిని ప్రపంచానికి చాటడంతో పాటు, భారీ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా కీలక చర్చలను ప్రారంభించింది. తొలిరోజు డబ్ల్యూఈఎఫ్ ప్రెసిడెంట్ బోర్గ్ బ్రెండెతో సమావేశమైన సీఎం, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఇథియోపియా ఉప ప్రధాని డెమెక్ హసెంటోతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంచుకున్న రూట్ మ్యాప్‌పై చర్చించారు. సీఎం, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం నాస్కామ్ ప్రెసిడెంట్ దేబ్‌జాని ఘోష్‌తోనూ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్, డిగ్రీ చదువుతున్న యువతకు నైపుణ్య శిక్షణ, ఉద్యోగాల కల్పనకు సాయం అందించడంపై సంప్రదింపులు జరిపారు.



సీఎం రేవంత్‌ను సన్మానించిన ప్రవాస భారతీయులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు..: డబ్ల్యూఈఎఫ్ సదస్సులో రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను చాటేలా 'వేర్ ట్రెడిషన్ మీట్స్ ఇన్నోవేషన్'ని నాదంతో తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేశారు. బతుకమ్మ, బోనాల పండుగలు, చారిత్రక వారసత్వ సంపదకు చిహ్నం చార్మినార్‌తో పాటు చేర్యాల పెయింటింగ్, పోచంపల్లి ఇక్కత్, టీ హబ్‌తో పాటు విభిన్న రంగాల విజయాలు చాటే లా పెవిలియన్‌ను తీర్చిదిద్దారు. భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో తెలంగాణ అనుకూలతలను వివరించేలా నినాదాలు ఏర్పాటు చేశారు.

జ్యూరిచ్‌లో ప్రవాస భారతీయుల స్వాగతం

మూడు రోజుల పాటు జరిగే డబ్ల్యూఈఎఫ్ 54వ వార్షిక సదస్సులో పాల్గొనేందుకు స్విట్జర్లాండ్ వెళ్లిన సీఎం రేవంత్ బృందానికి మార్గం మధ్యలోని జ్యూరిచ్‌లో ప్రవాస భారతీయులు స్వాగతం పలికారు. సమ్మిళిత, సంతులిత అభివద్ధి ద్వారా ప్రజలందరి పురోగతి తమ లక్ష్యమని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నవ తెలంగాణ నిర్మాణం కోసం మొదలైన తమ ప్రభుత్వ ప్రయత్నంలో ఎన్ఆర్ఐలు భాగస్వాములు కావటంపై హర్షం వ్యక్తం చేశారు.

అనూహ్యంగా తెరపైకి బల్మూరి వెంకట్

▶ మొదటి పేజీ తరువాయి

సూచించినట్లు తెలిసింది. ఈ నెల 18న నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉన్న నేపథ్యంలో ఏ క్షణమైనా ఈ ఇద్దరి పేర్లను ఏఐసీసీ ప్రకటిస్తుందని తెలుస్తోంది.

జగ్గారెడ్డికి బీ ఫారాలపై సంతకాల అధికారం

ఇద్దరు ఎమ్మెల్సీ అభ్యర్థులు సమర్పించనున్న బీఫారాలపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి సంతకాలు చేయనున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో, వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో బీఫారాలిచ్చే అధికారాన్ని ఏఐసీసీ జగ్గారెడ్డికి ఇచ్చింది. నామినేషన్ల దాఖలు, ఎమ్మెల్యేల చేత ప్రతిపాదిత సంతకాలు చేయించే వ్యవహారాలను సమన్వయం చేసే బాధ్యతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అప్పగించినట్టు సమాచారం.

అతిపిన్న వయస్కుడిగా రికార్డుకు చాన్స్

దేశంలోనే శాసనమండలికి ఎన్నికైన అతిపిన్న వయస్కుడిగా బల్మూరి వెంకట్ పేరు గడించనున్నారు. ప్రస్తుతం వెంకట్ వయసు 30 సంవత్సరాల 9 నెలలు. 33 ఏళ్ల వయసులో గుజరాత్ మండలికి ఎన్నిక కావడమే రికార్డు అని గాంధీభవన్ వర్గాల సమాచారం.



హైదరాబాద్‌లో సీ4ఐఆర్

- డబ్ల్యూఈఎఫ్‌తో తెలంగాణ ప్రభుత్వ ఒప్పందం
- బయో ఏషియా సదస్సులో భాగంగా ఫిబ్రవరిలో ప్రారంభం
- రాష్ట్రంలో సాంకేతికత ఆధారిత ఆరోగ్య రక్షణే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్'(సీ4ఐఆర్)ను ప్రారంభించేందుకు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్), తెలంగాణ ప్రభుత్వం నడుమ ఒప్పందం కుదిరింది. బయో ఏషియా సదస్సు–2024లో భాగంగా ఫిబ్రవరి 24న ఈ సెంటర్‌ను ప్రారంభిస్తారు. ఒప్పందంలో భాగంగా రాష్ట్రంలో సాంకేతికత ఆధారిత ఆరోగ్య రక్షణ మెరుగుపరిచేలా కార్యక్రమాలు రూపుదిద్దుకుంటాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలిరోజు ఫోరమ్ అధ్యక్షుడు బోర్గ్ బ్రెండె ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రపంచ స్థాయిలో ఫోరమ్, తెలంగాణ స్థాయిలో తమ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరిస్తోందని తెలిపారు.

హెల్త్ టెక్ హబ్‌గా తెలంగాణ

తెలంగాణను హెల్త్ టెక్ హబ్‌గా, ప్రపంచ గమ్యస్థానంగా మార్చటంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా ఈ సేవలను అందించే సంకల్పంతో సీ4ఐఆర్ పని చేస్తుందన్నారు. 'హెల్త్ టెక్, లైఫ్ సైన్సెస్ రంగంలో భవిష్యత్తుకు నాయకత్వం వహించేందుకు సరిపడా అవకాశాలెన్నో భారతదేశానికి ఉండగా, అందులో తెలంగాణ ముందంజలో ఉంది. ప్రపంచంలోనే మొదటి ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా సీ4ఐఆర్ ఏర్పాటుతో తెలంగాణ మరింత కీలకంగా మారుతుంది'అని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సెంటర్ ఫర్ హెల్త్ అండ్ హెల్త్‌కేర్ విభాగం అధిపతి డాక్టర్ శ్యామ్ బిషెన్ పేర్కొన్నారు.

ఐదు ఖండాల్లో సీ4ఐఆర్ విస్తరణ

వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటైన సీ4ఐఆర్ నెట్‌వర్క్ ప్రపంచ వ్యాప్తంగా ఐదు ఖండాల్లో విస్తరించి ఉంది. తెలంగాణలో ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే సెంటర్ ప్రపంచంలో 19వది. కాగా హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ రంగం నేపథ్యంలో ఏర్పాటవుతున్న సీ4ఐఆర్ కేంద్రాల్లో హైదరాబాద్ సెంటర్ మొట్టమొదటిగా పరిగణిస్తున్నారు. స్వయం ప్రతిపత్తితో లాభాపేక్ష లేకుండా హైదరాబాద్ కేంద్రం పనిచేస్తుంది. తెలంగాణలోని ఇంక్యుబేటర్ల ద్వారా వచ్చే ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లపై ప్రభావం చూపడం దీని లక్ష్యం. రాష్ట్రంలోని ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న వారిలో దాదాపు సగం మంది ఉద్యోగులు ఫార్మా, మెడ్‌టెక్, బయోటెక్నాలజీ రంగాలలో పని చేస్తున్నారు. సీ4ఐఆర్‌తో రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆరోగ్య సంరక్షణలో కొత్త సాంకేతిక విధానాలు, కొత్త ఆవిష్కరణల వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

నేడు టీపీసీసీ ఎస్టీ సెల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ గిరిజన విభాగం (ఎస్టీ) సెల్ సమావేశం బుధవారం గాంధీభవన్‌లో జరగనుంది. వచ్చే పార్లమెంటు ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు ఈ భేటీ ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్టీ సెల్ పనితీరును సమీక్షించుకోవడంతో పాటు పార్లమెంటు ఎన్నికల దిశలో కార్యాచరణ రూపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ తెలిపారు. మంగళవారం కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌తో కలిసి గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఎస్టీ జనాభాలో దాదాపు 80 శాతం కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని చెప్పారు. ఇందుకు ప్రతిఫలంగా ఎస్టీ వర్గాలకు చెందిన సీతక్కకు పార్టీ మంత్రి పదవి ఇచ్చి గౌరవించిందని చెప్పారు. బుధవారం నాటి భేటీలో భారత్ జోడో న్యాయ్ యాత్ర లక్ష్యం, ఉద్దేశాన్ని వివరిస్తామని చెప్పారు.

మైనార్టీ నేతల భేటీలు

మైనార్టీ నేతలతో లోక్‌సభ నియోజకవర్గాల వారీ సమీక్షలను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. మంగళవారం సికింద్రాబాద్, హైదరాబాద్, చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన మైనార్టీ నేతలతో సమావేశాలు జరిగాయి. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మూడు నెలల్లో ట్రిపుల్ ఆర్ భూసేకరణ

- ఇదే వ్యవధిలో పనులకు టెండర్లు
- రీజనల్ రింగ్ రోడ్డుపై సీఎం ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్ : రీజనల్ రింగ్‌రోడ్డు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ మూడు నెలల్లో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అయితే ఈ భూ సేకరణ పనులను గత ప్రభుత్వం కొంతకాలంలో పెండింగ్‌లో పెట్టినట్టు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి. భారత్‌మాల పరియోజన ఫేజ్ వన్‌లో రీజనల్ రింగ్ రోడ్డు (ఉత్తరం) 158.645 కిలోమీటర్ల మేరకు నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణకు రాష్ట్రం సగం వాటా నిధులు భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టుకు 1935.35 హెక్టార్ల భూసేకరణ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1459.28 హెక్టార్ల భూసేకరణ పురోగతిలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. గత ప్రభుత్వ సహాయ నిరాకరణ ధోరణి కారణంగా తొమ్మిది నెలలుగా భూసేకరణలో ఎటువంటి పురోగతి లేదని, నేషనల్ హైవే అథారిటీతో తలెత్తిన చిక్కుముడులను పరిష్కరించే ప్రయత్నం జరగలేదని, దీంతో ప్రాజెక్టు ముందుకు కదలని పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ ఆర్ పై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణను మూడు క్లస్టర్లుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డు లోపల అర్బన్ తెలంగాణ, ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ రీజనల్ రింగ్ రోడ్డు వరకు సెమీ అర్బన్ క్లస్టర్, రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత ఉన్న ప్రాంతాన్ని రూరల్ క్లస్టర్‌గా గుర్తించి పరిశ్రమల స్థాపనకు కొత్త విధానాన్ని రూపకల్పన చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇందులో భాగంగా రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవశ్యాన్ని సీఎం అధికారులతో చర్చించారు. ఈ రహదారి పూర్తయితే రవాణా సదుపాయాలతో సెమీ అర్బన్ జోన్‌లో కొత్త పరిశ్రమలు రావటంతో పాటు అభివృద్ధి వేగం పుంజుకుంటుందన్నారు. నిలిచిన భూసేకరణను వచ్చే 3 నెలల్లో పూర్తి చేయాలని, భూసేకరణతో పాటే ఆర్ఆర్ఆర్ (ఉత్తరం) పనులకు కూడా టెండర్లు పిలవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణం) భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించాలని, తదుపరి భూసేకరణ ప్రణాళికను రూపొందించాలని కేంద్ర రవాణా ఉపరితల శాఖ మంత్రి నితిన్ గడ్కారికి సీఎం విజ్ఞప్తి చేశారు.

తమ్మినేని ఆరోగ్యం విషమం

▶ మొదటి పేజీ తరువాయి

తమ్మినేనికి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి ఇంకా విషమంగా ఉందని, వెంటిలేటర్‌పై ఉన్నారని ఆ బులెటిన్‌లో ఏఐజీ వెల్లడించింది. ఆస్పత్రిలో తమ్మినేని ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో సంప్రదించి తగిన వైద్యం అందించడానికి పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, డీజీ నరసింహారావు, పి.ప్రభాకర్ పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు తమ్మినేనిని మాజీ మంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. తమ్మినేని ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. 2004లోనూ తమ్మినేనికి గుండెనొప్పి రావడంతో వైద్యులు స్టంట్స్ వేశారు.



పురుగు మందుతాగి.. సెల్ఫీ వీడియో తీసి..

భూ వివాదంతో ఇద్దరు రైతుల అఘాయిత్యం.. ఇద్దరిపై కేసు


పెగడపల్లి: ఇద్దరు రైతుల మధ్య ఏర్పడిన భూ వివాదం.. పరస్పరం పురుగు మందు తాగి తీసుకున్న సెల్ఫీ వీడియో కలకలం రేపింది. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం దోమలకుంటలో జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. బాధితులను కుటుంబ సభ్యులు జగిత్యాల ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ సతీశ్, రైతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు బండారి శ్రీనివాస్ నుంచి అదే గ్రామానికి చెందిన తొట్ల శేఖర్ 49 గుంటల వ్యవసాయ భూమి కొన్నాడు. అందులో నుంచి 31 గుంటలు మాత్రమే పట్టా చేశాడు. కొద్ది రోజులకు తను విక్రయించిన భూమి తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్ కోరాడు. దీనిపై పెద్దల సమక్షంలో పంచాయితీ చేసుకుని భూమి ఇచ్చేందుకు శేఖర్ ఒప్పుకున్నాడు. డబ్బుల చెల్లింపు విషయంలో ఇద్దరి వివాదం తలెత్తింది. ఈ క్రమంలో తన భూమి ఇవ్వకుండా శేఖర్, ఆయన కుటుంబ సభ్యులు తనను వేధిస్తూ చంపేందుకు ప్రయత్నిస్తున్నారంటూ శ్రీనివాస్ సోమవారం పురుగు మందు తాగుతూ తీసిన సెల్ఫీ వీడియో పోస్టు చేశాడు. దీనికి ప్రతిగా శేఖర్ స్పందిస్తూ.. శ్రీనివాస్ తనను, తన కుటుంబ సభ్యులను ఇబ్బంది పెడుతున్నాడని, అతడి నుంచి న్యాయం చేయాలని పురుగు మందు తాగుతూ తీసిన సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇద్దరిని వారివారి కుటుంబ సభ్యులు జగిత్యాలలోని వేర్వేరుగా ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆత్మహత్యాయత్నం చేసి జగిత్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వేర్వేరుగా పరామర్శించారు.

బడ్జెట్ 'టైమ్'

2024–25 వార్షిక బడ్జెట్ తయారీలో నిమగ్నమైన రాష్ట్ర ప్రభుత్వం

ఈనెల 18 నుంచి శాఖల వారీగా సమీక్షించనున్న ఆర్థిక మంత్రి భట్టి

సాక్షి, హైదరాబాద్: వార్షిక బడ్జెట్ రూపకల్పనలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమైంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను రూపొందించడంలో భాగంగా ఆర్థికశాఖ కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలను ఆన్‌లైన్‌లో స్వీకరించిన ఈ శాఖ ఈనెల 18 నుంచి సదరు ప్రతిపాదనలను సమీక్షించనుంది. ఆర్థికశాఖ మంత్రి హోదాలో మల్లు భట్టి విక్రమార్క సచివాలయం వేదికగా ఈ సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. రోజుకు ఇద్దరు మంత్రుల పర్యవేక్షణలో ఉన్న శాఖల వారీగా ఈ సమావేశాలు నిర్వహించనున్నట్టు సమాచారం. ఇందుకుగాను ఇప్పటికే షెడ్యూల్ రూపొందించిన ఆర్థికశాఖ ఆయా శాఖలు పంపిన ప్రతిపాదనలకు అనుగుణంగా అవసరమైన డేటా తీసుకురావాలని సూచించింది. అన్ని ప్రభుత్వ శాఖల ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఆమోదించి వాటిని బడ్జెట్ ప్రతిపాదనల్లో చేరుస్తామని, ఆర్భాటాలకు పోయి పంపిన ప్రతిపాదనలను వెనక్కి పంపుతామని ఆర్థికశాఖ అధికారులు చెబుతున్నారు. మారిన ప్రభుత్వ ప్రాధాన్యాల దృష్ట్యా ఆరుగ్యారంటీల అమలుకు అవసరమైన నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయించడానికి ప్రాధాన్యం ఉంటుందని, ఇప్పటికే ఉన్న పథకాలను కొనసాగిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వ మార్కు పథకాలను రానున్న బడ్జెట్ నుంచి ప్రారంభించేందుకు వీలుగా ప్రతిపాదనలు రూపొందిస్తామని అంటున్నారు.ఐదేళ్ల కేంద్ర నిధుల సగటును తీసుకుని వాటి ఆధారంగా గ్రాంట్ ఇన్ ఎయిడ్ ప్రతిపాదించనున్నారని, అవసరమైతే గత ఏడాది కన్నా బడ్జెట్ ప్రతిపాదనలు తగ్గినా ఆశ్చర్యం లేదని తెలుస్తోంది.



ఆరోగ్యం ఉన్నవాడు ఆశను కలిగి ఉంటాడు.
ఆశ ఉన్నవాడు ప్రతిదీ కలిగి ఉంటాడు.
– థామస్ కార్లయిల్

సాక్షి

బుధవారం, 17 జనవరి 2024

ట్రంప్ వైపే 'అయోవా'!

అమెరికాలోని అయోవా రాష్ట్రం అందరి భయాలనూ నిజం చేసింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి రెండోసారి రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్న డోనాల్డ్ ట్రంప్‌కు ఆ రాష్ట్రంలోని పార్టీ ప్రతినిధులు పట్టం కట్టారు. దేశానికి ట్రంప్ బెడదను నివారించటంలో అయోవా రిపబ్లికన్లు తోడ్పడితే బాగుణ్ణని చాలామంది పెట్టుకున్న ఆశలు తలకిందయ్యాయి. ఇదే రేస్‌లోవున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి అయోవాలో తగినన్ని ఓట్లు రాబట్టలేక పోటీకి స్వస్తిచెప్పారు. మెరుగ్గా ఓట్లు పడకపోతే పోటీ నుంచి తప్పుకుంటారేమోనని వివేక్ మద్దతుదారులు భయపడ్డారు. చివరకు అదే జరిగింది. ముమ్ముందు ఏమవుతుందన్నది పక్కనబెడితే అయోవాలో ట్రంప్ సాధించిన విజయం అనేక విధాల కీలకమైనది. ఇదే రాష్ట్రంలోని రిపబ్లికన్లు ఎనిమిదేళ్లక్రితం అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం జరిగిన ఎన్నికల్లో ట్రంప్‌ను పట్టించుకోలేదు. అప్పట్లో ఆయనకు కేవలం 21 శాతం ఓట్లు పోలయ్యాయి. రెండేళ్ల క్రితం నిర్వహించిన సర్వేల్లో సైతం రిపబ్లికన్లలో అనేకులు విముఖంగానే వున్నట్టు తేలింది. కేవలం కార్మికవర్గ ఓటర్లు మాత్రమే ఆయన వైపు మొగ్గుచూపుతున్నారని, పార్టీలోని కాలేజీ గ్రాడ్యుయేట్స్‌లో అత్యధికులకు ట్రంప్ పోకడలు నచ్చటం లేదని ఆ సర్వేలు తెలిపాయి. వేరేచోట్ల ముందంజలోవున్న ట్రంప్‌ను అయోవాలో అడ్డుకోగలిగితే పార్టీ తరఫున దేశాధ్యక్షుడిగా పోటీ చేయటానికి తన అవకాశాలు మెరుగుపడతాయని డీశాంటిస్ లెక్కలేశారు. కానీ ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి.

విధానాలకూ, నిబంధనలకూ కట్టుబడి ఉండటం ముఖ్యమా... లౌక్యంగా పోవటం మంచిదా అన్న మీమాంస చాలా పాతది. డోనాల్డ్ ట్రంప్ ఒక నీలి చిత్రాల నటి నోరునొక్కేందుకు తన న్యాయవాది ద్వారా ముడుపులు చెల్లించారన్న అభియోగం విచారణార్హమైనదేనని మన్‌హట్టన్ గ్రాండ్ జ్యూరీ నిర్ధారించినప్పుడు అనేకులు లబలబలాడారు. కేసులు పెడితే సానుభూతి వెల్లువెత్తుతుందని, ఆయన బలపడతాడని హెచ్చరించారు. కానీ డెమాక్రాట్లు వినలేదు. ఇక 2020నాటి అధ్యక్ష ఎన్నికల వ్యవహారం సరేసరి. ఓటమి తప్పదని గ్రహించిన ట్రంప్ వాటిని తారుమారు చేయాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. న్యాయస్థానాల్లో కేసులు వేశారు. చివరకు ఓట్ల లెక్కింపును అడ్డుకోవటం కోసం కేపిటల్ హిల్ భవనానికి తరలిరావాలంటూ మద్దతుదార్లను రెచ్చగొట్టారు. పర్యవసానంగా భారీయెత్తున హింస చోటుచేసుకుంది. పలువురు మరణించారు. ఈ ఉదంతాల్లో ట్రంప్‌పై కేసులున్నాయి. అదిగాక తనకు ప్రధాన పోటీదారు కాబోతున్న డెమాక్రటిక్ అభ్యర్థి జో బైడెన్‌పై విచారణకు ఆదేశించాలని 2019లో ఉక్రెయిన్‌పై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలో ఒకసారి... ఓట్ల లెక్కింపు సమయంలో మద్దతుదార్లను హింసకు ప్రేరేపించారన్న అభియోగంలో మరోసారి ప్రతినిధుల సభ ఆయన్ను అభిశంసించింది. రెండుసార్లూ తమకు బలం వున్న సెనేట్‌లో రిపబ్లికన్లు ట్రంప్‌ను నిర్దోషిగా బయటపడేశారు. చివరకు జరిగేదేమిటో తెలిసినప్పుడు ట్రంప్‌పై ఇదంతా అవసరమా అన్నది విశ్లేషకుల వాదన. కానీ డెమాక్రాట్లకు ఇదంతా పట్టలేదు. నిజానికి సానుభూతే అయోవాలో కొత్త ఓటర్లను ఆయనవైపు మళ్లించిందని తేలింది. తాజా ఎన్నికకు ముందు జరిగిన సర్వేల్లో ప్రత్యర్థుల కన్నా ట్రంప్ చాలా ముందున్నారు. ట్రంప్‌పై పెట్టిన కేసులన్నీ బోగస్‌వేనని పార్టీ ఓటర్లు చెప్పడం గమనించదగ్గది. నిజానికి అయోవాపై ట్రంప్ పెద్దగా నమ్మకం పెట్టుకోలేదు. 2016లో పార్టీలో తనపై పోటీచేసిన సెనెటర్ టెడ్ క్రజ్ రిగ్గింగ్‌తో గెలిచారని అప్పట్లో ఆయన గొడవ చేశారు. ఈసారి అదే పని డీశాంటిస్ చేయబోతున్నారని గగ్గోలు పెట్టారు. కానీ అందుకు భిన్నంగా కార్మికవర్గ ఓటర్లతోపాటు గ్రాడ్యుయేట్లు కూడా ట్రంప్‌ను బలంగా సమర్థించారని తేలింది. ఇక్కడ డీశాంటిస్‌కు గట్టి మద్దతుందని అంచనా వేసిన నిక్కీ హేలీ ఆయనకు వ్యతిరేకంగా భారీయెత్తున ఖర్చుచేశారు. పైగా డెమాక్రటిక్ ఓటర్లు కొందరు హేలీ కోసం రిపబ్లికన్ అభ్యర్థిత్వాన్ని స్వీకరించి, ఆమెకు అనుకూలంగా ఓట్లు వేశారు. బహుశా అందుకే కావొచ్చు...డీశాంటిస్ కన్నా కాస్త మెరుగ్గా ఓట్లు సాధించి ఆమె ద్వితీయ స్థానంలో నిలిచారు. అయోవాతో మొదలైన రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి ఎంపిక ప్రక్రియ వచ్చే జూన్ 4తో ముగుస్తుంది. పార్టీలో ఎన్నడూ లేనివిధంగా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయాక కూడా రిపబ్లికన్లకు ట్రంపే నాయకుడిగా కొనసాగుతున్నారు. నోటి దురుసుతనం, ప్రత్యర్థులపై తీవ్రంగా విరుచుకుపడటం లాంటివి ఆయనకు తోడ్పడుతున్నాయో... ఆ పార్టీయే అటువంటివారిని నెత్తినపెట్టుకునే స్థాయికి దిగజారిందో అనూహ్యం. ట్రంప్‌ను విమర్శిస్తే ఆయన మద్దతుదార్లు దాడి చేస్తారని పార్టీలోని ప్రత్యర్థులే బెంబేలెత్తటం గమనించదగ్గది.

ట్రంప్ ఇటీవలి వ్యాఖ్యలు అందరినీ హడలెత్తిస్తున్నాయి. వలసదారులు దేశాన్ని విషపూరితం చేస్తున్నారని, వారిని తరిమికొట్టడమే తన ధ్యేయమని ఆ మధ్య ప్రకటించారు. తాను మళ్లీ అధికారంలోకొస్తే నియంతగా మారి వ్యతిరేకులందరినీ తుడిచిపెడతానని, అసమ్మతిని అణిచేస్తానని హెచ్చరించారు. పార్టీలో ఆయనతో పోటీపడుతున్నవారిదీ అదే బాణీ. తాను గెలిస్తే ఎఫ్‌బీఐని రద్దుచేస్తానని, ప్రభుత్వ సిబ్బందిలో 75 శాతం మందిని ఇంటికి పంపుతానని వివేక్ ఎలుగెత్తారు. ఉన్నంతలో నిక్కీ హేలీ కన్నా డీశాంటిస్ మెరుగే అయినా ట్రంప్ ముందు ఆయన నిలబడలేరని తాజా ఎన్నికల తీరు చూస్తే అర్థమవుతుంది. ఇటు డెమాక్రాట్లు సైతం 81 ఏళ్ల జో బైడెన్‌ను మించి మరెవరినీ ఎంపిక చేసుకోలేక ట్రంప్ సునాయాస విజయానికి పరోక్షంగా బాటలు పరుస్తున్నారు.

జమిలి అమలుకు అవరోధాలు

విశ్లేషణ



మంజీవ్ సింగ్ పురి

ఒక దేశ రాజకీయ నిర్మాణంలో వివిధ స్థాయులలో ఏకకాల ఎన్నికల కంటే అసెంబ్లీలకు, పార్లమెంట్ ఎన్నికలకు వేర్వేరు నిర్ణీత తేదీలు ఉండటం సర్వ సాధారణం. అయితే, భారత్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయాన్ని రూపొందించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ, పార్లమెంటరీ కమిటీ నిశ్చితాభిప్రాయం ఏమిటంటే, రెండు దశల్లో ఎన్నికలు జరగాలన్నదే! కొన్ని రాష్ట్రాలకు లోక్‌సభ పదవీ కాలం మధ్యలోనూ, మరికొన్నింటికి లోక్‌సభతోపాటు ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ, పదేపదే జరిగే ఎన్నికల ద్వారా అనవసరంగా సమయం, ఖర్చు చేయకూడదనే ఆలోచన నుంచి వచ్చిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' విధానం అనేది దాని అమలు సాధ్యతపైనే ఆధారపడి ఉంది.

ఒక దేశం, ఒకే ఎన్నిక' విధానం అమలుకు రాజ్యాంగ సవరణలు, ఇతర పరిశీలనల విషయమై ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ... దీనికి సంబంధించి ప్రజల సూచనలను కోరింది. 'ఒక దేశం, ఒకే ఎన్నికలు' అనే ఆలోచనకు ప్రధాన కారణం సమయం, ఖర్చు, ఆదా చేయడం. ఈ రెండు అంశాలు ప్రపంచవ్యాప్తంగా వర్తిస్తాయి. కానీ, సమాఖ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్య దేశాలలో దాదాపు ఎక్కడా సమాఖ్య స్థాయిలో, ప్రాంతీయ (రాష్ట్ర) స్థాయులలో ఏకకాల ఎన్నికలు జరగడం లేదు. నిజానికి సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, చట్టం – న్యాయంపై ఏర్పర్చిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, ఏకకాల ఎన్నికల అంశాన్ని పరిశీలించిన 79వ నివేదిక... ప్రపంచవ్యాప్తంగా దక్షిణాఫ్రికా, స్వీడన్ దేశాల్లోని రెండు కేసులను మాత్రమే ఉదాహరించింది.

సార్వత్రిక వయోజన ఓటు హక్కును ప్రతిపాదిస్తున్న దక్షిణాఫ్రికాలో ఎన్నికలు 1994లో మాత్రమే ప్రారంభమయ్యాయి. స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్... సమాఖ్య, ప్రాంతీయ స్థాయులలో (వెస్ట్రన్ కేప్ మినహా) దేశమంతటా విజయం సాధించడం కొనసాగించింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి 25 ఏళ్లలో, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా గెలుస్తూ వచ్చిన భారతదేశ పరిస్థితికి ఇది భిన్నమైనది కాదు. భారతదేశంలో మరింత స్పర్థాత్మక రాజకీయ దృశ్యం కారణంగా, ఆ తర్వాత హంగ్ అసెంబ్లీలు (హంగ్ పార్లమెంటు కూడా), పార్టీని మొత్తంగా ఖాళీ చేసి వేరే పార్టీలోకి గెంతేయడం (ఫ్లోర్ క్రాసింగ్) మొదలైనవి కనిపించడం ప్రారంభమైంది. ఫలితంగా చట్టసభల రద్దు, ఎన్నికలు, వివిధ సమయాల్లో పార్లమెంటుకు, రాష్ట్రాలకు (శాసనసభ లేకుండా) ఆరు నెలల కంటే ఎక్కువ విరామం ఏర్పడుతూ వచ్చింది. కేంద్రంలో, రాష్ట్రాలలో ఇలాంటి స్థితి ప్రజాస్వామ్యానికి ఆమోదయోగ్యం కాదు. పైగా భారత రాజ్యాంగం దీనికి అనుమతించదు.

స్వీడన్ విషయానికి వస్తే ఆ దేశం మునిసిపాలిటీలు, రీజియన్లలో ఏకీకృత ప్రభుత్వాన్ని కలిగి ఉంది, కానీ రీజియన్‌లలో మాత్రం ఫెడరల్ వ్యవస్థలోని ప్రావిన్సుల వలె ఉండదు. పైగా వాటి మధ్యన క్రమానుగత సంబంధం లేదు. ముఖ్యంగా, రెండూ వేర్వేరు రకాల పనులను చేపట్టే స్థానిక ప్రభుత్వ రూపాలు. స్వీడిష్ రాజ్యాంగం ముందస్తు ఎన్నికలను అనుమతిస్తుంది. అయితే ఇవి రద్దు అయిన కాలం నుండి మిగిలి ఉన్న కాలానికి మాత్రమే పరిమితమవుతాయి.



జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలో తొలి సమావేశం (ఫైల్ ఫొటో)

ఒక దేశంలోని రాజకీయ నిర్మాణంలో వివిధ స్థాయులలో ఏకకాల ఎన్నికల కంటే అసెంబ్లీలు, సమాఖ్య పార్లమెంట్‌ల ఎన్నికలకు నిర్ణీత తేదీలు ఉండటం చాలా సాధారణ లక్షణం. పార్లమెంటరీ ప్రభుత్వ రూపాన్ని కలిగి ఉన్న కెనడా సమాఖ్య వ్యవస్థ ఫెడరల్ స్థాయిలోనూ, దాని ప్రావిన్సులలోనూ రెండు చట్టాలను రూపొందించింది. ఎన్నికల నిర్వహణకు ఒక నిర్ణీత తేదీని ప్రతిపాదిస్తుంది, ఆ తేదీ ప్రావిన్స్ నుండి ప్రావిన్స్‌కు మారుతూ ఉంటుంది. ఫెడరల్ ఎన్నికల షెడ్యూల్ వేరొక దానిని అనుసరిస్తుంది. ఆస్ట్రేలియాలో ఫెడరల్ పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల (వాటిలో చాలా వరకు) కాలావధులు వరుసగా మూడు, నాలుగు సంవత్సరాలు ఉంటాయి. తద్వారా అక్కడ జమిలి ఎన్నికలను మినహాయించారు.

'నిర్దిష్ట తేదీ, పదవీకాలం' ఎన్నికల నమూనా తక్షణమే అమెరికాను గుర్తు చేస్తుంది. అక్కడ అధ్యక్ష, గవర్నర్ ఎన్నికలు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే జరుగుతాయి. అధ్యక్షుడు లేదా గవర్నర్ పని చేయనట్లయితే వారి స్థానంలోకి రాగల యోగ్యత ఉన్నవారి కోసం ఒక వ్యవస్థ అమలులో ఉంది. ఆ ప్రక్రియ ద్వారా పూర్తి కాలాన్ని కొనసాగించడం సాధ్యమవుతుంది. అయితే ఇది కొన్నిసార్లు 'ప్రజల స్థాయిలో' ఎన్నికల్లో పోటీ చేయకుండానే 1974లో గెరాల్డ్ ఫోర్డ్ అధ్యక్షుడిగా మారడం వంటి క్రమరాహిత్యాలకు దారి తీస్తుంది. అంతేకాకుండా, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అమెరికా కాంగ్రెస్‌లో, రాష్ట్రాల అసెంబ్లీలలో ప్రతినిధుల సభకు ఎన్నికలు జరుగుతాయి. ప్రైమరీలకు సంబంధించి అమెరికన్ సంప్రదాయం ప్రకారం, దేశం ఆచరణాత్మకంగా ప్రతి సంవత్సరం ఎన్నికల మోడ్‌లో ఉంటుంది.

భారత్‌లో ఆసక్తికరంగా లోక్‌సభ, అసెంబ్లీలకు జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయాన్ని రూపొందించడానికి పెద్ద ప్రయత్నాలు జరిగినప్పటికీ, పార్లమెంటరీ కమిటీ నిశ్చితాభిప్రాయం ఏమిటంటే – రెండు దశల్లో ఎన్నికలు జరగాలన్నదే! కొన్ని రాష్ట్రాలకు లోక్‌సభ పదవీకాలం మధ్యలోనూ, మరి కొన్నింటికి లోక్‌సభతోపాటు ఎన్నికలు జరపాల్సి ఉంటుంది.

సమాఖ్య, ప్రాదేశిక ఎన్నికలను వేరు చేయడం వల్ల ఓటర్లు తమ రాష్ట్రం లేదా ప్రావిన్స్‌లో ఉన్న నాయకులు లేదా జాతీయ ఎన్నికల సమస్యల కారణంగా ఇటూ అటూ అవగల సంభావ్యతకు గురికాకుండా ఉంటారని నమ్మకం. పోరులో ఉన్న ప్రాంతీయ పార్టీలకు (లేదా పార్టీలకు) ప్రత్యేక గుర్తింపు లేనప్పుడు అలాగే ఓటర్లు సులభంగా గుర్తించగలిగేలా పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలకు మధ్య తేడాను సూచించే కారణం లేనప్పుడు ఇది జరిగే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికీ, పదేపదే జరిగే ఎన్నికల ద్వారా అనవసరంగా సమయం, డబ్బులు ఖర్చు చేయకూడదనే ఆలోచన ఆమోదయోగ్యమైనదే. జర్మనీలో ఇటీవల నేపాల్ అనుభవాల నుండి, ఎక్కువ రాజకీయ సుస్థిరతను అందించే రాజ్యాంగపరమైన నిబంధనలు సాధ్యమయ్యే అవకాశం కనిపించింది. ఉదాహరణకు, జర్మన్ బేసిక్ లా, 2015 నేపాలీ రాజ్యాంగం అవిశ్వాసంలో సానుకూల ఓట్లను మాత్రమే అనుమతిస్తాయి. అటువంటి తీర్మానంతో పాటు తదుపరి నాయకుడి పేరు కూడా ఉండాలి.

బ్రిటన్‌లో, కెనడాలో కూడా పార్లమెంటు నిబంధనలను పరిష్కరించే ప్రయత్నాలు... కామన్వెల్త్ సంప్రదాయం ద్వారా సభను రద్దు చేసి, తాజా తీర్పును కోరే హక్కును ప్రధానమంత్రి కలిగి ఉండటం ద్వారా విఫలమయ్యాయి. నేపాల్‌లో అదే సంప్రదాయాన్ని అమలు చేయాలని కోరినప్పుడు, దానిని సుప్రీంకోర్టు 2021లో రెండు సందర్భాల్లో అనుమతించకపోగా, కొత్త నాయకుడిని ఎన్నుకోమని సభను కోరింది. మధ్యంతర ఎన్నికలపై ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా 2017లో ఎన్నికైన సభ పూర్తి ఐదేళ్ల కాల వ్యవధిలో పాలన సాగించేలా అది దోహదపడింది.

వ్యాసకర్త భారత మాజీ రాయబారి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గ్రేట్ ఇండియన్



సుమిత్ నాగల్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకోవటం ద్వారా గ్రాండ్ స్లామ్‌లో గత 35 ఏళ్లలో ఒక సీడెడ్ ఆటగా డిని ఓడించిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించాడు. ఈ విజయం అతడికి 1,20,000 డాలర్లను సంపాదించి పెట్టింది. ఆటకు ముందు తన బ్యాంకు ఖాతాలో 900 యూరోలే ఉన్నాయనడం అతని నిజాయతీ.

– జూలియో రోడ్రిగ్స్, ఫ్రెంచి క్యూరేటర్

అదేం కారణం?!



రిపబ్లికన్‌లు ఇలా ఆలోచిస్తున్నారు: "అయోవా రిపబ్లికన్ పార్టీ చర్చా సదస్సులో పేలవమైన జవాబుల తర్వాత అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి తప్పుకున్న భారత సంతతి వివేక్ రామస్వామి, ఆ వెంటనే ట్రంప్‌కు మద్దతు ప్రకటించారు కనుక అంతిమ విజయం ట్రంప్‌దే." కానీ ఇదే ట్రంప్ 2016 ఎన్నికల్లో అయోవాను కోల్పోయారు కదా!

– సిలాస్ ఎంబురుకి, కెన్యా లా విద్యార్థి

దేవుడా... కాపాడు!



ఓ అల్లాహ్! పాలస్తీనా ప్రజలకు సహాయం చేయండి. వారిని రక్షించండి. ఓ అల్లాహ్! వారి మనోవేదనను, భౌతికమైన బాధల్ని తగ్గించండి. వారిపై మీ కరుణను ప్రసరింపజేయండి. ఓ అల్లాహ్! ఈ సంక్షోభ సమయంలో ప్రజల హృదయాలను తెరిపించండి.

– ఫర్‌ఖాన్, 'షరీఫ్', యు.ఎ.ఇ.

పడి లేచిన పట్టణం



ఫానీ తుపాను 2019లో పూరీ పట్టణాన్ని దెబ్బ తీసినప్పటి నుండి ఈ ఐదేళ్లలో ఎంతో మారింది. నాడు నీటిలో అతలాకుతలమైన పవిత్ర నగరం నేడు జగన్నాథ ఆలయ శ్రీ మందిర్ పరిక్రమ ప్రకల్ప ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. జనవరి 17 నుంచి సరికొత్త పూరీని వీక్షించవచ్చు.

– సౌమ్యజిత్ పట్నాయక్, కళింగ టీవీ

రుచుల రుతువు



నువ్వులు–బెల్లం కలయికలో అద్భుతమైన విశేషం ఏమిటంటే... ఒక రుతువు నిష్క్రమిస్తూ, మరో రుతువు ప్రవేశిస్తున్నప్పుడు తీపిని, చేదును కలిపి (తియ్యదనమే ఎక్కువనుకోండి) ఆరగించడం. మీ అందరికీ సంక్రమణ రుతువు శుభాకాంక్షలు.

– సుఖదా, రచయిత్రి, నాగపూర్

ఇన్ బాక్స్

ఓడుతూ... గెలుస్తూ...

గుజరాత్‌కు చెందిన బిల్కిస్ బానో 22 ఏండ్లుగా జరుపుతున్న న్యాయ పోరాటంలో ఎన్నో ఒడుదొడుకులు! తనపైనా, తన కుటుంబంపైనా దారుణాలకు పాల్పడిన వారికి శిక్ష పడిందని ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో నేరస్థులు జైలు నుంచి విడుదల కావటం ఆమెను విస్మయపరచింది. 2002 గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో బిల్కిస్ బానోపై అత్యాచారం చేయడమే కాకుండా, ఒక పసి పిల్లతో సహా ఆమె కుటుంబ సభ్యులను హత్య చేసిన కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న 11 మంది నేరస్థులను గుజరాత్ ప్రభుత్వం శిక్ష పూర్తి కాకుండానే రెమిషన్‌పై విడుదల చేసింది. ఈ చర్యపై బాధితురాలు బిల్కిస్‌తో పాటూ దేశవ్యాప్తంగా అనేకమంది నిరసన వ్యక్తం చేశారు. బిల్కిస్ ఈ చర్యను సవాల్ చేస్తూ సుప్రీంకోర్ట్ తలుపు తట్టింది. అలాగే సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్, మాజీ ఎంపీ మహువా మొయిత్రా, సుభాషిణీ అలీ, శోభా గుప్తా... వంటివారు ఆమె తరఫున కోర్టుకెక్కారు. మొత్తం వ్యవహారాన్ని సమీక్షించిన ఉన్నత న్యాయస్థానం గుజరాత్ ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టింది. జైలు నుంచి బయటకు వచ్చిన పదకొండు మంది నేరస్థులనూ లొంగిపోవాలని ఆదేశించింది. ఈ తీర్పు నిజంగా దేశంలో ఎంతో మందికి ఊరట కలిగించింది. న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగేలా చేసింది.



బిల్కిస్ బానో

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కానీ, కేంద్రంలో కానీ మహిళలకు జరుగుతున్న అన్యాయాలపై నోరు విప్పేవారే కరవయ్యారు. మణిపుర్‌లో యువతులను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసిన ఘటనపై ఆ పార్టీ ప్రభుత్వాలు కానీ, నాయకులు కానీ స్పందించిన తీరు ఈ సందర్భంగా గమనార్హం. మణిపుర్‌లో హింస ఇంకా ఆగలేదు. ఆరు నెలలు కావస్తున్నా ప్రధానమంత్రి అక్కడికి వెళ్ళలేదు. ఉత్తరప్రదేశ్‌లో ముగ్గురు బీజేపీ ఐటి సెల్ నిర్వాహకులు ఒక యూనివర్సిటీ క్యాంపస్‌లో యువతిపై లైంగికదాడి చేయడం, ఆమెను వివస్త్రను చేసి వీడియో తీయడం లాంటి దారుణాలకు పాల్పడినా ప్రధాని స్పందించలేదు. బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని మహిళా రెజ్లర్లు ఆరోపించి రోడ్లపై నిరాహారదీక్షకు దిగినా బీజేపీ పెద్దల్లో చలనం లేదు. చివరికి వ్యవహారం చేయిదాటిపోతున్న తరుణంలో కొత్తగా ఎన్నికయిన రెజ్లింగ్ సమాఖ్య పాలక వర్గ సభ్యులను సస్పెండ్ చేసి పరువు నిలుపుకొన్నది కేంద్ర సర్కార్.

బిల్కిస్ బానో విషయంలో అయితే బీజేపీ నేతలు అవహేళన చేసే మాటలు మాట్లాడారు. క్షమాభిక్ష మీద వచ్చిన వారికి సన్మానాలు చేశారు. బీజేపీ ఎమ్మెల్యేలు వేదికలు ఎక్కించి వారితో ఉపన్యాసాలు ఇప్పించారు. వారికి మంగళ హారతులు పట్టారు. నిజం చెప్పాలంటే మహిళల మీద బీజేపీ నేతలకు ప్రేమ లేదు. 'బేటీ బచావో, బేటీ పఢావో' వంటివి కేవలం ప్రచారం కోసం వాడే నినాదాలే అని అర్థమవుతోంది. ఇప్పుడు సుప్రీం కోర్ట్ తాజా ఆదేశం మేరకు జైలుకు వెళ్లాల్సిన 11 మందిలో 9 మంది మాయం అయ్యారట! మాయం అయ్యారా? వారికి మద్దతు ఇచ్చే పార్టీ నేతలు వారిని మాయం చేశారా అన్నది తేలాల్సి ఉంది. వారిని తిరిగి జైలుకు పంపడానికి మరో ఆందోళన చేయాల్సి వస్తుందేమో!

– ఎమ్.డి. మునీర్, సీనియర్ జర్నలిస్ట్ । 99518 65223

కాంగ్రెస్ పునరాలోచించుకోవాలి!

అభిప్రాయం



ఉల్లి బాల రంగయ్య

అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరు కారాదని కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయం గర్హనీయం. సనాతన భారతీయ సంస్కృతిని తమదిగా భావించే హిందువులకు శ్రీరాముడి జీవితం, రామాయణంలోని అన్ని ఘట్టాలూ పరమ పవిత్రమైనవి. ఈ నేపథ్యంలో ఈ వ్యాసాన్ని అర్థం చేసుకోవాలి. జనవరి 22 అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ ఉత్సవానికి ప్రపంచ దేశాలలోని ప్రముఖులకు ఆహ్వానాలు పంపినట్లే, ఈ దేశంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులకూ 'అయోధ్య రామ మందిరం తీర్థ క్షేత్ర ట్రస్ట్' ఆహ్వానాలను పంపింది. హిందువుల ఆచారాలు, హిందువుల సంస్కృతిపై నిరంతరం విషం వెళ్లగక్కే వామపక్ష పార్టీలు ఈ మహోత్సవానికి రాలేమని తెగేసి చెప్పాయి. ఈ విషయంలో వామపక్ష నాయకులు సైద్ధాంతిక విభేదత్వాన్ని చక్కగా ప్రదర్శించినందుకు వారిని స్వాగతించాలి.

ఇక సుదీర్ఘకాలం ఈ దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ మిగతా పార్టీల కంటే భిన్నమైంది. ఆ పార్టీ మనుగడ, అస్తిత్వం, ఉత్థాన– పతనాలు ఈ దేశంలోని మెజార్టీ ప్రజలైన హిందువుల ఆలోచనా విధానంతో ముడిపడి ఉన్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం హిందువుల ఆధ్యాత్మిక పరంపరతో, మనోభావాలతో ముడిపడిన విషయం. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్తిగా విఫలమయ్యారనే విషయం ఈ మహోత్సవానికి హాజరు కాకూడదన్న నిర్ణయం ద్వారా తేటతెల్లమైంది. 'కాంగ్రెస్ పార్టీ హిందువులకు వ్యతిరేకమైనది' అనే భావాన్ని అధికార పార్టీ బీజేపీ, హిందుత్వ సంస్థలు బాగా ప్రచారం చేస్తాయనడంలో సందేహం లేదు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఇది ఒక ప్రచారాంశంగా మారుతుంది.

రామమందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల రాజకీయ ప్రాజెక్టు అనీ, అందుకే తాము ఈ మహోత్సవానికి రావడం లేదనీ కాంగ్రెస్ నాయకులు వివరణలు ఇచ్చుకున్నా– ఈ దేశంలోని హిందువులుగానీ, ప్రపంచ దేశాల్లోని హిందువులు కానీ నమ్మరు గాక నమ్మరు. 'రామసేతు' కట్టడాన్ని కూల్చాలని ప్రయత్నించిన సందర్భంలో 'రామాయణం మిథ్య' అంటూ సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసిన విషయం బీజేపీ నాయకులు గుర్తుచేసి, కాంగ్రెస్ పార్టీకి హిందువులను పూర్తిగా దూరం చేసే ప్రయత్నం చేస్తారు. ఆ చిన్న విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులకు అర్థం కాకపోవడం దేశంలోని రాజ కీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయోధ్యలో రామమందిర నిర్మాణంతో హిందువుల కల సాకారం అయిందని బీఆర్ఎస్ నాయకురాలు కె. కవిత వ్యాఖ్యానించడం, శ్రీరాముడు ఈ దేశంలోని హిందువులకే కాదు, ప్రపంచంలోనే మానవాళికి ఆదర్శమని జమ్ము– కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా ప్రకటించడం హిందువుల మనోభావాలను గుర్తించినట్లు కాదా? ఈ విషయంలో కాంగ్రెస్ ఎందుకు తప్పు చేస్తున్నట్లు?



ఇక శ్రీరాముని బీజేపీ తన రాజకీయాలకు వాడుకుంటుందనీ, ఇది రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే విమర్శలు సహేతుకమేనా? కాంగ్రెస్ తాను అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రపతి భవన్‌ను ఇఫ్తార్ విందులకు కేంద్రం చేయడం, ముస్లిం టోపీలు ధరించడంలో పోటీ పడడం, ముస్లింల హజ్‌యాత్రకు ప్రభుత్వ డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును కాలరాస్తూ, పార్లమెంట్ చట్టం చేయడం వంటి విషయాలు లౌకిక వాదం కిందికి వస్తాయా? తాను మైనార్టీ మతస్థుల మనోభావాలకు కట్టుబడి, సేవలు అందించలేదా? ఈ ప్రశ్నలు సామాన్య హిందువులు సంధిస్తే–కాంగ్రెస్ నాయకులు సమాధానాలు చెప్తారా? కులాల వారీగా ఉండే హిందూ సమాజం అయోధ్యలో రామ మందిరం కేంద్రంగా ఒక సుసంఘటిత సమాజంగా రూపుదిద్దుకుంటుంది. ముస్లింల పరిపాలనా కాలంలో వేల దేవాలయాలు కూల్చబడ్డాయి. అందులో అయోధ్య రామ మందిరం ఒకటి. 'మక్కా'... ముస్లింలకు ఎంత పవిత్రమైందో, 'అయోధ్య'... హిందువులకంతే పవిత్రమైంది. ఈ విషయంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ వంటి హిందుత్వ సంస్థలు హిందూ సమాజానికి అండగా నిలబడ్డాయి. వాస్తవం మాట్లాడితే మతాన్ని రాజకీయాలకు వాడని పార్టీ ఈ దేశంలో ఏదీ లేదు. బీజేపీకి ఈ విషయంలో మినహాయింపు ఎందుకు? గతంలో జరిగినట్లు హిందువులను విడగొట్టే ప్రయత్నాలు ఇక సాగవు!

గుజరాత్ సోమనాథ్ మందిర పునఃప్రతిష్ఠకు నాటి హోం మంత్రి పటేల్ పిలుపు మేరకు అప్పటి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ హాజరయ్యే సందర్భంలో నిరోధించే ప్రయత్నం చేసిన ప్రధాని నెహ్రూ చేసిన తప్పిదాన్నే కాంగ్రెస్ పార్టీ నేడు చేసింది. ఈ విషయంలో ఆ పార్టీ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఆ పార్టీ పునరాలోచించుకోవడం అవసరం.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు

భక్తి ప్రభావం

అరణ్యాలలో సంచరిస్తూ మండుటెండల తాపానికి దప్పిక గొన్న బాటసారి అలసి సొలసి చివరికి తన ఇల్లు చేరుకుని, సేద తీరుతాడు. అక్కడ నుండి మళ్ళీ ఎక్కడికీ కదలాలనిపించదు. అలాగే, సంసార బంధాలలో చిక్కుకుని అలసి పోయిన వ్యక్తి, విష్ణు పాద కమలద్వయంతో అనుబంధం ఏర్పడి ఆ ఆనందం చవి చూస్తే మళ్ళీ ఆ సన్నిధిని వదలలేడు.

మనసు దేవుని మీద లగ్నమయ్యే కొద్దీ లౌకిక విషయాలపై ఆసక్తి తగ్గుతుంది. లోకంలో జీవిస్తూనే, నిరాడంబర జీవితాన్ని గడపటానికి వ్యక్తి ఇష్టపడతాడు. జీవనం నడవటానికి సరిపడా ధనం ఉంటే చాలనుకుంటాడు. ఆలోచనలు ఉన్నత మార్గంలో నడుస్తాయి. లౌకిక విషయాలు అల్పంగా కనిపిస్తాయి. భక్తి ప్రభావం అట్టిది.

జ్యోతిర్మయం

'మందార పూలలోని మకరంద మాధుర్యాన్ని గ్రోలటానికి అలవాటు పడ్డ తుమ్మెద ఉమ్మెత్త చెట్ల వైపు వెళుతుందా? లలితమైన, సుకుమారమైన, మామిడి చిగురుటాకులను తింటూ పరవశించి పాడే కోయిల కొండ మల్లెల వైపు వెళుతుందా? స్వచ్ఛమైన ఆకాశగంగా తరంగాలపై విహరించే రాజహంస సెలయేటి ప్రవాహాలకు వెళుతుందా? పూర్ణచంద్రుని వెన్నెలలో విహారం చేసే చకోరం దట్టమైన మంచు వైపు వెళుతుందా?' అని హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు అంటాడు. హరి స్మరణ తప్ప మరొకటి తెలియని, హరి భక్తిలో పూర్తిగా లీనమైపోయిన ప్రహ్లాదునికి సర్వం విష్ణుమయంగానే కనిపిస్తుంది. అటువంటి వానికి తండ్రి హిరణ్య కశిపుడు లౌకిక విద్యలు నేర్పించటానికి గురువుల వద్దకు పంపుతాడు. అప్పుడు ప్రహ్లాదుడు విష్ణు ప్రాశస్త్యాన్ని చెబుతూ ఈ పోలికలు తెస్తాడు. మందార మకరంద మాధుర్యం, లేత మామిడి చిగుళ్ళు తిని పాడే కోయిల, ఆకాశ గంగా ప్రవాహంలో విహరించే రాజహంస ఇత్యాదులన్నీ ఉన్నతమైన హరిభక్తిని ప్రతిపాదించేవి. ఇతరములన్నీ అల్పమైనవి. లౌకికమైన, నశ్వరమైన మానవ జీవితానికి చెందినవి.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, **తిథి:** శు.సప్తమి తె.3.04 వరకు (తెల్లవారితే గురువారం) తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.9.57 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.9.14 నుండి 10.42 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.48 నుండి 12.36 వరకు, **అమృత ఘడియలు:** లేవు, ముక్కనుమ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.42.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

నేటి నుంచి తిరిగి బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

నేడు నాగర్‌కర్నూలు లోక్‌సభ సెగ్మెంట్ నేతలతో భేటీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాలు తిరిగి నేటి(బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. అ సెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఈ నెల 3 నుంచి లోక్‌సభ సెగ్మెంట్లవారీగా సన్నాహక సమావేశాలను బీఆర్ఎస్ నిర్వహిస్తోంది. తెలంగాణభవన్ వేదికగా జరుగుతున్న ఈ భేటీల్లో ఆయా లోక్‌సభ సెగ్మెంట్ల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఇతర కీలకనేతలు పాల్గొంటున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతోపాటు మాజీమంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఈ భేటీల్లో పాల్గొంటారు. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు 10 లోక్‌సభ సెగ్మెంట్ల సన్నాహక సమావేశాలు పూర్తయ్యాయి. సంక్రాంతి పండుగ నేపథ్యంలో వాయిదా పడిన ఈ సమావేశాలు తిరిగి మంగళవారం ప్రారంభమవుతున్నాయి. 17న నాగర్‌కర్నూలు, 18న మహబూబ్‌నగర్, 19న మెదక్, 20న మల్కాజిగిరి, 21న సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు జరుగుతాయి. 22న నల్లగొండ లోక్‌సభ సెగ్మెంట్ నేతల భేటీతో ఈ సమావేశాలు ముగియనున్నాయి.

హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదు

- మల్లేశ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోవడం విడ్డూరం
- మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: కుటుంబ, భూతగాదాలతో హత్యకు గురైన చిక్కేపల్లి మల్లేశ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోవడం విడ్డూరమని, ఇలాంటి వాటిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కారణంగా సంక్రాంతి పండుగ రోజు ప్రెస్‌మీట్ పెట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. సోమవారం సచివాలయంలో జూపల్లి విలేకరులతో మాట్లాడారు. 20 ఏళ్లకు పైగా ఉన్న నా రాజకీయ జీవితంలో ఏనాడూ హత్య రాజకీయాలను ప్రోత్సహించలేదని, ఏడో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తినని, నేనేంటో ప్రజలకు తెలుసని స్పష్టం చేశారు. పరామర్శకు వచ్చే ముందు సమాచారం ఇచ్చిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే గుణగణాల గురించి కేటీఆర్ తెలుసుకోవాలని హితవు పలికారు. నిందారోపణలు చేసి హత్యను రాజకీయాలకు వాడుకోవటం కేటీఆర్‌లాంటి వారికి తగదన్నారు. ఈ కేసులో ఇప్పటికే పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ చేశారని, దీన్ని రాజకీయంగా వాడుకోవాలని కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారని ఆరోపించారు.

గిరిజన కమిషన్ ఏర్పాటు చేయాలి

బీజేపీ నేత రవీంద్ర నాయక్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి.. గిరిజన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ నేత రవీంద్ర నాయక్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగం అయిదో షెడ్యూల్ నిబంధనల ప్రకారం దేశంలోని షెడ్యూల్ తెగల సంక్షేమం, అభ్యున్నతి కోసం గవర్నర్ ద్వారా ఏర్పాటు చేసిన గిరిజన సలహా మండలి ద్వారా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని కోరారు. తండాలు, ఇతర ప్రాంతాల్లో మూసివేసిన ఆరు వేల పాఠశాలలను తెరిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వెను కబడిన తెగలు, జాతులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందించేందుకు జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (జన్ మన్) పథకాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు.

నకిలీ మందులతో జాగ్రత్త



ప్రజలకు డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సూచనలు

- ఆన్‌లైన్‌లో మందులు కొనుగోలు చేయొద్దు
- ప్యాకేజీ సరిగ్గా లేకుంటే అనుమానించాలి
- అతి తక్కువ ధరకు విక్రయించినా సందేహించాలి
- నకిలీలపై టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు కాల్ చేయొచ్చు

సాక్షి, హైదరాబాద్: నకిలీ మందుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విజ్ఞప్తి చేసింది. నకిలీ మందులు ప్రజారోగ్యానికి పెనుముప్పుగా మారాయని, ఈ నేపథ్యంలో వీటిని అరికట్టడంలో భాగంగా పలు సూచనలు చేసింది.

➤ ప్రజలను మోసం చేయడానికి కొన్ని ప్రముఖ బ్రాండ్‌లను పోలి ఉండేలా నకిలీ మందులు తయారు చేస్తున్నారు. వీటిలో అవసరమైన పదార్థాలేవీ ఉండవు. సుద్ద, మొక్కజొన్న పిండి లేదా బంగాళాదుంప పిండి మొదలైనవి కలిగి ఉన్నట్టు తమ పరిశీలనలో వెల్లడైనట్టు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ పేర్కొంది.

➤ నకిలీ మందులు రోగి ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలో పడేస్తాయి. ఇవి వ్యాధిని నయం చేయడంలో విఫలం కావడమే కాకుండా, కాలక్రమేణా రోగికి వినాశకరమైన పరిణామాలు సృష్టిస్తాయి.

➤ కొన్ని నకిలీ మందులు చూడటానికి అసలు ఉత్పత్తికి దాదాపు సమానంగా ఉంటాయి. వాటిని గుర్తించడం కష్టం. అనుమానిత నకిలీ ఔషధం, అసలైన ఔషధం మధ్య తేడాలను గుర్తించడానికి అనుమానాస్పద ఉత్పత్తిని అదే కంపెనీకి ముందు ఉపయోగించిన ఉత్పత్తితో సరిపోల్చండి. మునుపటి ప్యాకేజింగ్‌తో సరిపోల్చడానికి ప్రయత్నించండి. అనుమానం వస్తే భవిష్యత్‌లో పోలిక కోసం మీరు ఉత్పత్తిని తరచుగా ఉపయోగిస్తుంటే దయచేసి దాని ఫొటోగ్రాఫ్ తీసుకోండి. మందులు కచ్చితత్వంతో తయారు చేస్తారు. కాబట్టి పరిమాణం, బరువు, రంగు, నాణ్యతలో ఏదైనా వైవిధ్యం నకిలీని సూచిస్తుంది. స్పెల్లింగ్ తప్పులు లేదా వ్యాకరణ దోషాలు ఉంటాయి. తయారీ తేదీ, గడువు తేదీని తనిఖీ చేయండి. టాబ్లెట్‌లు బాటిల్‌లో ఉంటే అన్ని టాబ్లెట్‌లు ఒకేలా కనిపించాలి. మాత్రలు చిప్ లేదా పగుళ్లు లేదా తప్పు పూత కలిగి ఉంటే, ఆ ఉత్పత్తులను కూడా అనుమానాస్పదంగా పరిగణించాలి.

➤ పేరున్న కంపెనీలతో ఉత్పత్తి ధరను తనిఖీ చేయండి. ఇది మరింత చౌకగా లేదా భారీ తగ్గింపుతో అందిస్తే అది నకిలీ ఉత్పత్తి కావొచ్చని అనుమానించాలి. కేంద్ర ప్రభుత్వం 300 ప్రముఖ బ్రాండ్ పేర్లను గత ఆగస్టు తర్వాత తయారు చేసింది. దాని ప్రాథమిక ప్యాకేజింగ్ లేబుల్‌పై బార్కోడ్ లేదా క్విక్ రెస్పాన్స్ కోడ్ ఉంటుంది. ప్యాకేజింగ్ సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి.

➤ మెడికల్ షాపులో కొనుగోలు చేసిన మందుల బిల్లులను పట్టుబట్టి తీసుకోవాలి. వెబ్‌సైట్‌లు లేదా ఇతర ఇంటర్నెట్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల నుంచి మందులు కొనుగోలు చేయవద్దు. లైసెన్సు ఉన్న మెడికల్ షాపుల నుంచి మాత్రమే మందులను కొనుగోలు చేయాలి. నకిలీ మందుల వివరాలను టోల్ ఫ్రీ నంబర్ 18005996969కు ఫోన్ చేసి చెప్పవచ్చు.

నకిలీ డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చేందుకు....

మార్కెట్‌లో నకిలీ డ్రగ్స్ తరలింపును గుర్తించేందుకు పలుచోట్ల తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేసిన సంగతి తెలిసిందే. నకిలీ డ్రగ్స్ లేని రాష్ట్రంగా మార్చడానికి అధికారులు అన్నిరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. డిసెంబర్‌లో బొల్లారంలోని ఒక గోడౌన్‌లో కేన్సర్ నిరోధక మందులు(నకిలీవి) స్వాధీనం చేసుకున్నారు. కొరియర్ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని కాశీపూర్, ఉత్తరాఖండ్, ఘజియాబాద్ నుంచి రాష్ట్రంలోకి నకిలీ డ్రగ్స్ ప్రవేశానికి సంబంధించిన నకిలీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు చేశారు. అధికారులు జరిపిన దాడుల్లో నకిలీ డ్రగ్స్‌ని గుర్తించి, స్వాధీనం చేసుకున్న నకిలీ మందుల్లో సన్ ఫార్మా (అధిక కొలెస్ట్రాల్ చికిత్సలో ఉపయోగించే రోసువాస్ 10 టాబ్లెట్లు) వంటి ప్రముఖ కంపెనీల పేర్లతో తప్పుడు లేబుల్‌లు ఉన్నాయి.

ఘనంగా జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలు

నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్/న్యూఢిల్లీ/ ఖైరతాబాద్: కేంద్ర మాజీ మంత్రి, దివంగత ఎస్.జైపాల్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం టీపీసీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ వాదిగా తనదైన రాజకీయ ముద్ర వేసిన జైపాల్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక భూమిక పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్ కోదండరెడ్డి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి.నిరంజన్, కుమార్‌రావు, అల్లం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో జైపాల్‌రెడ్డి కీలక పాత్ర

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి 82వ జయంతి వేడుకలను నెక్లెస్ రోడ్డులో పీవీ ఎస్ మార్గ్ స్ఫూర్తి స్థల్‌లో ఘనంగా నిర్వహించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు జైపాల్‌రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైపాల్‌రెడ్డి పాటించిన నైతిక విలువలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులకు ఆయన పేరు పెట్టే విషయంపై ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కోమటిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ మల్లురవి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి పేపర్ ఏజెంట్ల సమస్యలు

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలోని ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు హామీ ఇచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు మాట్లాడుతూ.. ప్రజలు పేపర్ బాయ్స్‌తో స్నేహభావంతో మెలగాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల సత్యం మాట్లాడుతూ.. డిస్ట్రిబ్యూటర్ల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పా టు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్‌రావు, కోశాధికారి రాజేందర్, ఉపాధ్యక్షులు శ్రీశైలం, రాజు, సతీశ్, మీడియా ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేశ్ ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలపై దృష్టిసారించండి

- కేంద్ర పథకాల ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- బీజేపీ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, జాతీయ ప్రధాన కార్యదర్శులకు అమిత్ షా, నడ్డా దిశానిర్దేశం

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శులు, జాతీయ ప్రధాన కార్యదర్శులకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సూచించారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో గత తొమ్మిదిన్నరేళ్లుగా ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. మంగళవారం సుమారు 5 గంటల పాటు ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో అమిత్ షా, జేపీ నడ్డాలు మార్గదర్శనం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శులు బండి సంజయ్ కుమార్, తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్‌లతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన చంద్రశేఖర్, ప్రేమేందర్ రెడ్డి, బంగారు శ్రుతి, దుగ్యాల ప్రదీప్ కుమార్, కాసం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అనుసరించాల్సిన వ్యూహాలపై సునీల్ బన్సల్, చంద్రశేఖర్‌లు రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా చర్చించారు. అంతేగాక క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టిసారించాలని సూచించారు.

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్



సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీలో కీలక పరిణామం చోటు చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌ను బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నియమించారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజస్తాన్‌లో బీజేపీ సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ 2017 సెప్టెంబర్ నుంచి పనిచేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్న చంద్రశేఖర్ ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు. 2017లో రాజస్తాన్ బాధ్యతలు తీసుకొనే ముందు చంద్రశేఖర్ పశ్చిమ ఉత్తరప్రదేశ్, అంతకు ముందు వారణాశి ప్రాంతీయ సంస్థమంత్రిగా పనిచేశారు. అంతేగాక 2014లో చంద్రశేఖర్ ప్రధాని మోదీతో కలిసి వారణాశి లోక్‌సభ స్థానం కోసం క్షేత్రస్థాయిలో పనిచేశారు.

నెలాఖరులో రాష్ట్రానికి అమిత్‌షా ?

వచ్చేనెలలో ఐదు క్లస్టర్లలో బీజేపీ యాత్రలు

సాక్షి, హైదరాబాద్: ఈ నెలాఖరులో కేంద్రమంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన ఉంటుందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. దేశవ్యాప్తంగా మొత్తం ఎంపీ సీట్లను 143 క్లస్టర్లుగా బీజేపీ ఏర్పాటు చేసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణకు వచ్చేసరికి ఐదు క్లస్టర్లుగా విభజించారు. వీటికి నలుగురు రాష్ట్రప్రధానకార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శ్రుతి, కాసం వెంకటేశ్వర్లుయాదవ్, ఇంకా సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు ఇన్‌చార్జ్‌లుగావ్యవహరిస్తారని సమాచారం. మంగళవారం ఢిల్లీలో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీనడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీసంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్.సంతోష్ సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వచ్చేనెలలో తెలంగాణలో 10 రోజులపాటు బీజేపీ యాత్రలు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఐదు పార్లమెంట్ క్లస్టర్ల వారీగా ఈ యాత్రలు ఉంటాయి. ఇందులో భాగంగా తెలంగాణ అప్పులు తీరాలన్న, తెలంగాణ అభివృద్ధి చెందాలన్న మరోసారి మోదీ అధికారంలోకి రావాలన్న అంశం విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది.

వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలి

సంక్షోభంపై ఆవేదన వ్యక్తం చేసిన కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లకుండా తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగిస్తూనే, కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సంక్షోభం వార్తలపై కేటీఆర్ స్పందించారు. పదేళ్లలో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎంతో అభివృద్ధి చెందిందని, నైపుణ్యం కలిగిన పవర్‌లూమ్ నేతన్నలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా తమ కార్యకలాపాలను విస్తరించారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన సహకారమే ఇందుకు ప్రధాన కారణమని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమకు అండగా నిలవాలన్నారు. ప్రభుత్వ సహకారం ఉంటే తిరుపూర్ వస్త్ర పరిశ్రమతో సమానంగా పోటీ పడగలిగే అవకాశాలు ఈ రంగానికి ఉన్నాయన్నారు. అయితే ఈ రంగానికి సంబంధించి 15 రోజులుగా వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని, ప్రభు త్వం వెంటనే స్పందించకుంటే ఈ పరిశ్రమ తీవ్రమైన సంక్షోభంలోకి వెళుతుందని పేర్కొన్నారు.

జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంపై ఆగ్రహం

ఆల్విన్ కాలనీలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని పగలగొట్టిన సంఘటనపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ముందే జయశంకర్ విగ్రహాన్ని దుండగుడు ధ్వంసం చేసిన తీరుపై 'ఎక్స్'వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డీజీపీని డిమాండ్ చేశారు.

మా కృషి వల్లే స్టార్టప్ రంగం బలోపేతం: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: స్టార్టప్ ర్యాంకింగ్‌లో 2022 సంవత్సరానికిగాను దేశంలోనే తెలంగాణ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవడంపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు 'ఎక్స్'వేదికగా హర్షం వ్యక్తం చేశారు. పదేళ్లపాటు దృఢమైన స్టార్టప్ వాతావరణం నిర్మించేందుకు తాము చేసిన కృషికి ఇది నిదర్శమని పేర్కొన్నారు. తెలంగాణలో ఆవిష్కరణల వాతావరణాన్ని బలోపేతం చేయడంలో భాగస్వాములైనవారికి అభినందనలు తెలిపారు. పేదరికాన్ని తగ్గించడంలో పదేళ్లుగా తెలంగాణ అద్భుతంగా పనిచేసిందని నీతి ఆయోగ్ నివేదిక పేర్కొనడంపట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

చెక్‌డ్యాం పేల్చివేతకు యత్నం

అడ్డుకున్న రైతులు, నాయకులు



అగంతకులు వదిలి వెళ్లిన జిలెటిన్ స్టిక్స్, వస్తుసామగ్రి

పెద్దపల్లి రూరల్: హుస్సేనిమియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంను గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పేల్చివేసేందుకు యత్నించారు. సమీప గ్రామాల రైతులు అడ్డుకోవడంతో పెద్దముప్పు తప్పింది. పెద్దపల్లి జిల్లాలోని భోజన్నపేట, మూలసాల గ్రామాల మధ్య హుస్సేనిమియా వాగువద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. దాదాపు రూ.3 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. గుర్తుతెలియని వ్యక్తులు కొందరు రాత్రివేళ డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చివేసేందుకు యత్నిస్తున్నారన్న సమాచారం చీకురాయి, భోజన్నపేట గ్రామ రైతులు, నాయకులకు అందింది. అప్రమత్తమైన రైతులు, నాయకులు వెంటనే ఘటనాస్థలికి బయల్దేరి వెళ్లారు. వారిరాకను గమనించిన ఆగంతకులు.. సామగ్రిని అక్కడే వదిలేసి కంప్రెషర్‌తో సహా పరారయ్యారు. పేల్చివేతకు కుట్ర జరిగిందని నిర్ధారించుకున్న భోజన్నపేట ఎంపీటీసీ రాజేశ్వరి భర్త, బీజేపీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌తో పాటు పలువురు రైతులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై మల్లేశ్ అక్కడకు చేరుకుని పరిస్థితులను పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు చెక్‌డ్యాంను పేల్చివేసేందుకు యత్నించినట్లు తెలుస్తోందని, ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పులుల మృతి: నలుగురు సస్పెన్షన్

తెలంగాణ పీసీసీఎఫ్ రాకేశ్ డోబ్రియల్ ఆదేశాలు

కాగజ్‌నగర్ రూరల్: కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో రెండు పెద్దపులులు మృతి చెందడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. నలుగురు అధికారులను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.దరిగాం, సర్కెపల్లి అటవీ ప్రాంతంలో ఈ నెల 6న కే15 ఆడ పులి, 8న ఎస్9 మగపులి కళేబరాలను గుర్తించడం తెలిసిందే. ఈ ఘటనలో.. మొదట కే15 పులి రెండు పులుల మధ్య జరిగిన ఘర్షణలో ప్రాణాలు కోల్పోయినట్లు ప్రాథమిక అంచనా వేశారు. అయితే ఎస్ 9 పులిపై విషప్రయోగం జరిగినట్లు తేలడంతో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) రాకేశ్ డోబ్రియల్, సీసీఎఫ్ శాంతారాం విచారణను స్వయంగా పర్యవేక్షించారు. పులుల మృతి ఘటనలో బాధ్యులను చేస్తూ కాగజ్‌నగర్ డివిజనల్ అధికారి వేణుబాబు, రేంజ్ అధికారి వేణుగోపాల్, సెక్షన్ అధికారి పోశెట్టి, బీట్ అధికారి శ్రీకాంత్‌ను సస్పెండ్ చేశారు.

- ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆర్ఎస్ఎస్, బీజేపీ సిద్ధాంతాలను అనుసరిస్తోందని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌ఒవైసీ మండిపడ్డారు. ప్రతి నెలా మొదటి మంగళవారం ఢిల్లీలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'సుందర్‌కాండ్ పఠం, హనుమాన్ చాలీసా' పఠనాన్ని నిర్వహించాలని తీసుకున్న నిర్ణయంపై ఆయన స్పందిస్తూ ఆప్‌ను 'చోటా రీచార్జ్ ఆఫ్ ఆర్ఎస్ఎస్'గా అభివర్ణించారు.

కరెంట్ వైర్లలో చిక్కుకున్న పతంగిని తీస్తుండగా..
ఇద్దరు బాలురకు విద్యుత్ షాక్

- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స
- మరో ఘటనలో కానిస్టేబుల్‌కు గాయం



సాత్విక్ (ఫైల్)



ప్రశాంత్ (ఫైల్)



చెంప కోసుకోవడంతో చికిత్స చేయించుకున్న హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం

కోరుట్ల/ యాదగిరిగుట్ట: రాష్ట్రంలో గాలిపటాల ప్రమాదాలు కొనసాగుతున్నాయి. తాజాగా జరిగిన ఘటనల్లో విద్యుత్ షాక్‌తో ఇద్దరు బాలురు గాయపడగా, మరో ఘటనలో మాంజా కోసుకుపోయి ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లో సబ్‌స్టేషన్ చౌరస్తా సందులో నివాసముండే పూర్ణం దుర్గాప్రసాద్ కుమారుడు ప్రశాంత్ (12), తోకల కిష్టయ్య కుమారుడు సాత్విక్ (12) ఆదివారం గాలిపటంతో ఆడుకుంటున్నారు. గాలిపటం తెగి సమీపంలో ఉన్న ఓ డాబాపై పడి విద్యుత్ వైర్లలో చిక్కుకుంది. దాన్ని తీసే ప్రయత్నంలో హైటెన్షన్ వైర్ తాకి ఇద్దరు బాలురు విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ప్రశాంత్ డాబాపై నుంచి కింద పడిపోగా, సాత్విక్ ఒళ్లుకాలి తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరికీ వెంటనే పట్టణంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. ప్రశాంత్ పరిస్థితి కాస్త మెరుగుపడింది. సాత్విక్ తలకు ఓపక్క, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలు కావడంతో అతడిని హైదరాబాద్ తరలించారు. ఎస్సై కిరణ్ కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో సోమవారం జరిగిన మరో ఘటనలో చైనా మాంజా తగిలి ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. యాదాద్రి దేవస్థానంలో ఎస్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం విధుల్లో భాగంగా సోమవారం వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్తున్నాడు. అదే సమయంలో కొందరు అక్కడ పతంగి ఎగురవేస్తుండగా చైనా మాంజా దారం సుబ్రహ్మణ్యం ముఖానికి తాకింది. దీంతో చెంప భాగం కోసుకుపోయింది. వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన కంసాని గణేష్ నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తుండటంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్ వెల్లడించారు.

'నేత' రాత మారేదెలా?

▶ మొదటి పేజీ తరువాయి

పవర్‌లూమ్ కార్పొరేషన్లు కేవలం చైర్మన్ల నియామకం వరకే పరిమితమయ్యాయి. జియో ట్యాగింగ్, త్రిఫ్ట్ ఫండ్, చేనేత బీమా, నేతన్నకు చేయూత వంటి పథకాలను గత ప్రభుత్వం అమలు చేసినా అవి అందరికీ అందలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 375 సంఘాలు

రాష్ట్ర వ్యాప్తంగా 375 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిల్లో 45మంది కార్మికులు ఉన్నారు. అయితే 2018లో ఓటర్ ఫొటో గుర్తింపు కార్యక్రమం చేపట్టగా, జియో ట్యాగింగ్ విధానం అమల్లోకి తెచ్చి, కేవలం 9వేల మందిని లెక్క చూపిస్తున్నారు. మిగతా కార్మికులు జియో ట్యాగింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. సహకార సంఘాలకు 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించగా, పదవీ కాలం 2018 ఫిబ్రవరి 9తో ముగిసింది. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి. కానీ ప్రభుత్వం పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించి, ప్రతి ఆరునెలలకోసారి పాలకవర్గాల పదవీకాలాన్ని పొడగిస్తూ వచ్చింది.

టెస్కో పాలకవర్గం ఎప్పుడు?

ఉమ్మడి ఏపీలో చేనేత వృత్తిదారుల కోసం ఆప్కో ఉండగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత టెస్కోగా మారింది. అయితే ప్రస్తుతం టెస్కోకు పాలకవర్గం లేదు. సహకార సంఘాల ఎన్నికలు జరిగితే ప్రతి జిల్లా నుంచి ఒక డైరెక్టర్‌ను ఎన్నుకొని వారిలో నుంచి రాష్ట్రస్థాయి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు ప్రతి జిల్లా డైరెక్టర్ పాలకవర్గ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేవు. ఐఏఎస్ అధికారుల చేతిలో పాలన కొనసాగడంతో వృత్తిదారుల సమస్యలు పెరుగుతున్నాయి.

మూతపడిన సిరిపురం సొసైటీ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సిరిపురం చేనేత సహకార సంఘంలో 1000 మంది సభ్యులు ఉన్నారు. సుమారు 40 ఏళ్లుగా వృత్తిదారులకు పని కల్పిస్తోంది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సొసైటీ రూ.40 లక్షల నష్టాల్లో కూరుకుపోయింది. జియో ట్యాగింగ్‌లో 150 మందినే గుర్తించారు.

సొసైటీ ఎన్నికలు నిర్వహించాలి



చేనేత సహకార సంఘం ఎన్నికలు నిర్వహించాలి. కొండాలక్ష్మణ్ బాపూజీ సహకార స్ఫూర్తితో ఏర్పడిన సహకార సంఘాల వల్ల చేనేత కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది. పాలకవర్గం లేకపోవడంతో చేనేత సమస్యలను మాట్లాడేవారు లేకుండా పోయారు. – అప్పం రామేశ్వరం, సిరిపురం సొసైటీ మాజీ చైర్మన్

వస్త్రాల తయారీకి ఆర్డర్ ఇవ్వాలి

ప్రభుత్వం వినియోగిస్తున్న వస్త్రాల తయారీ ఆర్డర్లను సిరిసిల్ల మాదిరిగా మాకూ ఇవ్వాలి. చేనేత సొసైటీలకు ఇస్తున్నట్టుగానే డీసీసీబీ రుణాలు ఇవ్వాలి. పవర్‌లూమ్‌లకు వస్త్రాలను తయారు చేసే ఆర్డర్‌లు ఇవ్వాలి. వెంటనే సహకార ఎన్నికలు నిర్వహించాలి. – శ్రవణ్, మాజీ చైర్మన్, శ్రీతారకరామ పవర్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్, ప్రొడక్షన్, అండ్ సేల్స్ సొసైటీ

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజనీర్ వారి కార్యాలయం,
ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి. ఫోన్: 08455-270180

1. ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు నం. 16/2023-24, తేది:12-01-2024

ఓ & ఎం - సంగారెడ్డి జిల్లా - పుల్కల్ (మం), సింగూర్ (గ్రా) నందు ఎం.బాగారెడ్డి సింగూర్ ప్రాజెక్ట్ యొక్క రేడియల్ క్రెస్ట్ గేట్‌లకు రబ్బరు సీల్ లను మార్చడం గురించి తేది. 18-01-2024 నుండి తేది.25-01-2024 వరకు బిడ్లను ఆహ్వానించడమైనది. **పని అంచనా విలువ: రూ.13.10 లక్షలు.** మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ **www.tender.telangana.gov.in** వెబ్‌సైట్ నందు తేది:17-01-2024 నుండి చూడగలరు.

సం/- పర్యవేక్షక ఇంజనీర్,
నీటిపారుదల సర్కిల్, సంగారెడ్డి
DIPR RO No.9465-PP/CL/Advt/1/2023-24, Dt:16.01.2024

తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల గురుకుల విద్యాలయాల సంస్థ (TMREIS), హైదరాబాద్

2024-25 విద్యా సంవత్సరానికి టి.ఎం.ఆర్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలలలో ప్రవేశ ప్రకటన

ఆర్.సి.నెంబర్ 14452/సి/అడ్మిషన్స్/TMREIS/2023 తేది:17-01-2024

2024-25 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 204 తెలంగాణ అల్పసంఖ్యాక వర్గాల గురుకుల పాఠశాలల యందు 5వ తరగతి మరియు 194 జూనియర్ కాలేజీల నందు (జనరల్ మరియు ఒకేషనల్) మరియు 10 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఇ), టి.ఎం.ఆర్. జూనియర్ కళాశాలల యందు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర తాజా ప్రవేశాల కొరకు ఆన్‌లైన్ పద్ధతి ద్వారా అర్హత కలిగిన (మైనారిటీలు, క్రిస్టియన్స్, పార్సిస్ లు, జైనులు, సిక్కులు మరియు బౌద్ధులు) అభ్యర్థుల నుండి మరియు తరగతులు VI, VII మరియు VIII అల్పసంఖ్యాక వర్గాల బ్యాక్ లాగ్ ఖాళీల కొరకు అల్పసంఖ్యాక వర్గాల (ముస్లింలు, క్రిస్టియన్స్, పార్సీలు, జైన్లు, సిక్కులు & బౌద్ధులు) అర్హత గల అభ్యర్థుల నుండి TMREIS అధికారిక వెబ్‌సైట్ **www.tmreistelangana.cgg.gov.in** ద్వారా TMREIS మొబైల్ యాప్ (గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోబడినది) ద్వారా 18.01.2024 నుండి 06.02.2024 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరబడుతున్నవి.

ప్రవేశాల షెడ్యూల్

క్రమ సంఖ్య	కార్యకలాపం	క్యాటగిరి	తరగతులు	షెడ్యూల్
1	ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల సమర్పణ	అన్ని క్యాటగిరీలు	V	18.1.2024 నుండి 06.02.2024
2			ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం	
3		మైనారిటీస్	VI, VII & VIII బ్యాక్ లాగ్ ఖాళీల కొరకు	
4	అభ్యర్థుల ఎంపిక, ధ్రువపత్రాల తనిఖీ మరియు ప్రవేశాల ప్రక్రియ	అన్ని క్యాటగిరీలు	V	24.4.2024 నుండి 30.4.2024
5		మైనారిటీస్	VI, VII & VIII బ్యాక్ లాగ్ ఖాళీల కొరకు	
6		అన్ని క్యాటగిరీలు	ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం	1-5-2024 నుండి 10-5-2024 (తాత్కాలిక తేదీ/SSC 2024 ఫలితాలు వెలువడిన వెంటనే)
7	స్క్రీనింగ్ పరీక్ష	అన్ని క్యాటగిరీలు	ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం జూనియర్ కాలేజీలు సి.ఓ.ఇ	25-02-2024

ఇంటర్మీడియట్ ప్రవేశాల కొరకు అభ్యర్థులు రెండిటికి (జనరల్/ఒకేషనల్) జూనియర్ కాలేజీలు మరియు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఇ) లకు దరఖాస్తు చేయవచ్చును.

ఎంపికకు అర్హతా ప్రమాణాలు:
- 5వ తరగతి మైనారిటీ వర్గాలకు: మొదటి వచ్చిన వారికి మొదటి అవకాశం ప్రాతిపదికన మైనారిటీయేతరులకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక.
- తరగతులు VI, VII & VIII కొరకు: 6, 7 & 8 తరగతుల వారికి (మైనారిటీల యొక్క బ్యాక్ లాగ్ ఖాళీలు) ఎవరు ముందుగా వస్తే వారు అనే ప్రాతిపదికన ప్రవేశం.
- ఇంటర్ మొదటి సంవత్సరం (జనరల్ & ఒకేషనల్): SSC/ 10వ తరగతి 2024లో GPA పై ప్రతిభ ఆధారంగా ఉంటుంది.
- ఇంటర్మీడియట్ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సి.ఓ.ఇ) టి.ఎం.ఆర్.జెసి): స్క్రీనింగ్ పరీక్ష మరియు ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక.

అభ్యర్థులు ఇతర వివరాలన్నింటి కొరకు అధికారిక వెబ్‌సైట్ **www.tmreistelangana.cgg.gov.in** ను దర్శించవచ్చును లేదా హెల్ప్‌లైన్ సెంటర్ (040-23437909), ఏదేని TMR ఇన్‌స్టిట్యూషన్, సంబంధిత DMWO కార్యాలయం లేదా TMREIS ప్రధాన కార్యాలయం, ఇంటి నెం.8-2-596/1/1, స్టార్ హాస్పిటల్ సమీపాన, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ వారిని సంప్రదించవచ్చును.

DIPR RO No.9460-PP/CL/ADVT/1/2023-24, Dt:16-01-2024 సం/- సెక్రటరీ

भारत सरकार/Government of India
अंतरिक्ष विभाग/Department of Space
भारतीय अंतरिक्ष अनुसंधान संगठन/Indian Space Research Organisation
विक्रम साराभाई अंतरिक्ष केंद्र/VIKRAM SARABHAI SPACE CENTRE
तिरुवनंतपुरम/Thiruvananthapuram-695 022

शुद्धिपत्र दिनांक 16.01.2024 / CORRIGENDUM DATED 16.01.2024

वैज्ञानिक/इंजिनियर-एसडी (पद सं.1503 से 1505 तक) तथा वैज्ञानिक/इंजिनियर-एससी (पद सं.1506 से 1520 तक) के पद पर भर्ती हेतु विज्ञापन सं 327 दिनांक 01.07.2023 के लिए।


(To Advertisement No.327 dated 01.07.2023 for recruitment to the post of Scientist/Engineer-SD (Post Nos.1503 to 1505) and Scientist/Engineer-SC (Post Nos. 1506 to 1520)

विविध विधाओं में उपरोक्त पदों के लिए विज्ञापन सं.327 दिनांक 01.07.2023 फिर से खोला गया है। अधिक जानकारी के लिए वीएसएससी वेबसाइट http://www.vssc.gov.in पर जाएं।

Advertisement No.327 dated 01.07.2023 is re-opened for the above posts in various disciplines. For further details, please visit VSSC website http://www.vssc.gov.in.

आगे का कोई भी शुद्धिपत्र मात्र वीएसएससी वेबसाइट पर अपलोड किया जाएगा। सभी आवेदकों से अपेक्षित है कि वे वेबसाइट नियमित रूप से देखें। Any further corrigendum will be uploaded in the VSSC website only. All applicants are required to check the website regularly.

वरिष्ठ प्रशासन अधिकारी/Sr. Administrative Officer, आर एवं आर / R & R


అయోధ్యలోని గోడలపై చిత్రించిన రామాయణంలోని అపురూప ఘట్టాల దృశ్యాలు... ఆసక్తిగా తిలకిస్తున్న స్థానికులు



అయోధ్యలో లతా మంగేష్కర్ చౌక్‌లో రూపేశ్ సింగ్ చెక్కిన సైకత శిల్పం

అయోధ్యలో సంప్రదాయ క్రతువులు ఆరంభం

అయోధ్య: చారిత్రక నగరం అయోధ్యలోని భవ్య రామమందిరంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 22న జరిగే ఈ మహా వేడుకకు దేశ విదేశాల నుంచి వేలాది మంది విశిష్ట అతిథులు హాజరు కాబోతున్నారు. బాలరాముడి ప్రతిష్టాపనకు సంబంధించిన సంప్రదాయ క్రతువులు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ప్రాణప్రతిష్ఠ దాకా నిరంతరాయంగా కొనసాగుతాయని అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్టు వెల్లడించింది. క్రతువులకు ట్రస్టు సభ్యుడు అనిల్ మిశ్రా, ఆయన భార్య ఉషా మిశ్రా 'యజమానులుగా' వ్యవహరిస్తున్నారు. ఆలయ ప్రారంభోత్సవం దాకా ప్రతినిత్యం వారే యజమానులుగా ఉంటారు. అయోధ్యలో అనుష్ఠానానికి శ్రీకారం చుట్టామని, ఆలయ ప్రాణప్రతిష్ఠకు దేవుళ్లందరి అనుగ్రహాన్ని అర్థిస్తూ మొత్తం 11 మంది పూజారులు క్రతువులు ప్రారంభించారని ప్రధాన పూజారి సత్యేంద్ర దాస్ తెలిపారు. ఆలయంలో ప్రాణప్రతిష్ఠ ముగిశాక ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమానికి 8 వేల మంది అతిథులు హాజరవుతారని అంచనా. వీరిలో కొద్ది మందిని మాత్రమే గర్భాలయంలోకి అనుమతిస్తారు. గణేశ్వర్ శాస్త్రి ద్రవిడ్ ఆధ్వర్యంలో 121 మంది ఆచార్యులు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తారు. ప్రధాన ఆచార్యుడిగా కాశీకి చెందిన లక్ష్మీకాంత్ దీక్షిత్ వ్యవహరించబోతున్నారు. అయోధ్యలో సోమవారం ప్రాయశ్చిత్త, కర్మకుటీ పూజ నిర్వహించారు.

56 రకాల ఆగ్రా పేఠాలు

ఆగ్రా పేఠ.. ఉత్తర భారతీయులకు చాలా ఇష్టమైన మిఠాయి. బూడిద గుమ్మడి కాయ, చక్కెర పాకంతో ఈ పేఠాలు తయారు చేస్తారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ జరుపుకోనున్న బాలరాముడికి ఆగ్రా పేఠాలను నివేదించబోతున్నారు. ఇందుకోసం ఏకంగా 56 రకాల పేఠాలను సిద్ధం చేశారు. ఇవి మంగళవారం అయోధ్యకు చేరుకున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఆగ్రాకు చెందిన పంచీపేఠ అనే మిఠాయిల దుకాణం వీటిని తయారు చేసి పంపించింది. అలాగే అదనంగా 560 కిలోల పేఠాలను సైతం ఆగ్రా ట్రేడ్ బోర్డు ద్వారా పంపింది. వీటిని భక్తులకు ప్రసాదంగా పంచిపెట్టే అవకాశం ఉంది. అలాగే రత్నాలు కూర్చిన పట్టు వస్త్రాలు, వెండి పళ్లేలు, ఇతర పూజా సామగ్రి సైతం వేర్వేరు ప్రాంతాల నుంచి అయోధ్యకు చేరుకున్నాయి.



గుజరాత్ నుంచి తెచ్చిన 108 అడుగుల అగరొత్తికి మొక్కుతున్న భక్తులు



భారీ అగరొత్తిని వెలిగిస్తున్న మహంత్ నృత్య గోపాల్ దాస్

108 అడుగుల అగరు బత్తి వెలిగించారు

గుజరాత్ నుంచి అయోధ్యకు పంపించిన 108 అడుగుల పొడవైన అగరు బత్తిని శ్రీరామ్ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ దాస్ మంగళవారం వెలిగించారు. ఈ సందర్భంగా భక్తులు జైశ్రీరామ్ అంటూ జపించారు. దాదాపు 40 రోజుల దాకా ఈ అగరు బత్తి వెలుగుతూనే ఉంటుంది. 3,610 కిలోల బరువు, మూడున్నర అడుగుల వెడల్పు ఉన్న ఈ అగరు బత్తి సువాసన 50 కిలోమీటర్ల వరకు వ్యాపిస్తుందని తయారీదారులు చెప్పారు. భారీ అగరు బత్తిని ఆవు పేడ, నెయ్యి, సుగంధ తైలాలు, పూల రెక్కలు, ఔషధ మూలికలతో తయారు చేశారు.



శ్రీరామజన్మభూమి ఆలయం గర్భగుడి ద్వారం

సరయూ నదిలో సౌర విద్యుత్ పడవ

అయోధ్య నగరాన్ని మోడల్ సోలార్ సిటీకి అభివృద్ధి చేయాలని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందులోభాగంగా సౌర విద్యుత్‌కు పెద్ద పీట వేయబోతోంది. అయోధ్యలో సరయూ నదిలో సౌరవిద్యుత్‌తో నడిచే పడవలను ప్రవేశ పెట్టేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలి పడవను ఈ నెల 22న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించబోతున్నారు. ఇండియాలో ఇదే తొలి సౌరవిద్యుత్ పడవ కావడం గమనార్హం. అయోధ్య పర్యాటకులు సరయూ నదిలో ఇలాంటి పడవల్లో విహరించవచ్చు. నయా ఘాట్ నుంచి ఈ పడవలు రాకపోకలు సాగిస్తాయి. ఒక్కో బోట్‌లో ఒకేసారి 30 మంది ప్రయాణించవచ్చు. ఫైబర్‌గ్లాస్‌తో తయారు చేయడంతో తేలిగ్గా ఉంటాయి. శబ్దం రాదు. పూర్తిగా పర్యావరణ హితం.

ప్రాణప్రతిష్ఠలో సంప్రదాయ సంగీత మధురిమలు

రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అయోధ్యలో భారతీయ సంప్రదాయ సంగీతం అతిథులను అలరించబోతోంది. దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి సంప్రదాయ సంగీత కళాకారులను రప్పిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పంజాబ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్, అస్సాం, ఛత్తీస్‌గఢ్, బిహార్, ఢిల్లీ, రాజస్తాన్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, తమిళనాడు, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల నుంచి నుంచి కళాకారులు రాబోతున్నారు. ఇప్పటికే వారిని తీర్థ క్షేత్ర ట్రస్టు ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్ నుంచి ఘటము వాయిద్యానికి స్థానం కల్పించారు. ఈ నెల 22న జరిగే అపూర్వ వేడుకలో కళాకారులు తమ సంగీత ప్రావీణ్యాన్ని ప్రదర్శిస్తారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పఖవాజ్, తమిళనాడుకు చెందిన మృదంగం వంటి వాయిద్యాలు ప్రదర్శన ఉంటుంది. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవంలో భిన్నర కాల వాయిద్యాలను ఒకేచోట తిలకించవచ్చు. భారతీయ సంప్రదాయ సంగీత మధురిమలను మనసారా ఆస్వాదించవచ్చు. ఇదిలా ఉండగా, ప్రాణప్రతిష్ఠ ముగిసిన తర్వాత ఈ నెల 23 నుంచి సామాన్య ప్రజలకు బాలరాముడి దర్శనభాగ్యం కల్పిస్తారు. ఈ నెల 26 తర్వాత ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు విడతలవారీగా దర్శించుకొనేలా షెడ్యూల్ రూపొందించారు. వారి దర్శనాలు ఫిబ్రవరి ఆఖరు దాకా కొనసాగుతాయి. అతిథుల కోసం బస ఏర్పాట్లు చేస్తున్నారు.

గాయని చిత్రపై ట్రోలింగ్

తిరువనంతపురం: జాతీయ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత గాయని కేఎస్ చిత్ర ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురవుతున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభ ఉత్సవాన్ని స్వాగతిస్తూ ఒక వీడియోను రెండు రోజుల క్రితం ఆమె సోషల్ మీడియాలో పోస్టు చేయడమే ఇందుకు కారణం. ఈ నెల 22న ఆలయ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రజలంతా శ్రీరామ జయరామ జయ జయ రామ అనే రామమంత్రం జపించాలని, సాయంత్రం ఇళ్లల్లో ఐదు దీపాలు వెలిగించాలని చిత్ర పిలుపునిచ్చారు. ప్రజలందరికీ భగవంతుడి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. 'లోకస్సమస్త సుఖినోభవంతు' అంటూ తన సందేశాన్ని ముగించారు. అయితే, ఈ వీడియో సందేశంపై సోషల్ మీడియాలో పలువురు విమర్శలు చేస్తున్నారు. ఒక మతానికి మద్దతు ఇవ్వడం, దాన్ని ప్రచారం చేయడం, అయోధ్య రామ మందిరానికి ప్రాచుర్యం కల్పించడం తప్పు అంటూ ఆక్షేపిస్తున్నారు. మరోవైపు చిత్రకు మద్దతు వెల్లువెత్తుతోంది. పార్టీలకు అతీతంగా రాజకీయ నాయకులు, గాయనీ గాయకులు, రచయితలు, వివిధ వర్గాల ప్రజలు ఆమెకు అండగా నిలుస్తున్నారు. అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు చిత్రకు ఉందని తేల్చిచెప్పారు. ట్రోలింగ్ చేసేవారి పట్ల మండిపడుతున్నారు. చిత్రకు కేరళకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు. చిత్ర ఇచ్చిన సందేశాన్ని వివాదాస్పదం చేయొద్దని హితవు పలికారు. రాముడి పట్ల విశ్వాసం ఉన్నవారు ఆయనను పూజిస్తారని, అందులో తప్పేముందని చిత్రకు మద్దతుగా పలువురు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, సినీ నటి ఖుష్బూ సుందర్ సైతం చిత్రకు మద్దతు ప్రకటించారు. కమ్యూనిస్ట్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అసహనం పెరిగిపోతోందని ఆరోపించారు.

రామ్‌లల్లా విగ్రహం ఖరారు

మైసూర్: అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించబోయే రామ్‌లల్లా విగ్రహాన్ని రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఖరారు చేసింది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ రూపొందించిన ప్రతిమకు ఆ మహద్భాగ్యం దక్కనుంది. ఈ నెల 22న గర్భాలయంలో విగ్రహం ప్రాణప్రతిష్ఠ జరుపుకోనుంది. అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించడానికి మూడు విగ్రహాలను చెక్కించారు. వీటిలో అరుణ్ యోగిరాజ్ చెక్కిన శిల్పాన్ని ఎంపిక చేశారు. ఈ విగ్రహం ఐదేళ్ల బాలరాముడి రూపంలో ఉందని ట్రస్టు ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. నిల్చున్న రూపంలోనే విగ్రహాన్ని తయారు చేయించామని చెప్పారు. రామ్‌లల్లా విగ్రహాన్ని ఈ నెల 18వ తేదీన గర్భాలయంలోని ఆసనంపైకి చేరుస్తామని వెల్లడించారు. బాలరాముడి విగ్రహాన్ని తయారు చేయడానికి ఎంతగానో శ్రమించారని, ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపానని అరుణ్ యోగిరాజ్ కుటుంబ సభ్యులు మంగళవారం చెప్పారు. రామ్‌లల్లా విగ్రహాన్ని చెక్కుతుండగా గాయం వల్ల ఆయనకు కంటి నొప్పి వచ్చిందని అన్నారు. యోగిరాజ్ రూపొందించిన శిల్పాన్ని తీర్థ క్షేత్ర ట్రస్టు ఎంపిక చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ మహాకార్యం కోసం దేవుడు తన భర్తను ఎన్నుకొని ఉండొచ్చని యోగిరాజ్ భార్య విజేత అన్నారు. ఇది తమకు మర్చిపోలేని రోజు అని యోగిరాజ్ సోదరుడు సూర్యప్రకాశ్ పేర్కొన్నారు. వార్త తెలిసిన తర్వాత తమకు చెప్పలేనంత ఆనందంగా ఉందని ఆయన తల్లి సరస్వతి అన్నారు. అరుణ్ యోగిరాజ్ గొప్ప శిల్పిగా ప్రఖ్యాతిగాంచారు. కేదార్‌నాథ్‌లో ప్రతిష్ఠించిన ఆది శంకరాచార్య, ఢిల్లీలో ఇండియా గేట్ వద్ద నెలకొల్పిన సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను ఆయనే రూపొందించారు.

కునో పార్కులో మరో చీతా మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో శౌర్య అనే చీతా మంగళవారం చనిపోయింది. ఈ విషయాన్ని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి నగర్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. మృతికి కారణాలు పోస్టుమార్టం నివేదిక అందాకే తెలుస్తాయన్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో శౌర్య అనే మగ చీతా సరిగ్గా నడవడం లేదని అధికారులు గుర్తించారు. మత్తు ఇచ్చి, సమస్యను గుర్తించే ప్రయత్నం చేస్తుండగానే సాయంత్రం 3.17 గంటల సమయంలో చీతా తుదిశ్వాస విడిచిందన్నారు. 2022లో నమీబియా నుంచి చీతాలను తీసుకువచ్చిన తర్వాత సంభవించిన 10వ మరణమని ఆయన అన్నారు. 2023 మార్చి తర్వాత శౌర్య సహా ఏడు చీతాలు, మూడు కూనలు వివిధ కారణాలతో చనిపోయినట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కునో పార్కులో 6 మగ, 7 ఆడ, 4 కూనలు కలిపి మొత్తం 17 చీతాలున్నాయన్నారు.

జపాన్ ఎయిర్‌పోర్టులో మరో ప్రమాద ఘటన

టోక్యో: జపాన్‌లో మరో విమాన ప్రమాద ఘటన చోటుచేసుకుంది. కొరియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం రన్‌వేపైకి వెళ్లే క్రమంలో నిలిపి ఉన్న క్యాథే పసిఫిక్ విమానాన్ని ఢీకొట్టింది. జపాన్‌లోని న్యూ చిటోజ్ విమానాశ్రయంలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. రెండు వారాల క్రితం హనేడా ఎయిర్‌పోర్టులో జపాన్ ఎయిర్‌లైన్స్ విమానం, కోస్ట్ గార్డ్ విమానం ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఘటనలో కోస్ట్ గార్డ్ విమానంలోని ఆరుగురు సిబ్బందిలో అయిదుగురు సజీవ దహనమైన విషయం తెలిసిందే. మంగళవారం కొరియా ఎయిర్‌లైన్స్ విమానం 289 మంది ప్రయాణికులతో పార్కింగ్ స్థలం నుంచి టేకాఫ్ తీసుకునేందుకు రన్‌వే వైపుగా వెళుతోంది. ఆ క్రమంలో పక్కనే నిలిపి ఉన్న క్యాథే పసిఫిక్ విమానానికి ఎడమ వైపు రెక్క ఢీకొట్టింది.

మధుర షాహీ ఈద్గా మసీదులో సర్వేపై సుప్రీం స్టే

అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వు అమలును నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని మధురలో శ్రీకృష్ణ జన్మభూమి సమీపంలో ఉన్న షాహీ ఈద్గా మసీదులో శాస్త్రీయ సర్వేను నిలిపివేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. న్యాయస్థానంలో పర్యవేక్షణలో శాస్త్రీయ సర్వేకు అనుమతి ఇస్తూ అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై అత్యున్నత న్యాయస్థానం స్టే విధించింది. అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వును సవాలు చేస్తూ మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్లపై ఈ నెల 23లోగా స్పందన తెలియజేయాలని హిందూ సంఘాలను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది.

తొలి ప్రైమరీలో ట్రంప్‌దే గెలుపు

- అత్యధికంగా 51 శాతం ఓట్లు కైవసం
- సత్తా చాటలేకపోయిన మరో అభ్యర్థి వివేక్ రామస్వామి
- అధ్యక్ష అభ్యర్థి రేసు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటన



అయోవాలో జరిగిన విజయోత్సవ కార్యక్రమంలో ట్రంప్ అభివాదం

వాషింగ్టన్: అమెరికా పార్లమెంట్‌పై దాడికి ఉసిగొల్పాడన్న ఆరోపణలు, నీలిచిత్రాల తారతో అనైతిక ఆర్థిక లావాదేవీ, పదుల కొద్దీ కేసుల ఉదంతాలు వెలుగుచూసినా.. రిపబ్లికన్ పార్టీలో మెజారిటీ కార్యకర్తలు ఇంకా డొనాల్డ్ ట్రంప్ వెంటే ఉన్నారని రుజువైంది. రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం అయోవా రాష్ట్రంలో జరిపిన ప్రైమరీ ఎన్నికల్లో తోటి అభ్యర్థులందరినీ వెనక్కి నెట్టి మాజీ దేశాధ్యక్షుడు ట్రంప్ అత్యధిక ఓట్లను కైవసం చేసుకుని ఘన విజయం సాధించారు. దీంతో రాష్ట్రాలవారీగా జరిగే ఈ ఎన్నికల్లో తొలి రాష్ట్రంలోనే ట్రంప్ బోణీ కొట్టడం రాజకీయ విశ్లేషకులనూ ఆశ్చర్యానికి గురిచేసింది. సోమవారం రాత్రి జరిగిన ఈ ఎన్నికల్లో ట్రంప్‌కు 51 శాతం ఓట్లు ఒడిసిపట్టారు. గట్టి పోటీదారుగా అందరూ భావించిన ఫ్లోరిడా గవర్నర్ రాన్ డీశాంటిస్‌కు 21.2 శాతం ఓట్లు పడ్డాయి. ఐక్యరాజ్యసమితి మాజీ రాయబారి, సౌత్ కరోలీనా మాజీ మహిళా గవర్నర్ నిక్కీ హేలీకి 19.1 శాతం ఓట్లు వచ్చాయి. భారతీయ మూలాలున్న అమెరికన్ వ్యాపారవేత్త, సంపన్నుడు వివేక్ రామస్వామి ఈ రేసులో ప్రభావం చూపలేకపోయారు. ఆయనకు కేవలం 7.7 శాతం ఓట్లు పడ్డాయి. సగానికిపైగా ఓట్లు సాధించి నిర్ణయాత్మక రాష్ట్రంలో గెలుపు ద్వారా అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రధాన అభ్యర్థి తానేనని ట్రంప్ మరోసారి ప్రకటించుకున్నారు. అయోవా రాష్ట్ర చరిత్రలో ఒక అభ్యర్థి ఇంతటి భారీ మెజారిటీతో గెలవడం ఇదే తొలిసారి. ఓట్ల పరంగా చూస్తే మరో అభ్యర్థి అసా హచిన్‌సన్‌కు కేవలం 191 ఓట్లు, ఇంకో అభ్యర్థి క్రిస్ క్రిస్టీకి 35 ఓట్లు పడ్డాయి. అత్యల్ప ఓట్లు సాధించడంతో తాను ఈ పోటీ నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు అర్కన్సాస్ మాజీ గవర్నర్ అసా హచిన్‌సన్ ప్రకటించారు. ఈసారి మొత్తంగా 1,10,000 మంది ఓట్లు వేశారు. ఈ రాష్ట్రంలో ఇంత తక్కువగా ఓటింగ్ జరగడం గత 20 ఏళ్లలో ఇదే తొలిసారి.

ఇక ట్రంప్‌కే నా మద్దతు: వివేక్ రామస్వామి

అయోవా ప్రైమరీ ఎన్నికల్లో తక్కువ ఓట్లతో నాలుగో స్థానానికి పరిమితమైన భారతీయ వ్యాపారి వివేక్ రామస్వామి ఇక ఈ రేసు నుంచి పూర్తిగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. '' ఈ రాష్ట్ర ప్రైమరీలో ఆశ్చర్యకర ఫలితాలను ఆశించి భంగపడ్డా. ఇక ప్రచారానికి స్వస్తి పలుకుతున్నా. అధ్యక్షుడినయ్యే మార్గమే లేదు. ఇక నా మద్దతు ట్రంప్‌కే'' అని తన మద్దతుదారుల సమక్షంలో వివేక్ మాట్లాడారు.

దొంగతనం ఉదంతంలో న్యూజిలాండ్ మహిళా ఎంపీ రాజీనామా

వెల్లింగ్టన్: దుకాణాల్లో వస్తువులు దొంగలించిందన్న ఆరోపణలపై న్యూజిలాండ్ మహిళా ఎంపీ గోలిజ్ గ్రాహమన్ తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆక్లాండ్, వెల్లింగ్టన్ నగరాల్లోని బొటిక్, షాపింగ్‌మాల్‌లో మూడు సార్లు దొంగతనానికి పాల్పడినట్లు ఆమెపై ఆరోపణలు వచ్చాయి. షాపింగ్‌మాల్‌లో అత్యంత ఖరీదైన హ్యాండ్‌బ్యాగ్, డ్రెస్‌ను ఆమె దొంగలిస్తున్న సీసీటీవీ ఫుటేజీలు బహిర్గతం కావడంతో ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. పోలీసు దర్యాప్తు కొనసాగుతుండటంతో గోలిజ్ తన ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తన చర్యకు బేషరతు క్షమాపణలు చెప్పారు. గతంలో ఆమె మానవహక్కుల కేసులు వాదించే లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. తర్వాత రాజకీయాల్లో చేరి గ్రీన్ పార్టీ తరఫున ఎంపీగా గెలిచారు. ఇరాన్ నుంచి వలసవచ్చి 2017 సంవత్సరంలో న్యూజిలాండ్‌లో ఎంపీ అయిన తొలి వలస వ్యక్తిగా రికార్డులకెక్కారు.

డీప్ ఫేక్‌కు గురైన సచిన్ టెండూల్కర్

సాక్షి, న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ డీప్ ఫేక్ బారిన పడ్డారు. ఓ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ కోసం ఆయన ప్రచారం చేస్తున్నట్లుగా ఓ వ్యక్తి సోషల్ మీడియాలో వీడియోను పోస్ట్ చేశాడు. 'స్కైవార్డ్ ఏవియేటర్ క్వెస్ట్'యాప్‌లో నా కుమార్తె గేమ్ ఆడుతుంది. ఈ గేమ్ ద్వారా రోజుకు 2100 డాలర్లు సంపాదిస్తోంది. చాలా మంది ఈ యాప్ ద్వారా గేమ్ ఆడి డబ్బు సంపాదిస్తున్నారు'అంటూ ఓ వీడియో ఇంటర్నెట్‌లో చక్కర్లు కొడుతోంది. దీనిపై సచిన్ టెండూల్కర్ సోమవారం స్పందించారు. డీప్ ఫేక్‌ల వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వాల నుంచి సత్వర చర్యలు చాలా కీలకం'అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. కేంద్ర సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌లతో పాటు మహారాష్ట్ర సైబర్ క్రైంలకు ఆయన ట్యాగ్ చేశారు. సచిన్ ట్వీట్‌పై మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఏఐ, డీప్ ఫేక్ వంటి వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు త్వరలోనే పటిష్టమైన ఐటీ చట్టాలను అమల్లోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు.

ద.కొరియా మన శత్రువు

- అలా రాజ్యాంగ సవరణ చేయండి
- ఉన్నతాధికారులకు ఉ.కొరియా నియంత కిమ్ ఆదేశం

సియోల్: గతంలో ఉత్తరకొరియా నేతలు దక్షిణకొరియా, ఉత్తరకొరియాలను కలిపేందుకు పునరేకీకరణ పనుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వసంస్థలను శాశ్వతంగా మూసేయాలని ఉ.కొరియా నియంత కిమ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం ఉ.కొరియా పార్లమెంట్ అయిన సుప్రీం పీపుల్స్ అసెంబ్లీలో కిమ్ ప్రసంగం వివరాలను అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. '' అమెరికా, జపాన్‌ల అండతో కయ్యానికి కాలు దువ్వుతున్న దక్షిణ కొరియాతో స్నేహబంధం అనే మాటే లేదిక. దక్షిణ కొరియాతో స్నేహబంధం అనే భావనను రాజ్యాంగం నుంచి తొలగించండి. పునరేకీకరణ, సయోధ్యను ప్రోత్సహిస్తూ అందుకు ప్రయత్నాలు చేస్తున్న ప్రభుత్వ సంస్థలను మూసేయండి. దక్షిణకొరియాను శత్రుదేశంగా ప్రకటించండి. యుద్ధాన్ని మేం కోరుకోవట్లేదు. తప్పని పరిస్థితి ఎదురైతే యుద్ధానికి దిగుతాం'' అని పార్లమెంట్‌సభ్యులకు కిమ్ ఆదేశాలిచ్చారు.

రైల్వే బంధం తెంపేద్దాం, స్మారకం కూల్చేద్దాం

కిమ్ ఆదేశాల మేరకు కమిటీ ఫర్ ది పీస్‌ఫుల్ రీయూనిఫికేషన్, నేషనల్ ఎకనమిక్ కోఆపరేషన్ బ్యూరో, ఇంటర్నేషనల్ టూరిజం అడ్మినిస్ట్రేషన్ సంస్థలను మూసేయనున్నారు. '' ద.కొరియా, అమెరికాల సంయుక్త సైనిక విన్యాసాలు, అమెరికా వ్యూహాత్మక సైనిక బలగాల మొహరింపు, ద.కొరియా, అమెరికా, జపాన్‌ల త్రిముఖ భద్రతా సహకారం.. కొరియా ద్వీపకల్పాన్ని యుద్ధం అంచుకు నెట్టుకుపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ద.కొరియాతో స్నేహం, సహకారం అసంభవం. ద.కొరియా, ఉ.కొరియాల మధ్య ఉన్న రైల్వే రైళ్లను మూసేయండి. ప్యాంగ్యాంగ్‌లోని పునరేకీకరణ స్మారకాన్ని కూల్చేయండి'' అని కిమ్ ఆదేశాలిచ్చారు. ' ద్వీపకల్పంలో అణు యుద్ధం మొదలైతే ద.కొరియాను ఈ భూపటంపై లేకుండా చేస్తాం. అమెరికా కనీవినీ ఎరుగని అపార నష్టాన్ని చవిచూస్తుంది' అని కిమ్ హెచ్చరించారు. దీనిపై ద.కొరియా స్పందించింది. '' అతను జాతి వ్యతిరేకి. చరిత్రను ఒప్పుకోని మనిషి. కవ్వింపు చర్యలకు దిగితే అంతకు మించి సైనిక చర్యలతో మట్టికరిపిస్తాం''అని ద.కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ మంగళవారం కేబినెట్ భేటీలో అన్నారు.

హాజరవడం కష్టమే

- 'ప్రాణప్రతిష్ఠ'ను బీజేపీ రాజకీయ వేదికగా మార్చేసింది
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



కోహిమాలో స్థానికులతో రాహుల్

చిఫోబొజౌ(నాగాలాండ్): అయోధ్యలో రామ మందిరం ప్రాణప్రతిష్ఠ క్రతువు ఎన్నికల రంగులద్దుకుని 'నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్-బీజేపీ' ఫంక్షన్‌గా ముస్తాబవుతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. సోమవారం సాయంత్రం నాగాలాండ్‌లోకి అడుగుపెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారం సైతం వేలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, మద్దతుదారుల నడుమ కొనసాగింది. యాత్రను ముందుండి నడిపిస్తున్న రాహుల్ గాంధీ మంగళవారం రాష్ట్ర రాజధాని కోహిమాలో కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి అందిన ఆహ్వానాన్ని తమ పార్టీ అగ్రనేతలు సున్నితంగా తిరస్కరించడాన్ని ఆయన గట్టిగా సమర్థించారు. '' మందిరం ప్రారంభోత్సవానికి కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీల నేతలు ఎవరు వెళ్లినా నేను మనసారా స్వాగతిస్తా. కానీ ఇప్పుడు ఆ కార్యక్రమం మొత్తం మోదీ, ఆర్ఎస్ఎస్ కేంద్రంగా తయారైంది. చక్కని వేడుకను ఆర్ఎస్ఎస్, బీజేపీలు రాజకీయ వేడుకగా మార్చేశాయి. అందుకే ఈ కార్యక్రమానికి వెళ్లొద్దని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, సోనియా గాంధీ భావించి ఉంటారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని మతాలు, సంప్రదాయాలు సమానమే. 22న అయోధ్య జరిగే కార్యక్రమం.. రాజకీయ ఉత్సవంలా మారిందని స్వయంగా కొందరు హిందూ మత పెద్దలే బహిరంగంగా విమర్శించారు. ఇలా కొత్తరూపును సంతరించుకున్న ఈ కార్యక్రమానికి మేం వెళ్లడం కష్టం. అసాధ్యం కూడా'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ''ఇండియా కూటమి బలంగా ఉంది, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తుంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో సీట్ల పంపకం విషయంలో నెలకొన్న విభేదాలు సమసి పోతాయి'' అని రాహుల్ ధీమా వ్యక్తం చేశారు.

వార్‌రూంలు ఏర్పాటు చేసుకోండి

న్యూఢిల్లీ: పొగమంచుతో విమానాల రాకపోకలకు అంతరాయం కలగడంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా మరిన్ని చర్యలు ప్రకటించారు. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా విమానాశ్రయాల అధికారులు రోజులో మూడు దఫాలుగా విమానాల రాకపోకలకు సంబంధించిన నివేదికలు పంపాలని ఆదేశించారు. ప్రయాణికుల సమస్యలను తక్షణమే పరిష్కరించడం కోసం వార్ రూంలు ఏర్పాటు చేసుకోవాలని ఎయిర్‌పోర్టులను, విమానయాన సంస్థలను ఆయన కోరారు. విమానాశ్రయాల్లో రోజంతా సరిపోను సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. పొగమంచుతో విమానాలు ఆలస్యంగా నడుస్తుండటంతో ఢిల్లీలో ఇండిగో పైలట్‌పై విమాన ప్రయాణికుడి దాడి, ముంబై ఎయిర్‌పోర్టులోని టర్మాక్‌పై గోవా-ఢిల్లీ ఇండిగో విమాన ప్రయాణికుల బైటాయింపు వంటి ఘటనలు ఇటీవల నమోదు కావడంతో మంత్రి సింధియా ఈ మేరకు చర్యలను ప్రకటించారు.

ప్రధాని మోదీ డిగ్రీ వివాదం.. సుప్రీం కోర్టులో ఆప్ నేతలకు ఊరట

ఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిగ్రీ విద్యార్హతపై ఆప్ నేతలు చేసిన వ్యాఖ్యలకు గాను గుజరాత్ కోర్టులో పరువునష్టం కేసు విచారణపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆ కేసును గుజరాత్ వెలుపలికి, ముఖ్యంగా కోల్‌కతాలోని కోర్టుకు బదిలీ చేయాలంటూ ఆప్ నేత సంజయ్ సింగ్ వేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారించింది. మెట్రో పాలిటన్ కోర్టు జారీ చేసిన సమన్లను కొట్టివేయాలంటూ ఆప్ నేతలు కేజ్రీవాల్, సంజయ్ సింగ్ వేసిన పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని గుజరాత్ హైకోర్టును ధర్మాసనం కోరింది. అప్పటి వరకు ట్రయల్ కోర్టులో పరువు నష్టం కేసుపై స్టే కొనసాగుతుందని పేర్కొంది.

సాక్షి కరీంనగర్

బుధవారం । 17 । జనవరి । 2024



పోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. రద్దీ ఉండడంతో మొక్కులు చెల్లించుకునేందుకు ఎక్కువ సమయం ఎదురుచూడాల్సి వచ్చింది.



అట్టహాసంగా క్రికెట్ లీగ్

నగరంలోని అంబేద్కర్ మైదానంలో క్రికెట్ పోటీలు అట్టహాసంగా ప్రారంభం అయ్యాయి. 36 జట్లు పాల్గొననున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వాన్ని పడగొట్టే చరిత్ర బీజేపీదే



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాజీ సీఎం కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని, ప్రభుత్వాన్ని కేసీఆర్ పడగొడతారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ప్రభుత్వాలను పడగొట్టే చరిత్ర బీజేపీదేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆరోపించారు. మానకొండూర్‌లోని తన నివాసంలో జీవీఆర్ మంగళవారం మాట్లాడుతూ.. బండి సంజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితం అన్నారు. బీజేపీ ఇదివరకే మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ప్రభుత్వాలను కూల్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురించి ఎందుకు వ్యతిరేకంగా మాట్లాడడం లేదని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా, 200 యూనిట్లు విద్యుత్‌సరఫరా, ప్రజాదర్బార్ తీసేసిన విషయాలపై ఎందుకు ప్రశ్నించడం లేదని అడిగారు. కేసీఆర్ అంటే బండి సంజయ్‌కి భయం అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కరీంనగర్‌లో వినోద్‌కుమార్, బండి సంజయ్‌కుమార్ మధ్యపోటీ ఉంటుందని అన్నారు. సంజయ్‌కి టికెట్ ఇచ్చేందుకు బీజేపీ అధిష్టానానికే ఇష్టం లేదని తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, నాయకులు శాతరాజు యాదగిరి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, పిట్టల మధు, అంజయ్య, దేశబోయిన ప్రవీణ్ పాల్గొన్నారు.

బండి సంజయ్‌ని విచారించండి



సీపీకి ఫిర్యాదుచేసిన పత్రాన్ని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: పార్లమెంట్ ఎన్నికల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందని వ్యాఖ్యానించిన కరీంనగర్‌ఎంపీ బండి సంజయ్‌ను విచారించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. మంగళవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో సీపీకి ఫిర్యాదు చేశారు. సంజయ్ ఏ సమాచారంతో ఆ వ్యాఖ్యలు చేశారో బయటపెట్టాలన్నారు. తెలంగాణ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై ఏం కుట్రచేస్తున్నారో బయటపెట్టాలని కోరారు. అనంతరం పార్టీ సిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ఏసీపీకి ఫిర్యాదు చేశారు. కుట్ర జరుగుతున్న విషయం సంజయ్‌కు ఎలా తెలుసు, తెలిస్తే వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ఆయన ప్రశ్నించారు. కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కట్ల సతీశ్, పులి ఆంజనేయులు, వైద్యుల అంజన్‌కుమార్, కొరివి అరుణ్‌కుమార్, తాజ్ తదితరులు ఉన్నారు.

బస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఆర్‌ఎం



బస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సుచరిత

కరీంనగర్: సంక్రాంతి పండగ తరువాత తిరుగుప్రయాణంలో కరీంనగర్ బస్‌స్టేషన్ నుంచి వివిధ రూట్లలో ప్రయాణికుల రద్దీని కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్.సుచరిత పరిశీలించారు. అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ రజనీకృష్ణ, కరీంనగర్–2 డిపో మేనేజర్ మల్లయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లును ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌ఎం సూచించారు. వీరివెంట బస్‌స్టేషన్ సూపర్‌వైజర్లు జీఎల్.నారాయణ, ఎం.అంజిరెడ్డి పాల్గొన్నారు.

18న ఉద్యోగ మేళా

విద్యానగర్(కరీంనగర్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 18న కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కే.దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పేటీఎంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగల కోసం పదోతరగతి, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసి 18 నుంచి 35సంవత్సరాల లోపు వయసున్న అభ్యర్థులు అర్హులు అన్నారు. బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఈ సందర్భంగా సూచించారు.

బడికి రాం రాం!


- డెప్యూటేషన్‌తో పాఠశాలలకు టీచర్లు దూరం
- ఏళ్లు గడుస్తున్నా ముఖం చూపించని ఉపాధ్యాయులు
- రాజకీయ పలుకుబడి కారణమన్న అపవాదు
- పరపతి పెంచుకుని నచ్చిన చోట 'సర్దుబాటు'
- అందరినీ వెనక్కి పిలవాలంటున్న వైనం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో పలువురు డెప్యూటేషన్ మీద వెళ్లి ఏళ్లు గడుస్తున్నా తిరిగి రావడం లేదు. కొందరైతే తాము ఏ శాఖకు చెందినవారో మర్చిపోయేంతగా ఫారిన్ సర్వీసుల్లో తిష్ట వేశారంటే అతిశయోక్తి కాదు. నిబంధనల ప్రకారం ఫారిన్ సర్వీసుల్లో ఉన్న వారు ఐదేళ్ల తరువాత తిరిగి మాతృశాఖకు రావాలి. కానీ దాదాపు దశాబ్దకాలంగా కొందరు టీచర్లు పూర్తిగా బోధనకు దూరమయ్యారు. తాము టీచర్లమన్న సంగతి గుర్తులేనంతగా ఇతరశాఖల్లో పాతుకుపోయారు. ఈ వ్యవహారం కేవలం కరీంనగర్ జిల్లాకే పరిమితం కాలేదు. పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాలలోనూ ఇదేతంతు సాగుతోంది. ఇంత కాలం రాజకీయ అండదండలతో ఫారిన్ సర్వీసుల్లో తరిస్తోన్న టీచర్లంతా.. అక్కడ సేవలు చాలించి, మాతృశాఖకు రావాలన్న డిమాండ్ ఇప్పుడు విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల రూపంలో తెరపైకి వస్తోంది. విద్యార్థులకు పాఠాలు చెప్పాలన్న బాధ్యతగానీ, సిలబస్ పూర్తి చేయాలన్న సంకల్పంగానీ.. తదితర మాటలేవీ వీరి ఉద్యోగ నిఘంటువులో లేవంటే అతిశయోక్తి కాదు.

నచ్చినప్పుడు విద్యాశిక్షణ సంస్థకు

కావాల్సిన అర్హత, రాజకీయ పలుకుబడి ఉండి, టీచర్ సంఘం నేత అయితే డెప్యూటేషన్ నల్లేరు మీద నడకే. ఇదే కోవలో జిల్లాలోని విద్యాశాఖ సంస్థ నుంచి పాఠశాలకు అక్కడినుంచి జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)కు కొందరు ఉపాధ్యాయులు నచ్చినప్పుడు మారుతున్నారు. ఈ వ్యవహారాన్ని డెప్యూటేషన్‌లో మునిగే ఉపాధ్యాయులంతా ఆర్టీసీ షటిల్ సర్వీస్ అని ముద్దుగా పిలుచుకుంటారు. డెప్యూటేషన్ మీద వెళ్లాలనుకువారికి క్రీడా పాఠశాల అయితే విడిది కేంద్రంగా మారిందన్న విమర్శలున్నాయి. ఒకవేళ వెంటనే క్రీడాపాఠశాలలో అవకాశం లేకపోతే.. ముందు టౌన్ పాఠశాల అటు నుంచి క్రీడా పాఠశాలకు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక విద్యాధికారి కార్యాలయంలో, పరీక్షల బోర్డులో నలుగురైదుగురు ఉపాధ్యాయులు చాలా ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నారు. గతంలో బదిలీలు, పదోన్నతులు, స్పాట్ తదితర అత్యవసర సమయాల్లో మాత్రమే డిప్యూటేషన్ మీద ఉద్యోగులను తీసుకునేవారు. కానీ, మూడేళ్లుగా కొందరు టీచర్లు తమ మాతృశాఖను మర్చిపోయేలా శాశ్వత ఉద్యోగులను తలపించే స్థాయిలో ఇక్కడ పాతుకుపోయారని తోటి గురువులే ఆరోపిస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, టీచర్లు, విద్యార్థుల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు
కరీంనగర్	651	48,745	3,206
పెద్దపల్లి	592	46,241	2,209
సిరిసిల్ల	534	55,955	2,134
జగిత్యాల	783	49,946	1,403

ఇష్టానుసారంగా సర్దుబాట్లు

టౌన్‌లో అధికంగా ఉన్న మిగులు పోస్టులను పక్కనబెట్టి ఇతర మండలాల నుంచి టీచర్లను ఇష్టారాజ్యంగా సర్దుబాటు చేస్తున్నారని తోటి ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. దీని వెనక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపిస్తున్నారు. వీణవంక మండలంలో సింగిల్ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు ఏడు ఉండగా, ఆ బడులకు సర్దుబాటు చేయకుండా అదే మండలం నుంచి ఏడుగురు టీచర్లను టౌన్‌కు కేటాయించడంలో మతలాబేంటని తోటి టీచర్లు నిలదీస్తున్నారు. 36మంది విద్యార్థులున్న పాఠశాల నుంచి ఓ టీచర్‌ను టౌన్‌కు తరలించి, ఆ స్థానంలో మరో టీచర్‌ని సర్దుబాటు చేసిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ టీచర్‌ను ధన్గర్‌వాడీ నుంచి స్వగ్రామమైన హుజూరాబాద్ పరిసరాలకు పంపి, ఆ పోస్టును టౌన్‌కే చెందిన మరో టీచరతో సర్దుబాటు చేయడంపై తీవ్ర దుమారం రేగుతోంది. కంప్యూటర్ అసిస్టెంట్, ఎఫ్ఎల్ఎస్, ఉన్నతి మానిటరింగ్ పేరిట 10మందిని డైట్‌కు కేటాయించారు. వారి స్థానంలో మరో పదిమందిని సర్దేశారు. కొన్ని మండల విద్యాధికారి కార్యాలయాలలో ఏళ్లుగా కొందరు సహాయకులన్న పేరుతో బోధన మరిచి పాతుకుపోయారని టీచర్లు మండిపడుతున్నారు. ఇలాంటి అక్రమ డిప్యూటేషన్లు కేవలం కరీంనగర్‌కే పరిమితం కాలేదు. మిగిలిన సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లిలోనూ తవ్వినకొద్దీ ఇవే చిత్రాలు వెలుగుచూస్తున్నాయి.

- జగిత్యాలలో జిల్లా పరీక్షల బోర్డు (డీసీఈబీ)లో ఓ టీచరు కొన్నేళ్లుగా పనిచేస్తున్నాడు. ఈయన చాక్‌పీస్ పట్టి, పాఠాలు చెప్పిన దాఖలాలు దరిదాపున లేవన్న విమర్శలున్నాయి.
- సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలోని ఓ పాఠశాల నుంచి గత ప్రభుత్వానికి సన్నిహితుడిగా ముద్రపడ్డ ఓ టీచరు స్థానికంగా డిప్యూటేషన్ మీద పనిచేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గతంలో అదే టీచరు రాజకీయ పార్టీతో బాగా అంటకాగుతున్నాడన్న ఆరోపణలపై సస్పెండ్ కూడా కావడం గమనార్హం.

ఏ శాఖలో ఎందరున్నారు..?

- రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు కోరిన సర్కార్
- లెక్కలు తీస్తున్న జిల్లా అధికారులు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉద్యోగ విరమణ చేసినా.. వివిధ శాఖలు, వివిధ హోదాల్లో ఉన్నవారి వివరాలను జిల్లా అధికారులు సేకరిస్తున్నారు. రిటైర్డ్‌అయినా విధుల్లో ఉన్న వారి వివరాలను బుధవారం లోపు పంపించాలన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు కసరత్తు ప్రారంభించారు. అర్హత లేకున్నా పోస్టుల్లో కొనసాగుతున్నారని, వారిని తొలగించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వచ్చిన వినతుల మేరకు ప్రభుత్వం అలాంటి అధికారుల వివరాలను రాబట్టే పనిలో పడింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని అధికారులంతా అప్రమత్తమై జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. వివిధ శాఖలు, బోర్డులు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న వారి వివరాలు సేకరిస్తున్నారు. కొంతకాలంగా పనిచేస్తున్న పైస్థాయి అధికారులు ఎప్పుడు ఉద్యోగంలో చేరారు..? ఎప్పుడు విరమణ విరమణ పొందారు..? కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ప్రస్తుత శాఖలో ఎప్పటినుంచి పనిచేస్తున్నారు..? వేతనం, విద్యార్హతలు, ప్రస్తుతం పనిచేస్తున్న శాఖలో ఎప్పటివరకు కొనసాగాలని ఉత్తర్వులు ఉన్నాయో అనే అంశాలపై ఆరా తీస్తున్నారు.

ఉద్యోగుల పనితీరు గాడిన పడేనా?

- పెద్దాస్పత్రి వ్యవహారంపై కలెక్టర్ పమేలా సత్పతి సీరియస్
- ఫిర్యాదులు ఉన్న వైద్యులపై చర్యలు



కరీంనగర్‌టౌన్: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఇటీవల చోటు చేసుకున్న ఫిర్యాదుల పరంపర ఆందోళన కలిగిస్తోంది. వైద్యులపై ప్రజాప్రతినిధి, ప్రజాప్రతినిధిపై వైద్యులు.. ఇలా ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై కలెక్టర్ చర్యలకు ఉపక్రమించడంతో వైద్యులు పనితీరు ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోనే అతిపెద్ద ఆస్పత్రిగా పేరున్న ప్రభుత్వ ప్రధానాసుపత్రి ప్రస్తుతం వైద్య కళాశాలగా అప్‌గ్రేడ్ అయినా ఇక్కడ పనిచేస్తున్న కొంత మంది వైద్యుల పనితీరు మెరుగుపడలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై కొంతకాలంగా ప్రజాప్రతినిధులు, వైద్యుల మధ్య నెలకొన్న అంతర్గత పోరుతో జరుగుతున్న పరస్పర ఫిర్యాదుల ఆరోపణలను కలెక్టర్ సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవితో విచారణ జరిపించారు. ఆస్పత్రిలో సమగ్ర విచారణ చేపట్టిన వైద్యాధికారి నివేదికను కలెక్టర్‌కు అందించారు. దాని ఆధారంగా కలెక్టర్ చర్యలు చేపట్టారు. డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్, పిల్లల వైద్యుడు అజయ్‌కుమార్, ఫిజీషియన్ కనకం శ్రీనివాస్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. డీసీహెచ్ఎస్ కృష్ణప్రసాద్‌ను తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. ఆఫీస్ సూపరింటెండెంట్, ఏవో, సంబంధిత క్లర్క్‌లకు మెమో జారీ చేశారు. ఆర్‌ఎంవో డాక్టర్ జ్యోతిని జమ్మికుంట ఆసుపత్రికి పంపిస్తూ వర్క్‌ఆర్డర్‌తో పాటు మెమో ఇచ్చారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఇదే విషయమై డీసీహెచ్ఎస్, ఆర్‌ఎంవోలను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా స్పందించలేదు. కాగా ఆసుపత్రిలో కొనసాగుతున్న అంతర్గత పోరుతోనే పేషెంట్లు నష్టపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విచారణ ఎదుర్కొన్న వారే కాకుండా చాలా మంది సీనియర్ వైద్యులు విధులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓపీ విభాగాల్లో కూర్చోవడం లేదని, జూనియర్లతోనే ఓపీలు కొనసాగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కలెక్టర్ ఆసుపత్రిలో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి సారించడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిలో వణుకు మొదలైంది. ఇప్పటికైనా ఉద్యోగుల పనితీరు గాడిన పడుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

డీసీహెచ్ఎస్‌గా రవికాంత్?

కరీంనగర్ జనరల్ ఆసుపత్రి డిస్ట్రిక్ట్ కో– ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్)గా డాక్టర్ రవికాంత్‌ను నియమించినట్లు తెలిసింది. రవికాంత్ ప్రస్తుతం ఎంసీహెచ్‌లో పిల్లల వైద్యుడిగా సేవలందిస్తున్నారు. ఇన్నాళ్లు ఇక్కడ డీసీహెచ్ఎస్‌గా పనిచేసిన డాక్టర్ కృష్ణప్రసాద్‌ను పెద్దపల్లికి పంపించినట్లు సమాచారం. గతం నుంచి పెద్దపల్లి పోస్టింగ్‌లో ఉన్న కృష్ణప్రసాద్ డిప్యూటేషన్‌పై కరీంనగర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా, వైద్య కళాశాలగా మారిన తర్వాత డీసీహెచ్ఎస్‌గా పనిచేశారు. ఆసుపత్రిలో ఇటీవల చోటు చేసుకున్న ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ సూచనతో టీవీవీపీ కమిషనర్ నుంచి మార్పులు చేర్పులు జరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

బల్మూరికి బంపరాఫర్!

- ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెంకట్
- హుజూరాబాద్, తారుపల్లిలో సంబురాలు



హుజూరాబాద్/కాల్వశ్రీరాంపూర్: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం దక్కనుంది. ఈ మేరకు అధిష్టానం నుంచి కబురందగా.. ఈనెల 18 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 29న ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. బల్మూరి వెంకట్ ఉమ్మడి జిల్లాకు సుపరిచితుడు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి వెంకట్ అమ్మమ్మగారి ఊరుకాగా.. 2021 ఉపఎన్నికల్లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. అప్పటి వరకు హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌ను పట్టించుకునేవారు లేకపోవడంతో బల్మూరి వెంకట్ అన్నీతానై నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. 2023 సాధారణ ఎన్నికల వరకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొనసాగారు. అధిష్టానం సూచన మేరకు పోటీనుంచి తప్పుకోగా, అధిష్టానం బల్మూరి సేవలను గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడంతో హుజూరాబాద్‌లో వెంకట్ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు.

తారుపల్లిలో సంబురాలు

బల్మూరి వెంకట్‌కు ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం దక్కనుండడంతో అమ్మమ్మగారి ఊరైన కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి గ్రామంలో సంబురాలు అంబరాన్ని అంటాయి. వెంకట్ తాత తారుపల్లి మాజీ సర్పంచు గోపాలకిషన్‌రావు(కాంగ్రెస్). గోపాల్‌కిషన్‌రావు పెద్దకూతురు పద్మ– మధన్‌మోహన్‌రావుల రెండో కుమారుడు వెంకట్. మధన్‌మోహన్‌రావు సివిల్ కాంట్రాక్టర్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వెంకట్ తొమ్మిదో ఏటనుంచి తల్లి పద్మ అన్నీతానై డాక్టర్ చదివించింది. బల్మూరిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించడంతో తారుపల్లిలో సర్పంచు బైరం రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, కాల్వశ్రీరాంపూర్ ఎంపీపీ గోపగాని సారయ్యగౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నడపబడుతున్న(38) టీఎస్‌డబ్ల్యూఆర్‌సీవోఈల లో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 2024–25 విద్యాసంవత్సరం ప్రవేశంకోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీ–జేఈఈ, నీట్, సీఏఎం, సీఎల్ఏటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వబడునని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు రూ 200రుసుం చెల్లించి ఈనెల 20వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

5వ తరగతి ప్రవేశాలకు గడువు పొడిగింపు

సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాశాఖల ఆధ్వర్యంలో ఇంగ్లిష్ మీడియంలో బోధనతో విజయవంతంగా నడుస్తున్న గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైనవారు రూ.100 రుసుం చెల్లించి దరఖాస్తుచేసుకునేందుకు ఈనెల 20వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

బస్సుల కోసం నిరీక్షణ

కరీంనగర్: సంక్రాంతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నప్పటికీ ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య లేకపోవడంతో మంగళవారం కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో దూరప్రాంతాలకు వెళ్లేవారు ఇక్కట్లకు గురయ్యారు. హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, గోదావరిఖని, మంచిర్యాల వంటి ప్రధాన రూట్లలో రద్దీ కొనసాగింది. బస్సుల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పండక్కి వచ్చి తిరుగుప్రయాణాలు మొదలుకావడంతో సందడి కనిపించింది.



బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



తన కుమారుడికి భోగిపండ్లు పోస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



సంక్రాంతి సందర్భంగా రామమందిరం ముగ్గు వేస్తున్న మహిళ



కనుమ వేడుకల్లో మహిళలు, నూతన దంపతులు



హుజూరాబాద్‌లో కొనసాగుతున్న రథయాత్ర

సంబురంగా సంక్రాంతి

కరీంనగర్ కల్చరల్/కరీంనగర్ అర్బన్/చొప్పదండి/ హుజూరాబాద్: సంక్రాంతి సంబురాలు సోమవారం, కనుమ వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఇంటిఎదుట రంగవల్లులు, గొబ్బెమ్మలు, హరిదాసుల కీర్తనలు, పిండివంటల ఆరగింపులు, గాలిపటాల ఆటలు, సాంప్రదాయ దుస్తుల్లో యువతులు, పిల్లల కేరింతలు.. ఇలా ఎక్కడ చూసినా సంక్రాంతి సందడే కన్పించింది. వాడవాడన సంక్రాంతి వేడుకలు ఆనందోత్సాహాలతో జరుపుకోగా చాలామంది స్వగ్రామాలకు తరలివెళ్లడంతో నగరం బోసిపోయి కనిపించింది. కలెక్టర్ పమేలా సత్పతి క్యాంపు కార్యాలయంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చొప్పదండి ఆర్యవైశ్య భవన్‌లో భక్తులు పంచ కల్యాణాలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. హుజూరాబాద్ ఆంజనేయస్వామి ఆలయంలో రథోత్సవం ఘనంగా జరిగింది.



చొప్పదండిలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో పూజలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

తెలుగు రాజ్యాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ప్రవీణ్‌కుమార్



గంభీరావుపేట(సిరిసిల్ల): తెలుగు రాజ్యాధికార సమితి(టీఆర్ఎస్) తెలంగాణ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ కూడెల్లి ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు జైభీమ్ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రవీణ్‌కుమార్ స్వస్థలం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ముస్తఫానగర్. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యేలు



తెలంగాణ భవన్‌లో భోజనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

సిరిసిల్ల: సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావును ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు మాజీ ఎమ్మెల్యేలు మంగళవారం కలిశారు. కేటీఆర్‌ను కలిసి వారు చాలా సేపు చర్చలు జరిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పారమిత విద్యార్థి



కృతికను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌స్పోర్ట్స్: జనగాం జిల్లాలో మంగళవారం నుంచి ప్రారంభమైన 67వ రాష్ట్రస్థాయి కబడ్డీ అండర్– 14 బాలికల పోటీలకు స్థానిక పారమిత పాఠశాలకు చెందిన కృతిక ఎంపికైనట్లు హెచ్ఎం బాలాజీ తెలిపారు. ఇటీవల ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోటీల్లో రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని పారమిత పాఠశాలల అధినేత ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్లు వినోద్‌రావు, హనుమంతరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, అర్జున్, రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనంపై వచ్చి సెల్‌ఫోన్ చోరీ

జ్యోతినగర్(రామగుండం): వలస కార్మికుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. వివరాలిలా ఉన్నాయి.. ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి మేడిపల్లి రోడ్‌లో వలస కార్మికుల షెల్టర్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు నివసిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఝార్కండ్ రాష్ట్రానికి చెందిన వికాస్ తురియా షెల్టర్ ఎదుట నిలబడి బంధువులతో ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి సెల్ లాక్కుని పరారయ్యారు. బాధితుడు ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ప్రభుత్వ భూమిలో అక్రమ గుడిసెల తొలగింపు

- పోలీసుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

జగిత్యాలరూరల్: ప్రభుత్వ భూమిలో అక్రమంగా గుడిసెలు వేసి ఆ ప్రాంతాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన నిరుపేదల ఆశలు అడియాశలయ్యాయి. జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గత ప్రభుత్వం కొన్ని కుల సంఘాలకు పట్టాలిచ్చింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నెల రోజుల ముందు నుంచి ఓ పార్టీకి చెందిన నాయకులు పేదలను రెచ్చగొట్టి ప్రభుత్వ భూమిలో సుమారు 500 నుంచి వెయ్యి తాత్కాలిక గుడిసెలను ఏర్పాటు చేసుకునేలా వారిని ప్రోత్సహించారు. వారి నుంచి ఖర్చుల పేరిట కొంత డబ్బు కూడా వసూలు చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున నిరుపేదలు జగిత్యాలకు వచ్చి నర్సింగాపూర్ శివారులో గుడిసెలు వేసుకున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రస్తుత ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లు కలెక్టర్ యాస్మిన్ బాషాకు ఫిర్యాదు చేశారు. గుడిసెలు వేసేలా పేదలను ప్రోత్సహించిన ఆరుగురిపై జగిత్యాల రూరల్ తహసీల్దార్ రాంమోహన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గతంలో కేసు కూడా నమోదైంది. సదరు వ్యక్తులు గతంలో జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్, అర్బన్ మండలం మోతె గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేలా పేదలను తీసుకువచ్చి ప్రయత్నించారు. కానీ అక్కడి గ్రామస్తులు అడ్డుకొని గుడిసెలు వేయడకుండా ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ కూడా గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈక్రమంలో నర్సింగాపూర్ శివారులో వేసిన అక్రమ గుడిసెలను మంగళవారం వేకువజాము నుంచి పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో పూర్తిగా తొలగించారు. ఆ ప్రాంతానికి ఎవరూ వెళ్లకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గుడిసెవాసుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన గుడిసెవాసులు

జగిత్యాలటౌన్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా గుడిసెలు వేసుకుని అక్కడే తా త్కాలికంగా నివాసముంటున్నారు. ప్రభుత్వ భూ మిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా వేసిన గుడిసెలను రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. దీంతో ఆగ్రహించిన గు డిసెవాసులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందో ళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, పోలీసులు అరెస్టు చేసిన గుడిసెవాసులను వెంటనే విడుదల చేయాలన్నారు. తాము గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ భూముల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అట్టహాసంగా యూనిటీ కప్- 2024 క్రికెట్ లీగ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న యూనిష్‌పాష తదితరులు

- పోటీలను ప్రారంభించిన పెటా సంఘం కార్యదర్శి యూనిష్‌పాష
- పాల్గొననున్న 36 జట్లు
- పదిరోజులపాటు నిర్వహణ

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో యూనిటీ కప్ 2024 క్రికెట్ లీగ్ టోర్నమెంట్ మంగళవారం కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం, ఎస్సారార్ కళాశాల మైదానంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అంబేద్కర్ స్టేడియంలో కరీంనగర్ జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎండీ యూనిష్ పాష, కరీంనగర్ అర్బన్ జోన్ పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి అంతటి శంకరయ్య, క్రికెట్ కోచ్ కన్నన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కరీంనగర్ క్రికెట్‌లో మెరికల్లాంటి క్రీడాకారులు ఎందరో ఉన్నారన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లు వారి ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకు దోహదపడుతాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో జిల్లా నుంచి రంజి, జాతీయ జట్టుకు జిల్లా క్రీడాకారులు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు పి.యాదగిరి మాట్లాడుతూ, సుమారు 10 రోజుల పాటు జరగనున్న ఈ సీజన్ లీగ్ టోర్నమెంట్‌ను ఏటా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 36 జట్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు రూ.71వేలు, రన్నరప్ రూ.31వేలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి పుల్లమల్ల ప్రసాద్, సుల్తానాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి సిలివేరి మహేందర్, అర్చరీ సంఘం కార్యదర్శి కృష్ణ, నిర్వాహకులు సురేశ్, అమన్, మహర్షి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్ట్

- 4.03 కిలోల గంజాయి స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జగిత్యాలక్రైం: గంజాయి రవాణా చేసినా, విక్రయించినా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ అన్నారు. గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మంగళవారం రూరల్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. రాయికల్ మండలం భూపతిపూర్ ఎక్స్‌రోడ్ వద్ద మంగళవారం రాయికల్ ఎస్సై అజయ్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా భూపతిపూర్ గ్రామానికి చెందిన ఎండీ దిల్షద్, కదార్ల మహేశ్, పెద్ది జయంత్, దొనిశాల సాయి భరద్వాజ్‌లతో పాటు మరో మైనర్ బాలుడు ద్విచక్ర వాహనాలపై గంజాయి తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ.1,00,750 విలువ గల సుమారు 4.03 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 5 సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. నిందితులు ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా నుంచి గంజాయి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై అజయ్, కానిస్టేబుళ్లు సాగర్, సంతోష్, ప్రశాంత్‌ను సీఐ అభినందించారు.

అంతర్‌జిల్లా గజదొంగ అరెస్ట్

- 25తులాల వెండి ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రమోద్‌రావు

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని ప్రాంతంలో పలు చోరీలకు పాల్పడిన అంతర్‌జిల్లా దొంగ షేక్ సలీం అలియాస్ ఉస్మాన్ అలియాస్ అస్లాం, అలియాస్ జగన్(52)ను సోమవారం అరెస్ట్ చేసినట్లు గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట గ్రామానికి చెందిన ఇతను 33ఏళ్లుగా పలు జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లివచ్చాడు. ఇతడిపై పీడీయాక్ట్ కూడా నమోదైంది. ఇటీవల గోదావరిఖనిలోని మార్కండేయకాలనీ, ఎల్‌బీనగర్, రమేశ్‌నగర్ ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడ్డాడు. దొంగతనాల తీరు, సాంకేతిక ఆధారాలు, ఇతర ఆధారాలతో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సంక్రాంతి పండుగ సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి, రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడ్డాడు. ఈక్రమంలో స్థానిక లక్ష్మీనగర్ ప్రాంతంలో తిరుగుతుండగా చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడి నుంచి 25తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. చోరీ కేసులు ఛేదించడంతో కీలకంగా వ్యవహరించిన వన్‌టౌన్ క్రైం టీం ఎస్ఐ సమ్మయ్య, ఏఎస్ఐ మల్లయ్య, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్, గోపతి వెంకటేశ్ సీఐ అభినందించారు. రివార్డు కోసం రెఫర్ చేసినట్లు వివరించారు.

అప్పుల బాధతో సెంట్రింగ్ కార్మికుడి ఆత్మహత్య



రాజు(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన సెంట్రింగ్ కార్మికుడు బత్తుల రాజు(34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. ఆవునూర్‌కు చెందిన బత్తుల రాజు సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన ఉపాధి దొరక్క రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పురుగుల మందు తాగి, ముంబయిలోని తన సోదరికి వాట్సాప్‌లో మెస్సేజ్ పెట్టాడు. వెంటనే ఆమె ఆవునూర్‌లో ఉన్న కుటుంబీకులకు సమాచారం అందించారు. మందు ప్రభావాన్ని తట్టుకోలేని రాజు కుటుంబ సభ్యులకు ఫోన్ చేయడంతో వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రాజు మృతితో భార్య సింధూర రోదనలు మిన్నంటాయి. మృతునికి మూడేళ్ల కుమారుడు, ఏడాదిన్నర కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉపేందర్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

వేములవాడఅర్బన్: వేములవాడలోని చెక్కపల్లి రోడ్డు రాజీవ్‌నగర్‌లోని పిల్లిపుష్ప ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దొంగలు చొరబడి బంగారు దేవత విగ్రహాలతోపాటు నగదు వెండి సామగ్రిని దొంగిలించినట్లు తెలిపారు. పిల్లి పుష్పల ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో తన కూతురు వద్దకు వెళ్లింది. ఇది గమనించిన దొంగలు ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో తాళాలు పగులగొట్టి బీరువాలోని 30 గ్రాముల బంగారు దేవత విగ్రహాలతోపాటు వెండి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. స్థానికుల సమాచారంతో పుష్పల వేములవాడకు చేరుకొని ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టారు. వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోడిపందాల స్థావరంపై దాడి



పోలీసులు అదుపులోకి తీసుకున్న పందెంకోళ్లు

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని సాతారం శివారు మామిడితోటలో సోమవారం రాత్రి కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మండలంలోని శివారు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా బెట్టింగులతో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు సాతారం శివారు పెద్దవాగు సమీపంలో గల మామిడితోటలో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకోగా మిగతావారు పరారయ్యారు. ఆరు పందెంకోళ్లతో పాటు రూ.8,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరివేసుకుని వలస కూలీ బలవన్మరణం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మకాలనీలో అద్దె ఇంటిలో నివసిస్తూ పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలస కూలీ చంద్రహాస్(61) మంగళవారం అద్దె ఇంటిలో ఉ రివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజాంఘడ్ జిల్లా లాల్‌గంజ్‌కు చెందిన చంద్రహాస్ ఎనిమిదేళ్లుగా ఇందిరమ్మకాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ పవర్‌లూమ్ కార్మికుడిగా పనిచేస్తూ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఇటీవల వస్త్రపరిశ్రమ బంద్ కావడంతో అనారోగ్యం పాలుకావడంతో మనస్తాపానికి గురై అద్దె ఇంటిలో కర్చీఫ్‌ల బట్టతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆత్మహత్యకు సంబంధించిన సమాచారం గ్రామస్తులు తెలిపారు. ఇంటి యజమాని కొండికొప్పుల స్వప్న ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో బీజేపీ నాయకుడు మృతి



శంకరయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు పొనగంటి శంకరయ్య(56) సోమవారం వేకువజామున గుండెపోటుతో మృతిచెందాడు. జమ్మికుంట మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బీజేపీ నుంచి ఉప సర్పంచ్‌గా, తర్వాత మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి పోల్సాని సుగుణాకర్ రావు, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందారాజు, మాజీ ఎంపీపీ రామస్వామి, బీజేపీ సీనియర్ నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, జూనుతుల ఇంద్రారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య, వివిధ పార్టీల నాయకులు మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

ప్రముఖ మెగామోటర్స్ మల్టీబ్రాండ్ సర్వీస్ సెంటర్ కోసం టెక్నీషియన్స్ & స్టాఫ్ వెంటనే కావలెను. 1. సీనియర్ మెకానిక్స్, జీతం: 25,000 వరకు, 2. జూనియర్ మెకానిక్స్, జీతం: 15,000 వరకు, 3. వాటర్ వాషింగ్ మెన్, జీతం: 10,000 వరకు, 4. సర్వీస్ అడ్వైజర్, జీతం: 15,000 వరకు, 5. అకౌంటెంట్, జీతం: 12,000 వరకు. పురుషులు మరియు స్త్రీలు ఇద్దరూ కావలెను. ఫోన్: 9100142524. [HA-1096]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824

బావిలో పడి సెస్ ఉద్యోగి దుర్మరణం



రాజేశం మృతదేహం

కోనరావుపేట(వేములవాడ): ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి సెస్ ఉద్యోగి మృతిచెందాడు. కోనరావుపేట పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన శ్రీరాముల రాజేశం(55) అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2011లో రాజేశంకు ప్రమాదం జరిగినప్పటి నుంచి మానసికస్థితి సరిగ్గా ఉండడం లేదు. రోజూలాగే ఈనెల 14న విధులకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. 15వ తేదీ ఉదయం గ్రామానికి సమీపంలోని వ్యవసాయ బావిలో మృతిచెంది కనిపించాడు. మతిస్థిమితం సరిగ్గా లేని రాజేశం ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయినట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏఎస్సై రఘుపతిరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రాజేశంకు భార్య దేవేంద్ర, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలు..

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన మర్రి రాజవ్వ (70) పురుగుల మందు తాగి చికిత్సపొందుతూ మృతిచెందింది. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. రాజవ్వకు గత ఐదేళ్ల నుంచి మానసిక స్థితి సరిగా లేదు. వైద్యులకు చూపించినా నయం కాలేదు. మతిస్థిమితం కోల్పోయి ఉన్న ఆమె సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమారుడు గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన జంగిలి కనుకయ్య (53) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కనుకయ్య ఈనెల 10న క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారని తెలిపారు. మృతుడి భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలు..



లక్ష్మి(ఫైల్)

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని ఎల్లంపల్లిలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందింది. ఎస్ఐ ఆరోగ్యం తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపల్లికి చెందిన గాజుల లక్ష్మి(70) సోమవారం మధ్యాహ్నం పని నిమిత్తం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం వ్యవసాయ క్షేత్రాల్లో వెతుకుతుండగా రాములపల్లికి చెందిన ఎర్రం మహేందర్‌రెడ్డి వ్యవసాయ బావి వద్ద చెప్పులు కన్పించాయి. బావిలో గాలించగా మృతదేహం దొరికింది. బావి పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందిందని భర్త మొగిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా బావి పక్క నుంచి వెళ్తూ వృద్ధురాలు జారిపడితే ఆమెతోపాటు చెప్పులు కూడా బావిలో పడాలి. కానీ చెప్పులు బావి పైన ఎలా ఉంటాయని, లక్ష్మి ఉదయం నుంచి కనిపించడంలేదని ఎల్లంపల్లి గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో వైరలైందని, ఆమె మృతి పట్ల గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మొబైల్ ఫోన్లు అప్పగింత



బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని రాఘవపేటకు చెందిన చక్రవర్తుల సంతోష్, ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్ మొబైల్ ఫోన్లు ఎక్కడో పడిపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి పోయిన ఫోన్లను గుర్తించి మంగళవారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నవీన్‌కుమార్ మాట్లాడుతూ, ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా అట్టి ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలని పేర్కొన్నారు. దీని ద్వారా ఫోన్‌ను మళ్లీ పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరికైనా మొబైల్ ఫోన్‌లు, అనుమానిత వస్తువులు, విలువైన వస్తువులు దొరికితే సమీప పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలన్నారు.


ఆల్ ది బెస్ట్



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో మంగళవారం నుంచి ప్రారంభమైన 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్– 14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు మధ్యాహ్నం కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. ఈ సందర్భంగా జిల్లా జట్టుకు పెటా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎ.శ్రీనివాస్, యూనిష్‌పాష, పీడీ, పీఈటీలు కృష్ణ, వీరన్న, శ్రీనివాస్, సర్వర్, రాకేశ్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. విజయంతో తిరిగిరావాలని ఆకాంక్షించారు. – కరీంనగర్‌స్పోర్ట్స్


కట్టరాంపూర్‌లో ముగ్గు వేస్తున్న చిన్నారి


బొమ్మకల్‌లో శ్రీరాముని ముగ్గు


బొమ్మకల్‌లో వేసిన జై శ్రీరామ్ ముగ్గు

సంబురాల సంక్రాంతి


గోపాల్‌పూర్‌లో ముగ్గు వేస్తున్న మహిళ

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయమే ఇంటి ఎదుట కల్లాపి చల్లి పలు రంగులతో అందమైన ముగ్గులు వేశారు. అయితే ఈ సంక్రాంతి సరికొత్త శోభను సంతరించుకుంది. ఈ నెల 22న అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని కొంతమంది మహిళలు రాముడి ముగ్గులను వేసి తమభక్తిని చాటుకున్నారు. బొమ్మకల్‌లో పటేల్ మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు తమ ఇంటి ఎదుట శ్రీరాముడి బొమ్మలు, జై శ్రీరామ్ నినాదాలతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి.


కరీంనగర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు


చెర్లభూత్కూర్‌లో సంక్రాంతి ముగ్గు


కమాన్‌పూర్‌లో ముగ్గు వేస్తున్న మహిళ

ఆకట్టుకున్న 'చిద్విలా' వేసిన ముగ్గు




చిద్విలా రెడ్డి

సప్తగిరికాలనీ: కరీంనగర్ బ్యాంక్ కాలనీకి చెందిన డాక్టర్ కె చిద్విలారెడ్డి సంక్రాంతి సందర్భంగా ఇంటి ఎదుట వేసిన ముగ్గు ఆకట్టుకుంది. సీతారామ లక్ష్మణులు అయోధ్యలోని రామ మందిరంలోకి అడుగుపెతున్నట్లు ఆ అద్భుతమైన సన్నివేశాన్ని హనుమంతుడు తిలకిస్తున్నట్లుగా ముగ్గును వేసి ఔరా అనిపించింది. ఈనెల 22న అయోధ్యలోని రామమందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తాను ఈ ముగ్గు వేసినట్లు తెలుపుతున్నారు. చిన్నప్పటి నుంచి ముగ్గులు వేయడం అంటే ఎంతో ఇష్టమని, ఏటా సంక్రాంతికి వినూత్న తరహా ముగ్గులు వేస్తుంటానని, గతేడాది కొల్హాపూర్ వెళ్లివచ్చామని సంక్రాంతికి కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవార్ల ముగ్గులు వేశానని అన్నారు. కాగా చిద్విలా రెడ్డి వృత్తిపరంగా కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలోని వెల్‌నెస్ సెంటర్‌లో డాక్టర్‌గా పనిచేస్తున్నారు.

ఆధ్యాత్మికం
వైభవంగా అయ్యప్పస్వామికి అభిషేకం



మకర సంక్రమణం పురస్కరించుకుని కరీంనగర్ మండలం దుర్శేడ్‌లోని శ్రీమరకత లింగ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అయ్యప్పస్వామికి విశేష పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ పూజారి దేవరాజ్ ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేసి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, నందాల తిరుపతి, సాయిని తిరుపతి, జోగినపల్లి రఘునందన్‌రావు, శ్రీరామోజు తిరుపతి, తుమ్మ ఓంప్రకాశ్, తోట తిరుపతి, బుర్ర హరీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

అలరించిన ముగ్గుల పోటీలు


నాగులమల్యాలలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


కొత్తపల్లిలో ముగ్గులు పరిశీలిస్తున్న కౌన్సిలర్లు

కొత్తపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని సోమవారం కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, వినోదాత్మక ఆటల పోటీలు అలరించాయి. గ్రామానికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరై ముగ్గులు, ఆటల పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతలు అందజేశారు. ఎంటర్‌టైన్‌మెంట్ ఆటలు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పిల్లి శ్రీలతమహేశ్, ఎంపీటీసీ కొమ్ము హేమలత రవికిరణ్, కటకం రజిత, సర్పంచ్ నాయిని ప్రసాద్, వైద్యురాలు రేఖానాయక్, ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ ఉల్లెందుల నగేశ్, గ్రామస్తులు గోదల రంజిత్, గోదల నగేశ్, చట్టు శ్రీనివాస్, మల్యాల రాజాగౌడ్, సదానందం, వెన్నం అశోక్, నారాయణ గుప్తా, లక్కాకుల మోహన్‌రావు, నాయిని సుమంత్, వంగల సత్యం తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

కొత్తపల్లిలో సంక్రాంతి పండుగ రోజున బాపూజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు పొన్నం సత్యనారాయణగౌడ్, సభ్యుల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కౌన్సిలర్లు వాసాల రమేశ్, గున్నాల విజయ రమేశ్, వేముల కవిత చంద్రశేఖర్, పొన్నం సువర్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు పెద్ది దామోదర్, క్లబ్ సభ్యులు కన్నా అంజిబాబు, గుర్రం శ్రీనివాస్, భూమయ్య, హనుమంతరెడ్డి, సత్యనారాయణ, పొన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఊరంతా రామనామం


వాల్‌రైటింగ్ చేస్తున్న శ్రీనివాస్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌కు చెందిన కళాకారుడు భోగ శ్రీనివాస్ ఊరంతా రామనామంతో శ్రీరాముడిపై ఉన్న భక్తిని చాటుకున్నాడు. ఈనెల 22న ఆయోధ్యలో రామమందిరంలో బాలరాముడి విగ్రహప్రతిష్ఠాపనోత్సవం నేపథ్యంలో శ్రీనివాస్ మంగళవారం గ్రామంలోని ఇంటిగోడలపై జై శ్రీరామ్ నినాదాన్ని రాయడం ప్రారంభించారు. జై శ్రీరామ్ నినాదాలను రాసిన కళాకారుడు శ్రీనివాస్‌ను ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, నాయకులు భోగ రాజ్‌కుమార్, బుర్ర శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

సన్మానం


కిషన్‌ను సన్మానిస్తున్న రాజిరెడ్డి

కరీంనగర్‌రూరల్: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ ఆధ్వర్యంలో ప్రభుత్వ మాతా శిశు ఆస్పత్రిలో అల్పాహార పంపిణీ కార్యక్రమం మంగళవారంతో 200 రోజులు పూర్తయింది. అల్పాహార పంపిణీని విజయవంతంగా నిర్వహిస్తున్న హంగర్ రిలీఫ్ చైర్‌పర్సన్ చింతల కిషన్ పటేల్‌ను 320జీ గవర్నర్ హన్మాండ్ల రాజిరెడ్డి శాలువా కప్పి సన్మానించారు. పేదలకు నిరంతరం అల్పాహారం పంపిణీ కొనసాగించాలని సూచించారు.

చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న చకిలం స్వప్న

సప్తగిరికాలనీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని మేము సైతం యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర వీధుల్లో ఇంటి ఎదుట మహిళలు వేసిన ముగ్గులను సందర్శించి మంచిగా వేసిన ముగ్గులకు బహుమతులు ప్రదానం చేశారు. సంప్రదాయ బద్ధంగా వేసిన ముగ్గులకు కానుకగా పసుపు బొట్టు, చీరలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, బొమ్మకంటి కిషన్, కాచం సత్యనారాయణ, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నియామకాలపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం (కరీంనగర్ సర్క్యూట్ హౌస్)లో అక్రమంగా 18 మందిని నియమించిన నగర పాలక సంస్థ అధికారులపై విచారణ జరిపించి చర్య తీసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ సోహన్‌సింగ్ కమల్‌జిత్‌కౌర్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పురపాలక పరిపాలన అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ పరిధిలోని గెస్ట్‌హౌస్‌లో 18 మందిని నియమించి మున్సిపాలిటీ ద్వారా జీతాలు ఇస్తున్నారని తెలిపారు. దీనికోసం 18 మంది నుంచి రూ.2 లక్షల చొప్పున వసూలు చేశారని ఆరోపించారు. ఎవరి అనుమతి తీసుకోకుండా జరిగిన ఈ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధమన్నారు. సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

సన్నాల సాగుకు సై

- మార్కెట్‌లో డిమాండ్‌తో రైతుల మొగ్గు
- యాసంగిలో పెరుగనున్న పంట విస్తీర్ణం


ఇరుకుల్లలో సన్నరకం వరి నాటేస్తున్న కూలీలు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ వరిసాగు జోరందుకుంది. ముందుగా వరికోతలు పూర్తయి నీటి సౌకర్యమున్న కొందరు రైతులు ఇప్పటికే నాట్లు పూర్తి చేయగా మరికొందరు రైతులు ఇపుడిప్పుడే నాట్లు వేస్తున్నారు. సాధారణంగా వానాకాలంలో సన్నరకాలు, యాసంగిలో దొడ్డురకం సాగు చేసే రైతులు ప్రస్తుతం సన్నాల సాగుకే మొగ్గుచూపుతున్నారు. గత యాసంగిలో దొడ్డు రకం 80శాతం, సన్నాలు 20 శాతం మేర సాగు చేయగా.. ప్రస్తుతం 40శాతం వరకు సాగు చేస్తున్నారు.

12వేల ఎకరాల్లో వరిసాగు

యాసంగిలో కరీంనగర్ మండలంలో మొత్తం 12,185 ఎకరాల్లో వరి పంటను సాగుచేస్తారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. గతనెల 26 నుంచి ఎస్సారెస్పీ నీటి రాకతో పలు గ్రామాల్లో వరినాట్లు ఊపందుకున్నాయి. అయితే యాసంగిలో పంట చేతికొచ్చే దశలో వడగండ్ల వాన, తుఫాన్ తదితర ప్రకృతివైపరీత్యాలతో నష్టపోయే ప్రమాదం ఉంటుందని పలువురు రైతులు స్వల్పకాలిక దొడ్డురకాలను మాత్రమే సాగు చేస్తారు. అయితే ఈసారి మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. వానాకాలంలో రైతులు ఎక్కువగా సన్నాలను సాగు చేయడంతో మంచి దిగుబడి వచ్చింది. అంతేకాకుండా మార్కెట్‌లో ధాన్యానికి సైతం డిమాండ్ ఏర్పడింది. ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.2,500 ధర పలుకగా చివరకు రూ.3,500 వరకు ధర లభించింది. గతంలో ఎప్పుడు లేనంతగా ధర రావడంతో రైతులు యాసంగిలోనూ సన్నాలపై దృష్టిపెట్టారు. చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్, ఇరుకుల్ల, దుర్శేడ్, మొగ్దుంపూర్, గోపాల్‌పూర్, నగునూరు, బొమ్మకల్ తదితర గ్రామాల్లో 2,500 ఎకరాల్లో సాగు చేయనున్నారు. 125 రోజుల నుంచి 135 రోజుల్లో చేతికివచ్చే స్వల్పకాలిక రకాలైన బీపీటీ, తెలంగాణ సోన సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 4500 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేయగా 1,500 ఎకరాల్లో సన్నాలున్నట్లు వ్యవసాయాధికారి బి.సత్యం తెలిపారు. గత యాసంగి కంటే ప్రస్తుతం సన్నాల సాగు విస్తీర్ణం రెట్టింపు పెరిగిందని వివరించారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


సుదేష్ణ


వంశీ

కరీంనగర్‌స్పోర్ట్స్: మధ్యప్రదేశ్ రాష్ట్రం సుజలపూర్‌లో బుధవారం నుంచి ఈనెల 20 వరకు జరుగనున్న 67వ జాతీయస్థాయి పాఠశాలల అండర్ 17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు రామడుగుకు చెందిన జి సుదేష్ణ, గుల్లకోటకు చెందిన ఎం వంశీలు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబునగర్ జిల్లాలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్.జనార్దన్‌రావు, ఎస్జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ (హాయ్) కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డవేణి మధు, జిట్టబోయిన శ్రీనువాస్, కోశాధికారి కలిగేటి శ్రీనివాస్ , జాయింట్ సెక్రెటరీ జెట్టిపల్లి అశోక్ అభినందించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మానేరు విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న అనంతరెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో బుధవారం నుంచి జరుగనున్న 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ 14 సాఫ్ట్‌బాల్ పోటీలకు కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ మహేందర్ తెలిపారు. కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన ఈశ్వర్, హర్షవర్ధన్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతారెడ్డి, ప్రిన్సిపాల్ సరితారెడ్డి, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

'మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం సరికాదు'


మాట్లాడుతున్న మహేందర్

కరీంనగర్: గుంటూరు కారం సినిమాలో విలన్లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం సరికాదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్ అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శ్రామికవర్గ నేతలు, మార్క్సిస్ట్ మహోపాధ్యాయుల పేర్లు పెట్టి సమాజానికి తప్పుడు అవగాహన కల్పించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్, హీరో మహేశ్‌బాబులు బేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి, సినిమా నుంచి వీటిని తక్షణమే తొలగించేలా సెన్సార్ బోర్డు చర్యలు చేపట్టాలని సూచించారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూలుస్తామంటే తిరుగుబాటు తప్పదు


మాట్లాడుతున్న వేణుగోపాల్

కరీంనగర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వాన్ని మాజీ సీఎం కేసీఆర్ కూల్చే ప్రయత్నం చేస్తే ప్రజా తిరుగుబాటు తప్పదని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ కూల్చే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ బండి సంజయ్‌కు మార్ అనడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగానే ఖండించడం జరిగిందన్నారు. ప్రజాస్వామికంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కుల్చాలని చూస్తే తెలంగాణ మొత్తం అగ్నిగుండంలా మారుతుందని హెచ్చరించారు. సమావేశంలో బోయినపల్లి చంద్రయ్య, సిగిరి శ్రీధర్ పాల్గొన్నారు.

కరీంనగర్ యువతకు నాసిక్ సెంట్రల్ ఎమ్మెల్యే అభినందన


అభినందిస్తున్న దేవయాని ఫరాండే

కరీంనగర్‌స్పోర్ట్స్: స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవంను పురస్కరించుకొని ఈనెల 12 నుంచి 16వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన యువజనోత్సవాల్లో పాల్గొన్న కరీంనగర్ యువతను నాసిక్ సెంట్రల్ ఎమ్మెల్యే దేవయాని ఫరాండే అభినందించారు. కరీంనగర్ జిల్లాకు చెందిన యువత ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాల్‌ను ఎమ్మెల్యే సందర్శించి కరీంనగర్ వంటలు, పర్యాటక, పుణ్యక్షేత్రాల ప్రత్యేకతను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో వేములవాడ రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత కిరణ్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర జాతీయ యువజన అవార్డు గ్రహీతలు లిటన్ షీల్, గంజి రాజేందర్, జిల్లా యువజన ప్రతినిధులు మడ్డి రవిచందర్, ఉప్పు ఆదిత్య, దాసరి సింధూ, సిరి చందన, మాలతి తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ పొన్నం ప్రభాకర్ సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయమని తెలిపారు. టీపీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఇటీవల బదిలీ అయిన టీచర్స్‌ను వెంటనే రిలీవ్ చేయాలని, ఆగిన బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్ బిల్లులు, పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం మంత్రికి టీపీటీఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి దామోదర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు, జిల్లా బాధ్యులు రామచంద్రరెడ్డి, శశిధర్, తిరుపతి వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

'పొన్నం'ను విమర్శించే హక్కు సంజయ్‌కు లేదు'

కరీంనగర్‌కార్పొరేషన్ : తెలంగాణ ఉద్యమనేత, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే నైతిక హక్కు ఎంపీ బండి సంజయ్‌కి లేదని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు విమర్శించారు. మంగళవారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడి నుంచైనా గెలిచే దమ్మున్న నాయకుడు పొన్నం ప్రభాకర్ అని అన్నారు. వేరే స్థానం నుంచి పోటీ చేసి గెలిచే సత్తా సంజయ్‌కి ఉందా అని ప్రశ్నించారు. హిందూ మంతం బీజేపీ సొంతం కాదని, తాము కూడా హిందువులమేనన్నారు. మతం పేరుతో రాజకీయం చేసే సంజయ్‌కి పొన్నంను విమర్శించే అర్హత లేదన్నారు.

బండితోనే బీజేపీకి నష్టం

ఎంపీ బండి సంజయ్ వల్లనే బీజేపీకి తీవ్ర నష్టం జరుగుతుందని డీసీసీ అధికార ప్రతినిధి కొత్తకొండ శంకర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పొన్నంతో కాంగ్రెస్‌కు నష్టమని సంజయ్ వ్యాఖ్యానించడాన్ని ఖండించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు పరిష్కరించలేని సంజయ్ కాంగ్రెస్ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.

మున్నూరు కాపులకు ఎక్కువ సీట్లు కేటాయించాలి

కొత్తపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో మున్నూరు కాపులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని పార్టీలు ఎక్కువ సీట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరు కాపు యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆరె.దశరథం, మహేందర్, జంగిల్ అఖిల్, ప్రసాద్‌లు ఒక సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించే నామినేటెడ్ పదవుల్లో మున్నూరు కాపులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ప్రతీ జిల్లా కేంద్రంలో బాలబాలికల వసతి గృహాలు, జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో కాపు భవనాలకు స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలన్నారు. అదేవిధంగా రైతుకు పెన్షన్, ధాన్యానికి గిట్టుబాటు ధర, ధాన్యం నిలువకు గోదాంలు నిర్మించాలని, రాయితీపై వ్యవసాయ పనిముట్లు ఇవ్వాలని తెలిపారు.

రైలు ఢీకొని హమాలీకి గాయం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం గూడ్స్ రైలు ఢీకొట్టడంతో హమాలీ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. రేకుర్తికి చెందిన రాజు కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 11గంటలకు రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతున్న రాజును గూడ్స్ రైలు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు ఎడమ కాలు అక్కడికక్కడే తెగిపోయింది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి వచ్చి గాయపడిన రాజుకు ప్రథమచికిత్స చేసి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని రామగుండం రైల్వే పోలీసులు తెలిపారు.

వినోద్‌కుమార్ చొరవ వల్లే ఆర్వోబీ మంజూరు

కరీంనగర్: కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లిలో గల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో బీజేపీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలని, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అనేకమార్లు చేసిన ప్రతిపాదనల మేరకే ఆర్వోబీ బ్రిడ్జి మంజూరైందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అన్నారు. మంగళవారం బీజేపీ నాయకుడు గుగ్గిళ్లపు రమేశ్‌కు ఆర్వోబి బ్రిడ్జికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్ చేసిన ఉత్తర ప్రత్యుత్తరాలను స్పీడ్ పోస్టు ద్వారా పంచామన్నారు. 2014 నుంచి జాతీయ రహదారులు, ఆర్వోబీ బ్రిడ్జి, నూతన రైల్వే లైన్‌ల నిర్మాణాల కోసం రైల్వే బోర్డు జనరల్ మేనేజర్ శ్రీవాత్సవ, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ బి.అశోక్‌లకు రాసిన లేఖలను చూసుకోవాలని హితవు పలికారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్‌తో పాటు బీజేపీ నేతలు ఇకనైనా అబద్ధాలు, అసత్యాలు మాట్లాడటం మానుకోవాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ఇతర పార్టీలపై దుమ్మెత్తిపోయడం తగదన్నారు.

ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని చెప్పడం నేరమా..?

కరీంనగర్‌టౌన్: కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర చేస్తున్నారనే అనుమానాలున్నాయని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జాగ్రత్తగా ఉండాలని ఎంపీ బండి సంజయ్ సూచన చేస్తే నేరం ఎట్లా అవుతుందని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అధికారంలో లేని కేసీఆర్ ఎలాంటి కుట్రలైనా చేస్తాడని, అనేక మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుక్కున్నారని, ప్రస్తుతం అధికారం కోల్పోయిన కేసీఆర్ మళ్లీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయరని గ్యారంటీ ఏముందని ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్‌ను కేసీఆర్ కూల్చే కుట్ర చేస్తున్నారని ఎంపీ బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ నాయకుల వ్యవహారాలు చూస్తుంటే రాబోయే రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్‌కు మేలు చేసేలా ఉన్నాయన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్: రాజశేఖర్ - 9618304759
చొప్పదండి: ముండయ్య - 7997958217
మానకొండూర్: మహేశ్ - 9573106760
హుజూరాబాద్: ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం.: 1800 425 9899

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

క్లుప్తంగా...

జేఈఈ అభ్యర్థులకు రూట్‌మ్యాప్

సాక్షి, హైదరాబాద్‌: జేఈఈ మెయిన్స్‌ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్టు నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపింది. ఈ నెల 24న పేపర్‌–1 (ఆర్కిటెక్చర్‌) జరుగుతుంది. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు ఇప్పటికే పరీక్ష కేంద్రం వివరాలను https://jeemain.nta. nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. అయితే అడ్మిట్‌ కార్డులను మాత్రం ఇంకా విడుదల చేయలేదు. ఈ నెల 27న జేఈఈ మెయిన్స్‌ పేపర్‌–2 జరుగుతుంది. ఈ పరీక్ష రాసే వారి కేంద్రాల వివరాలను త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది. మెయిన్స్‌ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకూ జరుగుతాయి.

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం

తిరుమల: పవిత్రమైన ధనుర్మాసం ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. గతేడాది డిసెంబర్‌ 17వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ ధనుర్మాస ఘడియలు కావడంతో శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. కాగా, శ్రీవారికి మహా భక్తురాలైన శ్రీగోదాదేవి పరిణయోత్సవాన్ని పురస్కరించుకుని గోదామాలలు శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం అలంకరించారు.

అజ్మీర్‌ షరీఫ్‌ రైలు ప్రారంభం

నాంపల్లి (హైదరాబాద్‌): అజ్మీర్‌ షరీఫ్‌–హైదరాబాద్‌ ప్రత్యేక రైలును సోమవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్‌ హుస్సేన్‌ జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్‌ నుంచి అజ్మీర్‌కు వెళ్తున్న యాత్రికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌ రైల్వే స్టేషన్‌లో బయలుదేరిన ఈ రైలు.. ఈ నెల 17వ తేదీన ఉదయం 8.30 గంటలకు రాజస్తాన్‌లోని అజ్మీర్‌ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.

ఇద్దరు రాష్ట్ర అధికారులకు ఐఏఎస్‌ హోదా

సాక్షి, హైదరాబాద్‌: ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్‌ హోదా కల్పించింది. రాష్ట్ర ఆదాయ పన్నుల శాఖలో పనిచేస్తున్న కె.సీతాలక్ష్మీ, జి.ఫణీంద్రారెడ్డికి ఐఏఎస్‌ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

పోలీస్‌ స్పందన | 7 నిమిషాల్లో..

'100 యాప్‌'తో పెట్రోలింగ్‌ పర్యవేక్షణ

- 2023లో సరాసరి లెక్కించిన పోలీసులు
- ఈ ఏడాది ఇంకా తగ్గించేలా ప్రణాళిక
- గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగుపడే దిశగా అడుగులు



సాక్షి, హైదరాబాద్‌: ఏదైనా సంఘటన చోటుచేసుకున్న వెంటనే బాధితులు లేదా అక్కడ ఉన్న వారు వెంటనే డయల్‌ 100కు కాల్‌ చేస్తారు. ఆ కాల్‌ రిసీవ్‌ చేసుకున్నాక ఎంత తక్కువ సమయంలో పోలీసులు ఆ స్థలానికి చేరుకుంటే అంత మెరుగైన ఫలితాలు వస్తాయి. దీనినే సాంకేతికంగా 'పోలీస్‌ రెస్పాన్స్‌ టైమ్‌'అంటారు. గస్తీ విధానంలో జవాబుదారీతనం పెంచడం, నేరాలు చోటు చేసుకునే ప్రాంతాల్లోనే పెట్రోలింగ్‌ జరిగేలా చూడటం తదితర లక్ష్యాలతో ఓ యాప్‌ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా 2023కు సంబంధించి రెస్పాన్స్‌ టైమ్‌ను లెక్కించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరిన ఈ సమయం ఏడు నిమిషాలుగా ఉండగా, ఈ ఏడాది మరింత తగ్గించాలనేది పోలీసులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

ఒకప్పుడు ఇలా...

ఎవరైనా '100'కు కాల్‌ చేస్తే, అది నేరుగా 'డయల్‌–100'కమాండ్‌ సెంటర్‌కు చేరుతుంది. వెంటనే వారు బాధితుడు ఏ ఠాణా పరిధిలోకి వస్తాడో వాకబు చేస్తారు. ఆ తర్వాత సదరు ఫోన్‌ కాల్‌లోని అంశాలను సంక్షిప్త సందేశంగా (టెక్స్ట్‌) మార్చి బాధితుడున్న ఏరియాలోకి వచ్చే ఠాణాతో పాటు జోన్‌ కార్యాలయం, కమిషనరేట్‌కు చెందిన ప్రధాన కంట్రోల్‌ రూమ్‌లోని కంప్యూటర్లకు పంపించేవారు. దీంతో పాటు వాకీటాకీ ద్వారానూ సమాచారం ఇచ్చి గస్తీ వాహనాలను అప్రమత్తం చేసేవారు. ఈ సమాచారం అందుకునే గస్తీ వాహనం ఎక్కడ ఉంది? బాధితుడికి ఎంత దూరంలో ఉంది? తదితర అంశాలు తెలుసుకునే అవకాశం ఉండేదికాదు. ఫలితంగా గస్తీ వాహనం బాధితుడి వద్దకు చేరే సమయం చాలా ఎక్కువగా ఉండేది. ఘటనాస్థలికి చేరిన తర్వాత పెట్రోలింగ్‌ సిబ్బంది చెప్పే అంశాల ఆధారంగా ఫిర్యాదుగా పరిగణించే ఫోన్‌ కాల్‌ను క్లోజ్‌ చేసేవారు.

ఇప్పుడు...ట్యాబ్‌నే 'జీపీఎస్‌'

బాధితుడు '100'కు ఫోన్‌ చేసి సహాయం కోరిన వెంటనే అక్కడి సిబ్బంది సదరు ఫిర్యాదుదారుడు ఉన్న ప్రాంతాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. సిటీలోని ప్రతి గస్తీ వాహనం, బ్లూకోల్ట్స్‌లకు పోలీసు విభాగం ట్యాబ్స్‌ అందించింది. ఇవే జీపీఎస్‌ పరికరంగా పనిచేస్తుండటంతో దాని ఆధారంగా 'డయల్‌–100'సిబ్బందికి ఏ వాహనం ఏ ప్రాంతంలో ఉందో కంప్యూటర్‌ తెర/ట్యాబ్‌/ప్రత్యేక యాప్‌ ద్వారా కచ్చితంగా తెలుస్తుంది. దీంతో బాధితుడు ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న వాహనానికే నేరుగా ఆ ఫోన్‌ కాల్‌ డైవర్ట్‌ చేస్తున్నారు. ఈ తతంగం మొత్తం కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. పెట్రోలింగ్‌ వాహనాల్లో ఉండే సిబ్బంది ఫోన్లకు '100'నుంచి డైవర్ట్‌ అయిన కాల్‌ వస్తే.. ప్రత్యేక రింగ్‌టోన్‌ ద్వారా ట్యాబ్‌లో రింగ్‌ వస్తుంది. ఫోన్‌ ఎక్కడ నుంచి అనేది తేలిగ్గా తెలియడానికి అన్ని వాహనాల్లోని సిబ్బందికీ ఇలాంటి రింగ్‌టోన్‌ ఏర్పాటు చేశారు. ఆ సిబ్బంది ఫోన్‌ ఎత్తిన వెంటనే ఆ ట్యాబ్‌లో తెరపై ఓ నోటిఫికేషన్‌ ప్రత్యక్షమవుతుంది. అందులో బాధితుడు/ఫిర్యాదుదారుడికి సంబంధించిన అంశాలు, ఫిర్యాదు ఏమిటన్నవి కనిపిస్తాయి. వీటిని చూసిన వెంటనే గస్తీ వాహనంలోని సిబ్బంది 'రిసీవ్డ్‌'అనే బటన్‌ నొక్కడం ద్వారా ఫిర్యాదు అందుకున్నట్టు ధ్రువీకరిస్తున్నారు.

అలా...గణన షురూ..

పెట్రోలింగ్‌ వాహనం, బ్లూకోల్ట్స్‌ సిబ్బంది ఒకసారి ఫిర్యాదు అందుకున్నట్టు ట్యాబ్‌లో ఉండే '100 యాప్‌'ద్వారా ధ్రువీకరించిన వెంటనే 'రెస్పాన్స్‌ టైమ్‌'లెక్కింపు ప్రారంభమవుతోంది. ఘటనాస్థలికి చేరుకునే గస్తీ వాహనాలు ఫిర్యాదు తీరును బట్టి అవసరమైన రీతిలో స్పందించే విధంగా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, ఆధారాల కోసం ఫొటోలు తీసుకుంటున్నారు. పబ్లిక్‌ ప్లేస్‌లో జరిగే గొడవలు, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదు అయితే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తారు. దీంతో ఘటనాస్థలాల్ని వీడియోలో చిత్రీకరించి భద్రపరుస్తున్నారు. సహాయక చర్యలు, తదుపరి యాక్షన్స్‌ తీసుకోవడం పూర్తయిన వెంటనే సదరు ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్‌ ద్వారానే సంబంధిత స్టేషన్‌ హౌస్‌ఆఫీసర్‌కు పంపిస్తున్నారు.

'క్లోజ్‌'చేసే వరకు 'టైమ్‌ రన్నింగ్‌'...

గస్తీ బృందాలు ఘటనాస్థలికి చేరుకోవడం వంటి చర్యలు పూర్తయిన తర్వాత మొదట వచ్చిన నోటిఫికేషన్‌ మళ్లీ ఓపెన్‌ చేయాలి. అందులో ఉండే 'కాల్‌ క్లోజ్‌'బటన్‌ నొక్కడంతో ఈ వ్యవహారం పూర్తవుతుంది. అప్పటి వరకు సమయం లెక్కింపు జరుగుతూ ఉంటుంది. ఈ సమయాన్నే 'పోలీసు రెస్పాన్స్‌ టైమ్‌'గా పరిగణిస్తున్నారు. ఫోన్‌కాల్‌ వచ్చిన దగ్గర నుంచి జరిగే ప్రతిదీ 'డయల్‌–100'తో పాటు కమిషనరేట్‌ కంట్రోల్‌ రూమ్‌, జోనల్‌ కార్యాలయాలకు చేరుతూ పర్యవేక్షణకు దోహదం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రెస్పాన్స్‌ టైమ్‌ పట్టణాల్లో తక్కువగా, గ్రామాల్లో ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లోనూ తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

ఫైళ్ల మాయం, అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు

- పశుసంవర్ధకశాఖలో అక్రమాలపై ముమ్మర విచారణ
- ఏసీబీకి కేసుల బదిలీ

సాక్షి, హైదరాబాద్‌: పశుసంవర్ధకశాఖలో ఫైళ్ల మాయం, గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై అవినీతి నిరోధకశాఖ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ రెండు కేసులను ప్రభుత్వం ఏసీబీకి బదిలీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్‌ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఫైళ్లను మాయం చేసేందుకు ప్రయత్నించడంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులలో భారీ అవినీతికి ఆస్కారం ఉన్నందున లోతైన దర్యాప్తు బాధ్యతను ఏసీబీకి ప్రభుత్వం అప్పగించింది. గొర్రెల కొనుగోలు యూనిట్లకు నగదు చెల్లింపుల్లో.. అవినీతి, పశుసంవర్ధకశాఖ ఫైళ్లను మాయం చేసేందుకు జరిగిన కుట్రలో దాగిన మరిన్ని నిజాలను వెలుగులోకి తెచ్చేందుకు ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలిసింది. ఈ రెండు కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏసీబీ రంగంలోకి దింపినట్టు సమాచారం.

తిరుగు ప్రయాణాలతో హైవే రద్దీ

సంక్రాంతికి పల్లెలకు వెళ్లినవారు పట్నంబాట



గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్‌/బీబీనగర్‌: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లి న తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో హైదరాబాద్‌–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ ప్రారంభమైంది. హైదరాబాద్‌ మార్గంలో కార్లు, ఇతర సొంత వాహనాలు పెద్దసంఖ్యలో బారులుదీరాయి. ఈ రద్దీ సాయంత్రం తర్వాత పెరిగే అవకాశాలు ఉన్నా యని భావించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పెట్రోలింగ్‌ టీంలను అందుబాటులో ఉంచారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌ పట్టణంలోని ఆర్టీ సీ బస్‌స్టేషన్‌, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌర స్తా వద్ద ఉన్న జంక్షన్లను తాత్కాలికంగా మూసివేశారు. ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. దీంతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము కిలోమీటర్ల దూరం వెళ్లి యూటర్న్‌ తీసుకోవడం ఇబ్బందిగా ఉందని, ఇక్కడి నుంచే పంపించాలని పట్టుబట్టారు.దీంతో సుమారు అరగంటసేపు అయోమయపరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఇదే సమయంలో వాహనదారులు సర్వీస్‌ రోడ్లలోకి వెళ్లారు. దీంతో ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్లు వాహనాలతో రద్దీగా మారాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కొద్దిసేపు స్తంభించాయి. కాగా,యాదాద్రి జిల్లా బీబీనగర్‌ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా నుంచి పగిడిపల్లి వరకు వాహనాలు సాయంత్రం నుంచి రాత్రి 9గంటల దాకా బారులుదీరాయి.

రాజధానిలో ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణపై ఫోకస్‌

జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌పై సీనియర్‌ పోలీస్‌ అధికారులతో డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్‌: గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌(జీహెచ్‌ఎంసీ) పరిధిలోని ట్రాఫిక్‌ పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రవిగుప్తా సీనియర్‌ పోలీసు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, మెరుగుపరచడానికి సమర్థవంతమైన చర్యలపై పోలీస్‌ అధికారులు సూచనలు ఇవ్వాలని డీజీపీ కోరారు. విజిబుల్‌ పోలీసింగ్‌ అమలు, ట్రాఫిక్‌ సిబ్బందికి ఆధునిక శిక్షణ అందించడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో కొత్త స్కైవాక్‌లు, ఫ్లైఓవర్ల చుట్టూ ట్రాఫిక్‌ పరిస్థితులను వివరిస్తూ ట్రాఫిక్‌ పోలీసు అధికారులు పవర్‌పాయింట్‌ ప్రజెంటేషన్‌ను డీజీపీకి వివరించారు. మూసీనది ప్రాంతంలో వంతెనల పరిస్థితి, ప్రతిపాదిత ట్రాఫిక్‌ అవగాహన కార్యక్రమాలు, శిక్షణాకేంద్రం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంటెలిజెన్స్‌ చీఫ్‌ బి.శివధర్‌రెడ్డి, సైబరాబాద్‌ సీపీ అవినాశ్‌ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, హైదరాబాద్‌ అదనపు కమిషనర్‌ విక్రమ్‌సింగ్‌ మాన్‌, హైదరాబాద్‌ ట్రాఫిక్‌ అదనపు కమిషనర్‌ విశ్వప్రసాద్‌, ఐజీ తరుణ్‌ జోషి తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులాల్లో.. రేపటి నుంచి ఆన్‌లైన్‌ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎంఆర్‌ఈఐఎస్‌) పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ఆయేషా మసరత్‌ ఖానమ్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ పరిధిలోని 204 పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్‌ ఖాళీల భర్తీ, జూనియర్‌ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలు, 10 సీవోఈ (సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్సీ)ల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌ పద్ధతిలో ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్‌ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో లేదా టీఎంఆర్‌ఈఐఎస్‌ మొబైల్‌ యాప్‌ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు. యాప్‌ను గూగుల్‌ ప్లేస్టోర్‌ ద్వారా ఇన్‌స్టాల్‌ చేసుకోవాలి. మైనార్టీ విద్యార్థులతో పాటు నాన్‌ మైనార్టీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు సొసైటీ వెబ్‌సైట్‌లో లేదా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లేదా మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ కోసం సొసైటీ కార్యాలయంలో ప్రత్యేకంగా 040–23437909 హెల్ప్‌లైన్‌ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు.

నేటి నుంచి ఐఎస్‌ఎల్‌

- రాష్ట్రస్థాయి పోటీలకు ఉట్నూర్‌ ఆతిథ్యం
- మూడు రోజులపాటు క్రీడా సందడి
- అన్ని ఏర్పాట్లు పూర్తి

ఉట్నూర్‌రూరల్‌: ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్‌లో నేటి నుంచి ఐఎస్‌ఎల్‌ (ఇంటర్‌ సొసైటీ స్పోర్ట్స్‌ లీగ్‌) షురూ కానుంది. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయ్‌ పర్యవేక్షణలో క్రీడలు, ఐటీడీఏ ఇంజినీరింగ్‌ విభాగం అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఆయా క్రీడలకు సంబంధించిన మైదానాలు సిద్ధం చేయడం, క్రీడాకారులకు భోజనం, వసతి వంటి అంశాలపై దృష్టి సారించారు. ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్‌, అథ్లెటిక్స్‌, హాకీ, ఫుట్‌బాల్‌, ఆర్చరీ, చెస్‌, హ్యాండ్‌బాల్‌, బ్యాడ్మింటన్‌, టెన్నికాయిట్‌, బాక్సింగ్‌, క్యారమ్స్‌ తో పాటు తైక్వాండో డెమో గేమ్స్‌ నిర్వహించనున్నారు. ఏడు సొసైటీలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటుండగా ఇప్పటికే వారంతా కేబీ ప్రాంగణానికి చేరుకున్నారు. ఐటీడీఏ పీవో ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట శిక్షణ సహాయ కలెక్టర్‌ వికాస్‌ మహతో, డీడీ దిలీప్‌కుమార్‌, జిల్లా క్రీడల అధికారి పార్థసారథి, ఎంపీడీవో తిరుమల తదితరులున్నారు.



ఏర్పాట్లపై అధికారులకు పీవో సూచనలు



క్రీడల నిర్వహణకు సిద్ధమైన కేబీ ప్రాంగణం

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పడుతున్న మల్లయోధులు

కుభీర్‌: నిర్మల్‌ జిల్లా కుభీర్‌ మండలం దొడర్నరాం నాయక్‌ తండాలో శివశంకర్‌ జాతరలో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. నాందేడ్‌కు చెందిన రాజుపటేల్‌ రూ.7001, ద్వితీయ బహుమతిగా సాయినాథ్‌ రూ.5 వేలు గెలుచుకున్నారు. మహారాష్ట్రతోపాటు మండలంలోని పలు గ్రామాల మల్లయోధులు పాల్గొన్నారు. ఏటా సంక్రాంతికి శివశంకర్‌ జాతర నిర్వహిస్తున్నారు. జాతరలో జెడ్పీటీసీ అల్కతాయి, మాజీ జెడ్పీటీసీ చౌహాన్‌ శంకర్‌, దొడర్న సర్పంచ్‌ లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక దర్శకులు, రచయితలకు ఉచిత శిక్షణ

ఆసిఫాబాద్‌అర్బన్‌: చలనచిత్ర, టీవీ రంగాల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని ఔత్సాహిక దర్శక, రచయితలకు తెలుగు టెలివిజన్‌ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన ప్రముఖ దర్శక, నిర్మాత, రచయిత సురేశ్‌ బాబు తెలిపారు. ప్రముఖ సినీ దర్శకులు, తెలుగు దర్శకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆదిత్య, దర్శకులు ప్రేమ్‌రాజ్‌, ప్రవీణ్‌ చందర్‌, శత చిత్ర రచయిత సాయినాథ్‌లతోపాటు పలువురు రచయితలు, టీవి రంగాలకు చెందిన ప్రముఖులు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు మంచిర్యాల జిల్లా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మెర విశ్వేశ్వరశర్మ (73969 19938), నాగరాజు (94400 01886), ఆసిఫాబాద్‌ జిల్లా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు (98666 45822), రామారావ్‌ (88978 29240) నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి పోటీలు



రంగారెడ్డి జట్టుకు కప్పు అందిస్తున్న అసోసియేషన్‌ సభ్యులు



మూడో స్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా బాలికల జట్టు

- అండర్‌– 19 హ్యాండ్‌బాల్‌ టోర్నమెంట్‌ విజేతగా రంగారెడ్డి
- మూడో స్థానంలో నిలిచిన ఉమ్మడి ఆదిలాబాద్‌ జట్టు

ఆసిఫాబాద్‌రూరల్‌: ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి అండర్‌– 19 బాలికల హ్యాండ్‌బాల్‌ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల జట్లు పాల్గొన్నాయి. మంగళవారం రంగారెడ్డి, వరంగల్‌ జట్ల మధ్య ఫైనల్‌ మ్యాచ్‌ జరగగా.. రంగారెడ్డి జట్టు విజేతగా నిలిచింది. రెండోస్థానంలో వరంగల్‌ నిలవగా, ఉమ్మడి ఆదిలాబాద్‌ జట్టు మూడోస్థానం దక్కించుకుంది. హ్యాండ్‌ బాల్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్‌, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్‌ కృష్ణారావు బహుమతులు ప్రదానం చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. గెలుపే లక్ష్యంగా పోటీల్లో పోరాడాలని సూచించారు. ఈ నెల 27 నుంచి 31 వరకు బిహార్‌లో జాతీయస్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌, టోర్నమెంట్‌ ఆర్గనైజర్‌ రాకేశ్‌, పీడీలు, పీఈటీలు విష్ణుకాంత్‌, ఆరవింద్‌, సుధీర్‌, తిరుమల్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో నిర్మల్‌ జానపద బృందం ప్రదర్శన



నాసిక్‌లో జరిగిన జాతీయస్థాయి జానపద ప్రదర్శనలో పాల్గొన్న బృందం

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్‌ జిల్లాకు చెందిన పాటే మా ప్రాణం సంగీత అకాడమీ బృందం 27వ జాతీయ యువ దినోత్సవంలో భాగంగా నాసిక్‌ పట్టణంలోని మహాకాళిదాసు ఆడిటోరియంలో సోమవారం జానపద బృందగాన ప్రదర్శన ఇచ్చారు. ఇటీవల రాష్ట్రస్థాయికి ఈ బృందం ఎంపికై ప్రథమ స్థానంలో నిలిచి, జాతీయస్థాయికి ఎంపికైంది. మహారాష్ట్రలోని నాసిక్‌లో జాతీయస్థాయిలోనూ ఈ బృందం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చింది. జాతీయస్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు బృందం సభ్యులు తెలిపారు. ఈ బృందంలో చెనిగారపు నాగరాజు, వానర శ్రీకాంత్‌, సల్మాన్‌, పెంటన్న, మాధురి రాజు, సాయిరాం, రంజిత్‌, సురేశ్‌, రాజశేఖర్‌, మిట్టు దత్తు, వినోద్‌, మంజుల, సుప్రియ పాల్గొన్నారు.



కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

పండుగపూట.. ఆలయాలు కిటకిట

వేములవాడ/కొండగట్టు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమ, మంగళవారాల్లో వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. రాజన్నను దాదాపు లక్ష మంది భక్తులు దర్శించుకున్నారు. ఒక్కో భక్తుడి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. అలాగే కొండగట్టు అంజన్నను మంగళవారం సుమారు పదివేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఆలయ అధికారులు, పోలీసులు, సిబ్బంది భక్తులకు అందుబాటులో ఉన్నారు.



రాజన్న ఆలయంలో భక్తులు



అంజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



కొండగట్టు ఆలయంలో భక్తులు

గోవుల పెంపకంతో ఇంటింటా ఆధ్యాత్మికత

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌



గోశాలలో ఆవులకు పండ్లు తినిపిస్తున్న విప్‌ లక్ష్మణ్‌కుమార్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్‌: గోవుల పెంపకంతో ఇంటింటా ఆధ్యాత్మికత బాటలు సాధ్యమవుతాయని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్‌ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్‌ మండలం తాటిపల్లి గ్రామ శివారులోని సురభి గోశాలలో ఎమ్మెల్సీ దంపతులు, అడ్లూరి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గోమాతకు పూజలు చేస్తే సకల దేవతల ఆశీస్సులు అందుతాయన్నారు. సురభి గోశాల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని, గోశాల అభివృద్ధికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటా గోవు పెంచుకునేలా ప్రభుత్వపరంగా సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌, గంగాధర్‌ తదితరులు ఉన్నారు.

గోవులను పూజించాలి

రాయికల్‌(జగిత్యాల): ప్రతి ఒక్కరూ గోవులను పూజించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కనుమ పండగ సందర్భంగా రాయికల్‌ పట్టణంలోని కొయ్యడి మహిపాల్‌రెడ్డి గోశాలను ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులతో సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు గోపి రాజిరెడ్డి, దివాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఎద్దండి భూంరెడ్డి, మున్నా, షాకీర్‌, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానసాదేవి సేవలో నవీన్‌ మిట్టల్‌

గన్నేరువరం(మానకొండూర్‌): మండలంలోని ఖాసీంపేట శ్రీ మానసాదేవిని సోమవారం ప్రభుత్వ భూ పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్‌ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నర్సింహారెడ్డి, చైర్మన్‌ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకుడు మామిడాల నాగసాయిశర్మ స్వాగతం పలికారు. వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదం అందజేశారు. అనంతరం వారిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్‌, తహసీల్దార్‌ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



నవీన్‌ మిట్టల్‌ స్వాగతం పలుకున్న కమిటీ సభ్యులు

జీవితంలో దిద్దుబాటు చాలా అవసరం.
అక్షరాలను దిద్దుకుంటాం. నడవడిక దిద్దుకుంటాం.
మాటను దిద్దుకుంటాం... చేతను దిద్దుకుంటాం.
ఇన్నింటిని దిద్దుకోవడం వచ్చిన వాళ్లం...
చెదిరిన రూపురేఖల్ని దిద్దుకోలేమా?
కాంతి రేఖల కొత్త పొద్దుల్ని చూడలేమా?
సూర్యుడు కర్కాటకం నుంచి మకరానికి మారినట్లే...

దిద్దుబాటు

చెదిరిన రూపురేఖలకు కాంతిరేఖలు



ఆళ్ల దాక్షాయణి

క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలేట్‌తో పుట్టిన పిల్లలు కూడా మామూలు పిల్లల్లా బతికి బట్టకట్టాలి కదా! అగ్ని ప్రమాదానికి గురైన వాళ్లు ముడతలు పడిన చర్మంతో బతుకు సాగించాల్సిన దుస్థితి ఎందుకు? ప్రమాదవశాత్తూ ఎముకలు విరిగి ముఖం రూపురేఖలు మారిపోతే... ఇక జీవితమంతా అద్దంలో ముఖం చూసుకోవడానికి భయపడాల్సిందేనా? వీటన్నింటికీ వైద్యరంగం పరిష్కరిస్తుంది. అయితే ఆ వైద్యం సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటుంది. ఖర్చుపరంగా ఆకాశమంత ఎత్తులో ఉన్న వైద్యప్రక్రియను అవనికి దించాలంటే పెద్ద మనసు ఉండాలి. అలాంటి సమష్టి కృషిని సమన్వయం చేస్తున్నారు ఆళ్ల దాక్షాయణి. బాధితుల జీవితాల్లో కాంతిరేఖలను ప్రసరింపచేయడానికి ఏటా జనవరి నెలలో ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె సాక్షితో పంచుకున్న వివరాలివి.

''ఒకప్పుడు గ్రహణం మొర్రి కేసుల గురించి తరచూ వినేవాళ్లం. కాలక్రమేణా సమాజంలో చైతన్యం పెరిగింది. గర్భస్థ దశలోనే గుర్తించి, పుట్టిన వెంటనే సర్జరీలు చేసి సరి చేసుకునే విధంగా వైద్యరంగం కూడా అభివృద్ధి చెందింది. అయినప్పటికీ మారుమూల గ్రామాల్లో గ్రహణం మొర్రి బాధితులున్నారు. వాళ్లు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకునే స్థోమత లేని తల్లిదండ్రులు పిల్లల వైకల్యాన్ని సరిచేయలేకపోతున్నారు. ఒక బిడ్డ ఆర్థిక కారణాలతో వైకల్యాన్ని భరించాల్సిన దుస్థితి రావడం దారుణమైన విషయం. అలాగే ఇటీవల అగ్ని ప్రమాద బాధితులు, యాసిడ్ దాడి బాధితులు కూడా పెరుగుతున్నారు. వీటికితోడు వాహన ప్రమాదాల కారణంగా వైకల్యాలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్యల నుంచి ఆర్థిక వెనులుబాటు ఉన్న వాళ్లు బయటపడగలుగుతున్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని వాళ్లు బాధితులుగా మిగిలిపోతున్నారు. అలాంటి వాళ్ల కోసం ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్ బాధ్యత చేపట్టాం. నిజానికి ఈ సర్వీస్ మొదలై ఇరవై ఏళ్లు దాటింది.

ముఖం మీద ఒత్తైన జుత్తు

హయతి అనే ఎనిమిదేళ్ల పాపాయి సమస్య మరీ ప్రత్యేకం. హైపర్ ట్రికోసిస్... అంటే జుత్తు తల వరకే పరిమితం కాకుండా ముఖం మీదకు పాకుతుంది. తలమీద ఉన్నంత దట్టమైన జుత్తు ఒక చెంప మొత్తం ఉంది. ఆ పాపకు నలుగురిలోకి వెళ్లాలంటే బిడియం. స్కూలుకెళ్లాలంటే భయం. ఆమె సమస్య అంటువ్యాధి కాదని టీచర్లకు తెలిసినప్పటికీ క్లాసులో మిగిలిన పిల్లలతో కలిపి కూర్చోబెడితే వాళ్ల పేరెంట్స్ నుంచి కంప్లయింట్స్ వస్తాయి కాబట్టి హయతిని విడిగా కూర్చోబెట్టేవారు. తరగతి గది, ఇంటి నాలుగ్గోడలు తప్ప మరే ప్రపంచమూ తెలియని స్థితిలో రోజులు గడుపుతున్న హయతి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా మామూలైంది.

ఇద్దరు వైద్యుల చొరవ

రెండు వేల సంవత్సరంలో మొదలైన ఈ కార్యక్రమం కోవిడ్ రెండేళ్లు మినహా ఏటా జరుగుతోంది. డాక్టర్ భవానీ ప్రసాద్ అనస్థీషియనిస్ట్, డాక్టర్ సుదర్శన్ రెడ్డి ప్లాస్టిక్ సర్జన్. వీళ్ల ఆలోచనతోనే ఈ సర్వీస్ మొదలైంది. మొదటి ఏడాది హైదరాబాద్‌లోని మహావీర్, మెడ్విన్ హాస్పిటళ్లలో సర్జరీలు నిర్వహించారు. ఆ తర్వాత కిమ్స్, కామినేని హాస్పిటళ్లు సపోర్టు చేశాయి. నార్కెట్ పల్లి, నిజామాబాద్, శ్రీకాకుళంలో క్యాంపులు నిర్వహించారు. గత ఏడాది హైదరాబాద్, సీతారామ్ బాగ్‌లో డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్‌ను వేదిక చేసుకున్నాం. ఇందు కోసం హాస్పిటల్ వాళ్లు రెండు ఆపరేషన్ థియేటర్‌లతో హాస్పిటల్‌ను సిద్ధం చేశారు. యూఎస్‌లో స్థిరపడిన ఈ డాక్టర్లు ఏటా 45 రోజులు ఇండియాలో ఉండేటట్లు ప్లాన్ చేసుకున్నారు. అందులో కొంత సమయం ఈ సర్వీస్‌కి కేటాయిస్తున్నారు. యూఎస్‌లోని మెర్సీ మిషన్ వేదికగా వారందిస్తున్న సర్వీస్‌కి హైదరాబాద్‌లో 'లయన్స్ క్లబ్ – గ్రీన్‌ల్యాండ్స్' సహకారం అందిస్తోంది. రెండేళ్లుగా మా రాంకీ ఫౌండేషన్ కూడా బాధ్యతలు తీసుకుంది. ఇందుకోసం ఫౌండేషన్ ట్రస్టీగా నేను బోర్డు మెంబర్స్ నుంచి అనుమతి తీసుకుని ఈ కార్యక్రమాలను చేపట్టాను. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన వాళ్లలో రాయలసీమ జిల్లాలు, నల్గొండ జిల్లా వాళ్లు ఎక్కువగా ఉన్నారు. మా ఈ సర్వీస్‌కి ప్రాంత, భాష, ఆర్థికపరమైన ఆంక్షలు ఏమీ లేవు. పేరు నమోదు చేసుకుని వచ్చి వైద్యం చేయించుకోవడమే.

ఇది సమష్టి దిద్దుబాటు

ఈ సర్వీస్ కోసం ఇద్దరు డాక్టర్లు అమెరికా నుంచి వస్తారు. మరికొంతమంది డాక్టర్లు, ఇతర వైద్యసిబ్బంది మొత్తం ముప్పైమంది స్థానికులు ఈ సర్వీస్‌లో పాల్గొంటారు. ఈ హెల్త్ సర్వీస్‌ను రెండు దశాబ్దాలుగా విజయవంతంగా నిర్వహించడంలో పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి, లయన్స్ క్లబ్ విద్యాభూషణ్ సేవలు విశేషమైనవి. క్లెఫ్ట్ లిప్, క్లెఫ్ట్ పాలెట్, కాలి ముడుచుకుపోయిన చర్మం, జన్యుపరమైన వైకల్యాలను సరిచేయడం, ప్రమాదవశాత్తూ దవడ, ముక్కు, కాళ్లు, చేతులు విరిగిపోవడం వంటి సమస్యల్లో ప్లాస్టిక్ సర్జరీ ద్వారా సరిదిద్దగలిగిన అన్ని సమస్యలకూ వైద్యం అందిస్తున్నాం. కాస్మటిక్ సర్జరీలు ఈ క్యాంప్‌లో చేపట్టడం లేదు. మా సర్వీస్ గురించి వాల్‌పోస్టర్‌లు, బ్యానర్‌లతో జిల్లాల్లో ప్రచారం కల్పించాం. వీలైనంత ఎక్కువమంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనేది నా ఆకాంక్ష'' అన్నారు దాక్షాయణి.

– వాకా మంజులారెడ్డి



ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్

మెర్సీ మిషన్స్ యూఎస్‌ఏ, సేవా భారతి, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్– గ్రీన్ ల్యాండ్స్, రాంకీ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఫ్రీ మెగా ప్లాస్టిక్ సర్జరీ క్యాంప్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి స్క్రీనింగ్ జరుగుతుంది. సర్జరీలు 22వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు జరుగుతాయి. ఉచితవైద్యంతోపాటు మందులు, ఆహారం, బస సౌకర్యాలను కూడా కల్పిస్తున్నాం. పేషెంట్ పరిస్థితిని బట్టి కొందరికి సర్జరీ తర్వాత ఫాలోఅప్ కోసం మూడు నుంచి నాలుగు రోజులు బస చేయాల్సి రావచ్చు. గడిచిన డిసెంబర్ 20 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. వైద్యసహాయం అవసరమైన వాళ్లు 78160 79234, 98482 41640 నంబర్లకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలి. హైదరాబాద్, ఓల్డ్ మల్లేపల్లి, సీతారామ్‌బాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్ చందర్ చారిటబుల్ హాస్పిటల్‌లో వైద్యసహాయం అందిస్తున్నాం.

– ఆళ్ల దాక్షాయణి, మేనేజింగ్ ట్రస్టీ, రామ్‌కీ ఫౌండేషన్

ఆర్థిక నిర్ణయాల్లో ముందంజ

* నేటి మహిళ



మహిళలు షాపింగ్ చేయడంలో ముందుంటారు. కానీ, కుటుంబ శ్రేయస్సు కోసం ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో మాత్రం వెనకుంటారు.. అనేది నాటి మాట. నేడు ఈ మాటను తిరుగ రాస్తోంది మెట్రో మహిళ. ఈ విషయాన్ని డిబిఎస్‌బ్యాంక్, ఇండియన్ క్రిసిల్ చేసిన సర్వేలో స్పష్టమైంది.

మెట్రో నగరాలలో జీవిస్తున్న భారతీయ మహిళలు స్వతంత్రంగా ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలియజేసిన డీబీఎస్–ఇండియా క్రిసిల్ సర్వేలో దేశంలోని పది నగరాల్లో 800 మంది మహిళలు పాల్గొన్నారు. మహిళలు–ఆర్థిక ప్రగతి పేరుతో చేసిన ఈ అధ్యయనంలో స్వయం ఉపాధి పొందుతున్న మహిళల ప్రాధాన్యతను ఈ సర్వే ప్రత్యేకంగా పేర్కొంది.

పొదుపు ఖాతాలు

పట్టణ ప్రాంతాల్లోని స్త్రీలలో ఎక్కువమంది సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు ఖాతాల వంటి సంప్రదాయక ఎంపికల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. కుటుంబంలో దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో భారతదేశంలోని 98 శాతం మంది ఉపాధి, స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు గణనీయమైన మార్పును కోరుకుంటున్నారు. వయస్సు, ఆదాయం, వైవాహిక స్థితి, ఆధారపడిన వారు, ఇంటి స్థానం వంటి అంశాలు మహిళల ఆర్థిక ప్రవర్తనపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఫైనాన్స్‌పై మహిళల అవగాహన

పట్టణాల్లో పనిప్రదేశాల్లో మహిళల సంఖ్య పెరగడం, వారి ఆర్థిక ప్రాధాన్యతలు వయసుతోపాటు ఎలా మారుతున్నాయో హైలైట్ చేస్తుంది ఈ నివేదిక. వైవాహిక స్థితి, వృత్తిపరమైన నిర్ణయాలు, వ్యక్తిగత ఆరోగ్యం, జీవితంలో ఊహించని సంఘటనలు వంటి అంశాలు వివిధ దశల్లో మహిళల ఆర్థిక ప్రాధాన్యతలను ప్రభావితం చేస్తున్నాయి. ఉదాహరణకు.. 25 నుంచి 35 సంవత్సరాల వయసు గల మహిళలు ఇంటిని కొనుగోలు చేయడం లేదా అప్‌గ్రేడ్ చేయడం, 35 –45 సంవత్సరాల మధ్య ఉన్న వారు పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం, 45 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు వైద్య సంరక్షణకు మారడం వంటి వాటికి ఎలా ప్రాధాన్యత నిస్తున్నారో నివేదిక హైలైట్ చేస్తుంది.

వయసు ప్రాధాన్యంగా..

మహిళల నిర్ణయాలు, వారి వయసు ఆర్థిక స్థితిని గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి. 45 ఏళ్ల అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న మహిళల్లో 65 శాతం మంది స్వయం ప్రతిపత్తి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటూ కుటుంబ నాయకత్వంలో ఎదిగారు. దాదాపు 47 శాతం మంది మహిళలు స్వావలంబనతో కూడిన ఆర్థిక నిర్ణయాలను తీసుకుంటున్నారు. ఇది మహిళల్లో పెరుగుతున్న ఆర్థిక స్వాతంత్ర్యాన్ని నొక్కి చెబుతోందని ఫలితాలు సూచించాయి. ఆర్థిక నిర్ణయాలపైన లీడర్‌షిప్, విభిన్న పెట్టుబడి, లోన్లు, పెరుగుతున్న డిజిటల్ ఛానెల్స్ స్వీకరణ ఇవన్నీ ఆధునిక భారతీయ మహిళ కేవలం భాగస్వామిగా మాత్రమే కాదు, జీవన ప్రయాణాన్ని ప్లాన్ చేస్తోంది.

ఎలా పొదుపు చేస్తున్నారంటే..

మహిళల ఆర్థిక మార్గాలు వారి వ్యక్తిత్వంలానే భిన్నంగా ఉంటున్నాయి. పొదుపు చేయడం, రుణం తీసుకోవడం, పెట్టుబడి విధానం, వయసు, ఆదాయం, సాంస్కృతిక నేపథ్యం, వనరులను పొందడం వంటి అనేక అంశాలు పొదుపు మీదనే ఆధారపడి ఉంటాయి. ఒక సర్వే ప్రకారం.. మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో సంపాదించే మహిళలు తక్కువ రిస్క్ పెట్టుబడులకు ప్రాధాన్యతనిస్తున్నారు. వారి నిధులలో 51 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్ ఖాతాలకు కేటాయిస్తున్నారు. బంగారంలో 16 శాతం, మ్యూచువల్ ఫండ్స్‌లో 15 శాతం, రియల్ ఎస్టేట్‌లో 10 శాతం, స్టాక్‌లలో కేవలం ఏడు శాతం ఉన్నాయి.

ఆధారపడిన వారు..

జీవిత భాగస్వామిపై ఆధారపడిన మహిళల పెట్టుబడి ప్రవర్తన కూడా గణనీయంగా మారుతుంది. దాదాపు 43 శాతం మంది వివాహితలు 10 నుంచి 29 శాతం పెట్టుబడులకు కేటాయిస్తున్నారు. ఆదాయాన్ని పొందే మహిళలు తమ ఆదాయంలో సగానికి పైగా పెట్టుబడులుగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు.

క్రెడిట్ కార్డ్ వినియోగం...

మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో ముఖ్యంగా హైదరాబాద్, ముంబై నగరాలలో మహిళలు క్రెడిట్ కార్డ్ వినియోగంలో ముందంజలో ఉన్నారు. సగం మంది మహిళలు తాము ఎప్పుడూ రుణం తీసుకోలేదని తెలియజేశారు. రుణం తీసుకున్న వారిలో గణనీయంగా గృహరుణం తీసుకోవడాన్ని ఎంచుకున్నారు.

నగదును మించి యుపిఐ

షాపింగ్ చేయడంలో నగదు బదిలీ కన్నా యుపిఐ మార్గాలన్నే ఎక్కువ ఎంచుకుంటున్నారు. 25 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులలో సుమారు 33 శాతం మంది ఆన్‌లైన్ షాపింగ్ కోసం యూపీఐని ఉపయోగిస్తున్నారు. మనీ ట్రాన్స్‌ఫర్ 38 శాతం, బిల్లుల్లు 34 శాతం, ఇ–కామర్స్ కొనుగోళ్లు 29 శాతం సహా వివిధ చెల్లింపు అవసరాల కోసం యూపీఐ పట్టణ మహిళలకు ఇష్టమైన ఎంపిక అయ్యింది. ఢిల్లీలో కేవలం రెండు శాతం మంది మహిళలు మాత్రమే నగదు చెల్లింపులను ఎంచుకున్నారు. కోల్‌కతాలో 43 శాతం మహిళలు ఈ ఎంపికను ఎంచుకున్నారు.. అని మహిళల ఆర్థిక నిర్ణయాల నివేదికను మన ముందుంచింది డీబీఎస్–క్రిసిల్ సర్వే.

యూత్ పల్స్

బంగారంలాంటి కళ

'వ్యర్థాల గురించి మాట్లాడుకోవడం పరమ వ్యర్థం' అనుకోవడం లేదు యువతరం. ఎలక్ట్రానిక్స్ నుంచి ప్లాస్టిక్ వ్యర్థాల వరకు రకరకాల వ్యర్థాలను కళాకృతులుగా రూపొందించి పర్యావరణ సందేశాన్ని అందించడం ఒక కోణం అయితే, ఎలక్ట్రానిక్ వ్యర్థాలలోని విలువైన వాటితో నగలు రూపొందించే ఎమర్జింగ్ ఆర్ట్ ట్రెండ్ లోతుపాతులు తెలుసుకోవడం మరో కోణం...



కోల్‌కతాలోని శ్రీశ్రీ అకాడమీ విద్యార్థులు తమ పాఠశాల అవరణలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో అద్భుతాన్ని సృష్టించారు. 'ట్రాష్ ఇన్‌స్టాలేషన్' ప్రాజెక్ట్‌లో భాగంగా స్టూడెంట్స్ యుతిక, ఇషాని, రజనీష్, మంజరీ, అదిత్రిలు ప్లాస్టిక్‌తో తయారుచేసిన డాల్ఫిన్ స్టాచ్యూను పాఠశాల ఆవరణలోని వర్టికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేశారు. నెలరోజుల వ్యవధిలో తయారు చేసిన 'డాల్ఫిన్ ఇన్ పెరిల్' అనే ఈ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్ పాఠశాలకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. 'ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, సముద్ర జీవులకు తీవ్ర హాని కలుగుతుందనే విషయాన్ని ప్రచారం చేయడానికి కళను ఒక మాధ్యమంలా ఉపయోగించుకోవాలనుకుంటున్నాం. భవిష్యత్‌లో ఇలాంటివి మరిన్ని తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అంటుంది అదిత్రి.

కేరళలోని తిరువనంతపురంలో 'కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్'కు చెందిన యంగ్ టీమ్ 20,000 ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఉపయోగించి 90 అడుగుల పాము ఇన్‌స్టాలేషన్‌ను రూపొందించింది. ప్లాస్టిక్ అనే విషసర్పం భూగోళాన్ని కాటు వేస్తున్నట్లుగా కనిపించే ఈ ఇన్‌స్టాలేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటిని దృష్టిలో పెట్టుకొని 'ఫ్యాషన్ ఆఫ్ ది న్యూ ఎరా 100 శాతం ట్రాష్ అండ్ ప్లాస్టిక్!' అంటూ ఒక యువ ఆర్టిస్ట్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు.



ఇ–వ్యర్థాల నుంచి హరిబాబు రూపొందించిన కళాకృతి

ముంబైలో ఉంటున్న హరిబాబు ఇ–వేస్ట్ కళలో ఎంతోమంది యూత్‌కు ఇన్‌స్పైరింగ్‌గా నిలుస్తున్నాడు. ఇ–వేస్ట్ కళా రూపాలతో ప్రముఖ ఆర్ట్ గ్యాలరీలలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాడు. కేరళలో పుట్టిన హరిబాబు చెన్నైలో పెరిగాడు. చెన్నై గవర్నమెంట్ 'కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్'లో చదువుకున్నాడు. ఇ–వ్యర్థాలతో కళాకృతుల తయారీకి ప్రశంసల మాట ఎలా ఉన్నా బ్యాంకు బ్యాలెన్స్ మాత్రం ఎప్పటికప్పుడూ ఖాళీ అవుతుండేది. 'నీకేమైనా పిచ్చి పట్టిందా?' అని తిట్టేవారు మిత్రులు.

అయితే బజాజ్ ఆర్ట్ గ్యాలరీ ఫెలోషిప్ అవార్డ్ అందుకున్న తరువాత హరిబాబుకు బ్రేక్ వచ్చింది. ఏడాది తరువాత 'స్టేట్–ఆఫ్–ది–ఆర్ట్ స్టూడియో' ముంబైలో ప్రారంభించాడు. టన్నుల కొద్దీ ఇ–వ్యర్థాల నుంచి ఎన్నో శిల్పాలు రూపొందించిన హరిబాబు దగ్గరికి సలహాలు, సూచనల కోసం ఎంతోమంది యంగ్ ఆర్టిస్ట్‌లు వస్తుంటారు.

భువనేశ్వర్‌కు చెందిన మ్యూరల్ ఆర్టిస్ట్ దిబూస్ జెనా, ఆర్టిస్ట్ సిబానీ బిస్వాల్ ఆర్గానిక్ స్క్రాప్, రీయూజ్‌డ్ మెటల్‌లతో ఆర్ట్ ఇన్‌స్టాలేషన్‌లను సృష్టించారు. మానవ తప్పిదాల వల్ల సముద్రానికి జరుగుతున్న హాని గురించి తెలియజేసేలా ఉంటుంది జెనా రూపొందించిన తిమింగలం.

'ఒషాబా బ్రాండ్ గురించి తెలుసుకున్న తరువాత ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ఆసక్తి పెరిగింది. వృథా అనుకునే వాటి నుంచి ప్రయోజనం సృష్టించాలి అనే వారి ఫిలాసఫీ నాకు నచ్చింది' అంటుంది భోపాల్‌కు చెందిన ఇరవై రెండు సంవత్సరాల రీతిక. కళ తప్పి మూలన పడ్డ ఎలక్ట్రానిక్ వ్యర్థాలకు కొత్త జీవితాన్ని ఇవ్వడానికి గత సంవత్సరం లండన్ కేంద్రంగా ఒషాబా బ్రాండ్‌కు అంకురార్పణ జరిగింది. వాడి పారేసిన స్మార్ట్‌ఫోన్ సర్క్యూట్ బోర్డులు, ప్లగ్, యూఎస్‌బీ కేబుల్స్, చార్జింగ్ కేబుల్స్..మొదలైన వాటిలోని విలువైన వాటిని ఈ బ్రాండ్ ఆభరణాల తయారీలో ఉపయోగిస్తారు.

నిజానికి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఆభరణాల తయారీలో ఉపయోగించడం ఇదే తొలిసారి కాదు. 2018లో అమెరికన్ టెక్నాలజీ కంపెనీ 'డెల్' కాలం చెల్లిన తమ కంప్యూటర్ విడి భాగాల నుంచి సేకరించిన విలువైన వాటితో నగలు రూపొందించడానికి లైఫ్‌స్టైల్ బ్రాండ్ 'బాయూ విత్ లవ్'తో కలిసి భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకుంది. విలువైన పదార్థాల వృథాను నివారించడానికి, ఎలక్ట్రానిక్ వ్యర్థాల గురించి వినియోగదారులలో అవగాహన కలిగించే సృజనాత్మక విధానాన్ని 'డెల్' ఎంచుకుంది.

'జువెలరీ బ్రాండ్స్ రీ–సైకిల్డ్ ఆల్టర్‌నేటివ్స్‌పై ఆసక్తి చూపుతున్నాయి. వాడి పడేసిన స్మార్ట్ ఫోన్లు, లాప్‌టాప్‌లు... మొదలైన వాటిలో గోల్డ్ మైన్ ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మూలకు పడి ఉన్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలలో దాగి ఉన్న విలువైన లోహాలు, ఒక టన్ను ఇ–వేస్ట్ నుంచి ఎన్ని గ్రాముల బంగారం వస్తుంది... లాంటి వివరాలు నాకు ఆసక్తికరంగా మారాయి' అంటుంది ముంబైకి చెందిన నవీన. 23 సంవత్సరాల నవీనకు పాత, కొత్త అనే తేడా లేకుండా నగల డిజైనింగ్ ఐడియాలపై ఆసక్తి. ఈ ఆసక్తి ఆమెను ఎలైజా వాల్టర్ లాగే నలుగురు మెచ్చిన డిజైనర్‌గా మార్చవచ్చు.



ఇ–వ్యర్థాల నుంచి రూపొందించిన ఈ ఆభరణాన్ని ఎలైజా వాల్టర్ డిజైన్ చేసింది.

నగ దరహాసం

ఎలక్ట్రానిక్ వ్యర్థాల నుంచి నగలు తయారు చేసే బ్రాండ్‌గా బ్రిటన్‌లో మంచి పేరు సంపాదించింది లైలీ జువెలరి. ఎలైజా వాల్టర్ 24వ యేట ఈ బ్రాండ్‌ను ప్రారంభించింది. యువతలో ఎంతోమంది లాగే ఇ–వ్యర్థాలలోని అపురూప అంశాలపై ఆసక్తి పెంచుకుంది. 'ప్రపంచంలోని బంగారంలో ఏడు శాతం నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్స్‌లో దాగి ఉన్నందున ఆభరణ బ్రాండ్‌లు వాటిని ముఖ్యమైన వనరుగా చూస్తున్నాయి' అంటున్న ఎలైజా వాల్టర్ ప్రయాణం యువతలో ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది.

హెయిర్ టిప్స్

జుట్టుకు బలం ఈ చూర్ణం



అరకప్పు డ్రైఫ్రూట్స్ (బాదం, పల్లీలు, పొద్దుతిరుగుడు గింజలు, వాల్‌నట్స్), అరకప్పు ఓట్స్, పచ్చిశనగపప్పు, పెసరపప్పులు కలిపి అరకప్పు, సబ్జా గింజలు అరకప్పు, అవిసె గింజలు అరకప్పు చొప్పున తీసుకుని దోరగా వేయించి చూర్ణం చేసుకుని డబ్బాలో నిల్వ చేయాలి.

ఈ పొడిని టేబుల్ స్పూన్ తీసుకుని టీ లేదా స్మూతీలో వేసుకుని తాగాలి. టీ అలవాటు లేని వాళ్లు వేడినీళ్లలో కలుపుకొని రోజూ ఉదయాన్నే తాగితే రాలడం తగ్గి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది. ఈ పొడి జుట్టు సంరక్షణకే గాక ఆరోగ్యాన్నీ మెరుగు పరుస్తుంది.



లక్ష్య షెరోన్‌కు కాంస్య పతకం

ఆసియా ఒలింపిక్ షాట్‌గన్ షూటింగ్ టోర్నీలో భారత షూటర్ లక్ష్య షెరోన్ కాంస్య పతకం సాధించాడు. కువైట్ సిటీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల ట్రాప్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో లక్ష్య మూడో స్థానంలో నిలిచి పారిస్ ఒలింపిక్స్ బెర్త్ సంపాదించలేకపోయాడు. ఆరుగురు షూటర్లు ఎలిమినేషన్ పద్ధతిలో పోటీపడ్డ ఫైనల్లో 25 ఏళ్ల లక్ష్య 33 పాయింట్లు స్కోరు చేశాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల కుర్రాడు మొహమ్మద్ బెరాన్‌వండ్ స్వర్ణం, 32 ఏళ్ల చైనా షూటర్ గువో యుహావో రజతం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

'ఫిఫా' అత్యుత్తమ ప్లేయర్‌గా మెస్సీ...

అర్జెంటీనా సూపర్‌స్టార్ మెస్సీ 2023 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో 'ఫిఫా బెస్ట్ ప్లేయర్‌'గా నిలిచాడు. మెస్సీకి నార్వే ఫార్వర్డ్ ఎర్లింగ్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఇద్దరు 48 పాయింట్లతో సమఉజ్జీగా నిలిచినప్పటికీ కెప్టెన్ల ప్యానెల్ నుంచి ఎర్లింగ్ కంటే మెస్సీకే ఎక్కువ ఓట్లు రావడంతో 'ఫిఫా' మెస్సీనే ఎంపిక చేసింది. లీగ్‌లతో బిజీగా ఉండటంతో మెస్సీ ఈ వేడుకకు హాజరుకాలేదు.





సెమీస్‌లో భారత్

రాంచీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలను భారత మహిళల హాకీ జట్టు సజీవంగా నిలబెట్టుకుంది. ఇక్కడ జరుగుతున్న ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గ్రూప్ 'బి'లో భాగంగా ఇటలీ జట్టుతో జరిగిన చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 5–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ఉదిత రెండు గోల్స్ (1వ, 55వ ని.లో) చేయగా... దీపిక (41వ ని.లో), సలీమా టెటె (45వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (53వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. ఇటలీ జట్టుకు కామిలా మాచిన్ (ప్లస్ 60వ ని.లో) ఏకైక గోల్‌ను అందించింది. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో అమెరికా 1–0తో న్యూజిలాండ్‌ను ఓడించింది. దాంతో గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన అమెరికా 9 పాయింట్లతో టాపర్‌గా నిలువగా... రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన భారత్ 6 పాయింట్లతో రెండో స్థానం సంపాదించి సెమీఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో జపాన్‌తో అమెరికా; జర్మనీతో భారత్ తలపడతాయి. ఈ టోర్నీలో టాప్–3లో నిలిచిన జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి.

పట్నా పైరేట్స్‌కు షాక్

జైపూర్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్‌కు ఏడో పరాజయం ఎదురైంది. తమిళ్ తలైవాస్ 41–25తో పట్నా పైరేట్స్‌కు షాక్ ఇచ్చింది. తలైవాస్ తరఫున అజింక్య పవార్ 10 పాయింట్లు, అభిషేక్ 7 పాయింట్లు, నరేందర్ 6 పాయింట్లు స్కోరు చేశారు. పట్నా తరఫున సుధాకర్ 8 పాయింట్లు సాధించాడు.

బంగ్లాదేశ్ క్రికెటర్ నాసిర్ హొస్సేన్‌పై నిషేధం

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ నాసిర్ హొస్సేన్‌పై రెండేళ్ల నిషేధం విధించింది. 'అబుదాబి టి10' టోర్నమెంట్‌లో ఫిక్సింగ్ ఆరోపణలు ఎదుర్కొన్న అతనిపై మంగళవారం ఐసీసీ శిక్ష ఖరారు చేసింది. నాసిర్ బంగ్లాదేశ్ తరఫున 19 టెస్టులు, 65 వన్డేలు, 31 టి20 ఆడాడు. చివరిసారిగా జాతీయ జట్టు తరఫున అతను 2018లో బరిలోకి దిగాడు.

సుమిత్ సంచలనం

- ప్రపంచ 27వ ర్యాంకర్ బుబ్లిక్‌పై వరుస సెట్‌లలో విజయం
- 1989 తర్వాత గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్‌ను ఓడించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత



సుమిత్

మెల్‌బోర్న్: ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ఆడితే అద్భుతం చేయవచ్చని భారత టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ నిరూపించాడు. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో 26 ఏళ్ల సుమిత్ చిరస్మరణీయ విజయంతో శుభారంభం చేశాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 137వ స్థానంలో ఉన్న సుమిత్ వరుస సెట్‌లలో 6–4, 6–2, 7–6 (7/5)తో ప్రపంచ 27వ ర్యాంకర్, 31వ సీడ్ అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై సంచలన విజయం సాధించి ఈ టోర్నీలో తొలిసారి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అంతేకాకుండా 35 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సీడెడ్ ప్లేయర్‌పై గెలిచిన తొలి భారతీయ ప్లేయర్‌గా సుమిత్ గుర్తింపు పొందాడు. 1989 ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ మాట్స్ విలాండర్ (స్వీడన్)పై రమేశ్ కృష్ణన్ గెలుపొందాడు. బుబ్లిక్‌తో 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సుమిత్ ఒక్క డబుల్ ఫాల్ట్ కూడా చేయలేదు. ఒక ఏస్ కొట్టిన సుమిత్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. 29 విన్నర్స్ షాట్‌లతో రాణించిన సుమిత్ 26 అనవసర తప్పిదాలు చేశాడు. నెట్ వద్దకు 32 సార్లు దూసుకొచ్చి 26 సార్లు పాయింట్లు దక్కించుకున్నాడు. మరోవైపు 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 82 కేజీల బరువున్న బుబ్లిక్ 13 ఏస్‌లతో విరుచుకుపడ్డా... 9 డబుల్ ఫాల్ట్‌లు, 44 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

ఏఐటీఏ సహకరించకపోయినా...

ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో జరగాల్సిన డేవిస్ కప్ మ్యాచ్‌లో తాను ఆడలేనని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) అధికారులకు గత నెలలో సుమిత్ నగాల్ సమాచారం ఇచ్చాడు. దాంతో సుమిత్‌పై ఏఐటీఏ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో ఆసియా కోటా నుంచి భారత్‌కు అందుబాటులో ఉన్న 'వైల్డ్ కార్డు' కోసం సుమిత్ పేరును పంపించకూడదని ఏఐటీఏ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ మెయిన్ 'డ్రా'లో చోటు కోసం క్వాలిఫయింగ్ టోర్నీలో బరిలోకి దిగాడు. ఏఐటీఏ తనకు సహకరించకపోయినా సుమిత్ నిరాశపడకుండా తన శక్తినంతా ధారపోసి, ఏకాగ్రతతో, పట్టుదలతో ఆడి క్వాలిఫయింగ్ టోర్నీలో వరుసగా మూడు మ్యాచ్‌లు గెలుపొందాడు. క్వాలిఫయర్ హోదాలో రెండోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించాడు. 2021లో తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన సుమిత్ ఈసారి మాత్రం గొప్ప విజయంతో రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. అంతకుముందు 2019 యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ తొలి రౌండ్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ చేతిలో ఓడిపోయిన సుమిత్ 2020 యూఎస్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకున్నాడు.

900 యూరోలతో...

గత ఏడాది ఆరంభంలో సుమిత్ బ్యాంక్ ఖాతాలో కేవలం 900 యూరోలు (రూ. 80 వేలు) ఉన్నాయి. దాంతో తొలి మూడు నెలలపాటు తాను జర్మనీలో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే అకాడమీకి వెళ్లలేకపోయాడు. ఈ దశలో అతని మిత్రులు సోమ్‌దేవ్ దేవ్‌వర్మన్, క్రిస్టోఫర్ మార్కస్, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం చేసి అండగా నిలబడ్డారు. గతంలో తాను గెల్చుకున్న ప్రైజ్‌మనీ, తన ఉద్యోగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా లభించే వేతనాన్ని ఏటీపీ సర్క్యూట్‌లో చాలెంజర్ టోర్నీలు ఆడేందుకు సుమిత్ వెచ్చించాడు. తాను పాల్గొన్న 24 టోర్నీలలో నిలకడగా రాణించి సుమిత్ రూ. 65 లక్షల వరకు ప్రైజ్‌మనీ సంపాదించాడు. కొత్త ఏడాదిలో కాన్‌బెర్రా చాలెంజర్ టోర్నీలో సుమిత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయినా... ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండ్‌కు చేరుకోవడం ద్వారా సుమిత్‌కు కనీసం 1,85,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1 కోటి) ప్రైజ్‌మనీగా రావడం ఖాయమైంది.

యూకీ బాంబ్రీ జోడీ ఓటమి

పురుషుల డబుల్స్‌లో యూకీ బాంబ్రీ (భారత్)–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) జోడీ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ–హాస్ ద్వయం 6–1, 6–7 (8/10), 6–7 (7/10)తో నికోలస్ బారిన్‌టోస్ (కొలంబియా)–రాఫెల్ మాటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడిపోయింది.

అల్‌కరాజ్, స్వియాటెక్ ముందంజ



పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్), మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) శుభారంభం చేశారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 7–6 (7/5), 6–1, 6–2తో రిచర్డ్ గాస్కె (ఫ్రాన్స్)పై గెలుపొందగా... స్వియాటెక్ 7–6 (7/2), 6–2తో సోఫియా కెనిన్ (అమెరికా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ), ఎనిమిదో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్)... మహిళల సింగిల్స్‌లో మూడో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

'క్లీన్‌స్వీప్'పై భారత్ గురి

- అఫ్గానిస్తాన్‌తో నేడు ఆఖరి టి20 మ్యాచ్
- సూపర్ ఫామ్‌లో రోహిత్ బృందం
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్–18లో ప్రత్యక్ష ప్రసారం



యశస్వి, శివమ్ దూబే, రోహిత్

బెంగళూరు: టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్ ఆఖరి అంతర్జాతీయ టి20 సమరానికి సన్నద్ధమైంది. అఫ్గానిస్తాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఇప్పటికే 2–0తో సిరీస్ చేజిక్కించుకున్న భారత్‌కు చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్ కీలకం కాదు! కానీ రెండు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవలేకపోయిన రోహిత్... ఈ సిరీస్ బరిలోకి దిగిన కోహ్లిలకు మాత్రం కీలకమే! తర్వాత అన్నీ ఐపీఎల్ మ్యాచ్‌లే ఉండటంతో పొట్టి ఫార్మాట్‌లో వీరిద్దరు గట్టి స్కోర్లు చేసేందుకు ఈ మ్యాచ్‌ను బాగా సద్వినియోగం చేసుకోవాలి. కాబట్టి సులువైన ప్రత్యర్థిపై టీమిండియా ఆదమరిచే ఆలోచనే ఉండబోదు. యువ ఆటగాళ్లు ఫామ్‌లో ఉండటం, బౌలింగ్ పదునెక్కడంతో భారత్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదు. అయితే ఈ ఫార్మాట్ దృష్ట్యా అఫ్గానిస్తాన్‌ను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. పైగా పుష్కలమైన ఆల్‌రౌండ్ ఆటగాళ్లున్న ప్రత్యర్థి తప్పకుండా పరువు కోసం పోరాడుతుంది.

దూబేను ఆపతరమా...

ఈ సిరీస్‌లో శివమ్ దూబే ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రెండు మ్యాచ్‌ల్లోనూ అజేయంగా అర్ధ సెంచరీలు బాదాడు. షాట్ల ఎంపిక, విరుచుకుపడిన తీరు చూస్తుంటే మిడిలార్డర్‌లో భర్తీ చేయదగ్గ బ్యాటర్‌లా ఉన్నాడు. యశస్వి జైస్వాల్‌కు వచ్చిన ఏకైక అవకాశాన్ని వినియోగించుకోగా, కెప్టెన్ రోహిత్ శర్మ పరుగుల పరంగా ఈ సిరీస్‌కు బాకీ పడ్డాడు. జితేశ్ శర్మ, రింకూ సింగ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత బ్యాటింగ్ ఆర్డర్‌కు ఏ ఢోకా లేదు. అలాగే బౌలింగ్ విభాగం కూడా పటిష్టంగానే ఉంది. పేస్‌తో అర్‌్షదీప్, ముకేశ్ కుమార్... స్పిన్‌తో అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్ అదరగొడుతున్నారు. మరోవైపు అఫ్గాన్ పరిస్థితే పూర్తి భిన్నంగా ఉంది. నిలకడలేని బ్యాటింగ్ ఆర్డర్ జట్టుకు ప్రతికూలంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో సిరీస్ కోల్పోయిన ప్రత్యర్థి జట్టు ఆఖరి గెలుపుతో ఊరట చెందాలని గంపెడాశలతో బరిలోకి దిగుతోంది.

ప్రణయ్, ప్రియాన్షు శుభారంభం

- తొలి రౌండ్‌లోనే లక్ష్య సేన్ నిష్క్రమణ
- పోరాడి ఓడిన గాయత్రి–ట్రీసా జోడీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో తొలి రోజు భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ప్రపంచ 9వ ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్, 30వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లగా... 19వ ర్యాంకర్ లక్ష్య సేన్, 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రణయ్ 21–6, 21–19తో ప్రపంచ 13వ ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)ను బోల్తా కొట్టించగా... ప్రియాన్షు 16–21, 21–16, 21–13తో లక్ష్య సేన్‌కు షాక్ ఇచ్చాడు. మరో మ్యాచ్‌లో కిరణ్ జార్జి 12–21, 15–21తో వాంగ్ జు వె (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయాడు.



మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి–ట్రీసా జాలీ, రితూపర్ణ–శ్వేతపర్ణ (భారత్) జోడీ లు తొలి రౌండ్‌ను దాటలేకపోయాయి. గాయత్రి–ట్రీసా ద్వయం 21–18, 14–21, 13–21తో నాలుగో ర్యాంక్ జోడీ నమి మత్సుయామ–షిడా చిహారు (జపాన్) జంట చేతిలో ఓడిపోయింది. టింగ్ యెంగ్–పుయ్ లామ్ యెంగ్ (హాంకాంగ్) జంట 21–6, 21–7తో రితూపర్ణ–శ్వేతపర్ణ జోడీపై గెలిచింది.

సినిమా



చిరంజీవి



ప్రభాస్

సంక్రాంతికి విశ్వంభర

హీరో చిరంజీవి సంక్రాంతి కానుకగా అభిమానులకు ఖుషీ కబురు చెప్పారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'విశ్వంభర' అనే టైటిల్ ఖరారు చేసి, టైటిల్ గ్లింప్స్ విడుదల చేశారు మేకర్స్. అంతేకాదు.. ఈ సినిమాని 2025 సంక్రాంతికి విడుదల చేయనున్నట్లు ప్రకటించింది చిత్రబృందం. 'బింబిసార' వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న చిత్రమిది. యూవీ క్రియేషన్స్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ''ఫ్యాంటసీ అడ్వెంచర్‌గా రూపొందుతోన్న చిత్రం 'విశ్వంభర'. చిరంజీవిగారి కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న సినిమా ఇది. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి, కెమెరా: ఛోటా కె.నాయుడు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కార్తీక్ శబరీష్, లైన్ ప్రొడ్యూసర్: రామిరెడ్డి శ్రీధర్ రెడ్డి.

నలుదిక్కులా కంగువ

సూర్య హీరోగా నటించిన చారిత్రాత్మక చిత్రం 'కంగువ'. శివ దర్శకత్వంలో దిశా పటానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రలు పోషించారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ ఏడాది పది భాషలకు పైగా థియేటర్స్‌లో విడుదల కానుంది. కాగా 'కాలం కంటే బలమైనది విధి. గతం, వర్తమానం, భవిష్యత్ ... కాలం ఏదైనా నలుదిక్కులా మార్మోగే పేరు ఒక్కటే.. కంగువ' అనే క్యాప్షన్‌తో ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 17వ శతాబ్దంలో మొదలయ్యే ఈ సినిమా కథ సమకాలీన పరిస్థితులకు కనెక్ట్ అయి ఉంటుందనే వార్తలు వచ్చాయి. ఈ వార్తలు నిజమే అన్నట్లుగా రెండు డిఫరెంట్ లుక్స్ ఉన్న సూర్య పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''సూర్య స్క్రీన్ ప్రెజెన్స్‌తో 'కంగువ' గ్రాండ్‌గా ఉంటుంది. త్రీడీలోనూ ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహనిర్మాత: నేహా జ్ఞానవేల్ రాజా.



సూర్య

శతమానం భవతి నెక్ట్స్ పేజి

శర్వానంద్, అనుపమా పరమేశ్వరన్ జంటగా సతీష్ వేగేశ్న దర్శకత్వం వహించిన చిత్రం 'శతమానం భవతి'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై 'దిల్' రాజు నిర్మించిన ఈ సినిమా 2017 సంక్రాంతికి విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'శతమానం భవతి నెక్ట్స్ పేజి' నిర్మించనున్నట్లు ప్రకటించారు 'దిల్' రాజు. ''చక్కని కుటుంబ కథా చిత్రంగా రూపొందిన 'శతమానం భవతి' మా బ్యానర్‌కి ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చింది. అలాగే ప్రతిష్ఠాత్మకమైన జాతీయ అవార్డును దక్కించుకుని తెలుగు సినీ ఇండస్ట్రీ గొప్పతనాన్ని చాటింది. మా బ్యానర్ విలువలకు తగ్గట్లు 'శతమానం భవతి నెక్ట్స్ పేజి'ని ఘనంగా రూపొందించనున్నాం. 2025 సంక్రాంతికి సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



'దిల్' రాజు

ప్రభాస్ రాజా సాబ్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'రాజా సాబ్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్‌ని ప్రకటించి, వింటేజ్ లుక్‌లో లుంగీ కట్టుకున్న ప్రభాస్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. మారుతి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ''ప్రభాస్ ఇప్పటివరకూ చేయని రొమాంటిక్ హారర్ జానర్‌లో 'రాజా సాబ్'ని తెరకెక్కిస్తున్నారు మారుతి. ప్రభాస్‌ను ఫ్యాన్స్ ఎలా చూడాలనుకుంటున్నారో ఈ మూవీలో అలాగే చూస్తారు. 'రాజా సాబ్' మా బ్యానర్‌లో ఒక మరపురాని సినిమాగా మిగిలిపోతుంది. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతుంది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ పళని, సంగీతం: తమన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డా. వాసుదేవ లెంబూరు, క్రియేటివ్ ప్రొడ్యూసర్: ఎస్‌కేఎన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల.

వేసవికి వాయిదా



విక్రమ్

ఏప్రిల్‌కు షిఫ్ట్ అయ్యాడు 'తంగలాన్'. హీరో విక్రమ్, దర్శకుడు పా. రంజిత్ కాంబినేషన్‌లో రూపొందిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'తంగలాన్'. ఈ చిత్రంలో మాళవికా మోహనన్, పార్వతీ హీరోయిన్లుగా నటించగా, డేనియల్ కాల్టాగిరోన్, వేట్టై ముత్తుకుమార్ కీలక పాత్రలు పోషించారు. బంగారు గనుల తవ్వకం నేపథ్యంలో సాగే ఈ చిత్రాన్ని కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. కాగా ఈ సినిమాను తొలుత జనవరి 26న రిలీజ్ చేయాలనుకున్నారు మేకర్స్. కానీ ఏప్రిల్‌లో విడుదల చేయనున్నట్లుగా ఓ కొత్త పోస్టర్‌తో సంక్రాంతి పండగ సందర్భంగా వెల్లడించారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



రాశీ ఖన్నా

సబర్మతి రిపోర్ట్‌లో రాశీ

దక్షిణాదిలో బాగా పాపులర్ అయిన కథానాయికల్లో రాశీ ఖన్నా ఒకరు. ఈ ఢిల్లీ బ్యూటీ ప్రస్తుతం ఇటు తెలుగు, తమిళ్‌తో పాటు హిందీ చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం హిందీలో సిద్ధార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందుతున్న 'యోధ' సినిమాలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా. దిశా పటానీ మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదల కానుంది. అలాగే తాజాగా 'ది సబర్మతి రిపోర్ట్' అనే హిందీ చిత్రానికి పచ్చజెండా ఊపారు రాశీ ఖన్నా.

విక్రాంత్ మెస్సీ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకు రంజన్ చందేల్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. కాగా 2002 ఫిబ్రవరిలో జరిగిన సబర్మతి ఎక్స్‌ప్రెస్ ప్రమాదం నేపథ్యంలో వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా కథనం ఉంటుందని చిత్ర యూనిట్ చెబుతోంది. మరోవైపు ఈ చిత్రాలే కాకుండా తెలుగులో 'తెలుసు కదా', తమిళంలో 'అరణ్మనై 4' సినిమాల్లో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రాశీ ఖన్నా.

ఈ ఏడాదే స్వయంభూ



నిఖిల్

నిఖిల్ హీరోగా నటిస్తున్న సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు.'స్వయంభూ' సినిమా అప్‌డేట్‌ను షేర్ చేశారు నిఖిల్. ''నాన్‌స్టాప్‌గా మా సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాలో నేను హనుమాన్ భక్తుడి పాత్రలో నటిస్తున్నాను. ఈ సినిమాలో నా ఫేవరెట్ డైలాగ్ జై శ్రీరామ్. అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నాం. దసరా లేదా దీపావళికి ఈ సినిమాను విడుదల చేసే ప్లాన్‌లో ఉన్నాం'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు నిఖిల్. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.



సుమయ రెడ్డి

ప్రేమ.. సందేశం

సుమయ రెడ్డి హీరోయిన్‌గా నటించి, స్వీయ కథతో నిర్మించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. సుమ చిత్ర ఆర్ట్స్ బ్యానర్‌పై రూపొందిన 'డియర్ ఉమ' చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి, సాయి రాజేశ్ మహాదేవ్ మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథ, ఫ్యామిలీ, యాక్షన్ డ్రామాతో పాటు చక్కని సందేశంతో ఈ మూవీ రూపొందింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే వాణిజ్య అంశాలు ఉన్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసి, సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం'' అన్నారు. కమల్ కామరాజు, సప్తగిరి, అజయ్ ఘోష్, ఆమని, రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, రూపాలక్ష్మి తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: రథన్.

సాక్షి బిజినెస్
బుధవారం
17-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	199	73,427
నిఫ్టీ ▽	65	22,032

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,976	△	3
డోజోన్స్	37,415	▽	178
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,568	▽	27
డాక్స్	16,562	▽	61
షాంఘై	2,894	△	8
నికాయ్	35,619	▽	283

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,608
బంగారం (99.5 స్వచ్ఛత)	62,357
వెండి (కేజీ)	71,666

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.55	83.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.67
€	యూరో	ఎస్‌బీఐ	91.74	91.93
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	56.24	57.52
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.89	56.01
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.20	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.72	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.43	12.50

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం 39% జంప్

క్యూ3లో రూ. 17,718 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేటు రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మెరుగైన ఫలితాలను ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో (2023–24, క్యూ3) బ్యాంక్ కన్సాలిడేటెడ్ (అనుబంధ సంస్థలన్నింటితో కలిపి) నికర లాభం రూ. 17,718 కోట్లకు ఎగబాకింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 12,735 కోట్లతో పోలిస్తే 39 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం ఆదాయం రూ. 54,123 కోట్ల నుంచి రూ. 1,15,015 కోట్లకు చేరింది. 112 శాతం ఎగసింది. స్టాండెలోన్ నికర లాభం 34 శాతం వృద్ధితో రూ.16,373 కోట్లకు దూసుకెళ్లింది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.12,259 కోట్లుగా ఉంది. ఇక స్టాండెలోన్ ఆదాయం 60 శాతం వృద్ధి చెంది, రూ. 51,208 కోట్ల నుంచి రూ. 81,720 కోట్లకు పెరిగింది.

ఎన్‌పీఏలు ఇలా...

బ్యాంక్ స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) క్యూ3లో స్వల్పంగా పెరిగాయి. 1.23 శాతం నుంచి 1.26 శాతానికి చేరాయి. అయితే నికర ఎన్‌పీఏలు మాత్రం 0.33 శాతం నుంచి స్వల్పంగా 0.31 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు ధర మంగళవారం 0.31 శాతం పెరిగి రూ. 1,678 వద్ద ముగిసింది.

నిత్యావసరాల ధరల మంట

డిసెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం 0.7%



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ ఆధారిత (డబ్ల్యూపీఐ) ద్రవ్యోల్బణం వరుసగా రెండవనెలలోనూ ఎగువబాటనే కొనసాగింది. ఏడు నెలల్లో ఎన్నడూ లేని తీవ్ర స్థాయిలో 0.73 శాతంగా (2022 డిసెంబర్‌తో పోల్చి) నమోదయ్యింది. 2023 మార్చిలో టోకు ద్రవ్యోల్బణం 1.41 శాతం ఎగసింది. అటు తర్వాత ఈ స్థాయిలో పెరుగుదల ఇదే తొలిసారి. ఆహార, కూరగాయల ధరలు సహా పలు విభాగాల్లో ధరల తీవ్రత తాజా టోకు ద్రవ్యోల్బణం తీవ్రతకు ప్రధాన కారణం. 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ టోకు ద్రవ్యోల్బణం మైనస్ (ప్రతి ద్రవ్యోల్బణం)లో కొనసాగింది. నవంబర్‌లో 'యూటర్న్' తీసుకుని 0.26 శాతంగా నమోదయ్యింది. తాజా సమీక్షా నెల డిసెంబర్‌లో మరింత పెరిగి 0.73 శాతానికి ఎగసింది. ఒక్క ఆహార ద్రవ్యోల్బణాన్ని చూస్తే, నవంబర్‌లో ఈ రేటు 8.18 శాతం ఉంటే, డిసెంబర్‌లో 9.38 శాతానికి ఎగసింది. కూరగాయల విషయంలో ద్రవ్యోల్బణం భారీగా 26.30 శాతం పెరగ్గా, పప్పు ధాన్యాల ధరలు 19.60 శాతం పెరిగాయి. 2023 ఆగస్టు నుంచి ఈ నిత్యావసర వస్తువల ధర రెండంకెలపైన కొనసాగుతోంది.

ఒడిదుడుకుల బాటనే ఎగుమతులు

- డిసెంబర్‌లో మళ్లీ ప్లస్‌లోకి..
- విలువ 38.45 బిలియన్ డాలర్లు
- క్షీణతలోనే దిగుమతులు;4.8% డౌన్
- 58.25 బిలియన్ డాలర్లుగా నమోదు
- వాణిజ్యలోటు 19.80 బి. డాలర్లు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ వస్తు ఎగుమతులు తీవ్ర ఒడిదుడుకుల బాటలోనే కొనసాగుతున్నాయి. నవంబర్‌లో క్షీణతను నమోదుచేసుకున్న ఈ కీలక రంగం డిసెంబర్‌లో స్వల్పంగా ఒక శాతం పెరుగుదలను నమోదుచేసుకుంది. విలువలో ఇది 38.45 బిలియన్ డాలర్లు. అయితే వస్తు దిగుమతుల విభాగం మాత్రం క్షీణతలోనే కొనసాగింది. విలువ 4.85 శాతం తగ్గి 58.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వెరసి ఎగుమతులు–దిగుమతుల విలువ మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 19.80 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

కొన్ని ముఖ్యాంశాలు...

- పెట్రోలియం ప్రొడక్టులు, రెడీమేడ్ దుస్తులు, రసాయనాలు, తోలు ఉత్పత్తులుసహా పలు విభాగాల్లో డిసెంబర్ ఎగుమతులు తగ్గాయి.
- ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ గూడ్స్, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాల విభాగాలు వృద్ధిని నమోదుచేసుకున్నాయి.
- క్రూడ్ దిగుమతులు సమీక్షా నెలలో 22.77% తగ్గి 15 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- పసిడి దిగుమతులు మాత్రం 156 శాతం ఎగసి 3 బిలియన్ డాలర్లకు చేరాయి.

9 నెలల్లో క్షీణతే..

మరోవైపు ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఆర్థిక సంవత్సరం 9 నెలల్లో భారత్ వస్తు ఎగుమతులు 5.7 శాతం క్షీణించి 317.12 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు కూడా ఇదే కాలంలో 7.93% క్షీణించి 505.15 బిలియన్ డాలర్లకు దిగాయి. వెరసి వాణిజ్యలోటు 188.02 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2022 ఇదే కాలంలో ఈ లోటు 212.34 బిలియన్ డాలర్లు.

సేవల రంగం కూడా నిరాశే...

సేవల రంగం ఎగుమతులు డిసెంబర్‌లో క్షీణతను నమోదుచేసుకుని, 27.88 బిలియన్ డాలర్లకు తగ్గాయి. 2022 ఇదే కాలంలో ఈ విలువ 31.19 బిలియన్ డాలర్లు. ఇక ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య ఈ విలువ 239.5 బిలియన్ డాలర్ల నుంచి 247.92 బిలియన్ డాలర్లకు ఎగసింది.

మారుతీ కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా అన్ని కార్ల ధరలను సవరిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. సగటు పెరుగుదల 0.45 శాతం ఉంటుందని వెల్లడించింది. తాజాగా తీసుకున్న నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని మారుతీ సుజుకీ స్పష్టం చేసింది. కంపెనీ మోడళ్ల ధర ఎక్స్‌షోరూంలో రూ.3.54 లక్షలు మొదలుకుని రూ.28.42 లక్షల వరకు ఉంది.

హ్యుందాయ్ కొత్త క్రెటా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా తాజాగా కొత్త క్రెటా విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.10.99 లక్షలు మొదలుకుని రూ.19.99 లక్షల వరకు ఉంది. 6 స్పీడ్ మాన్యువల్/సీవీటీ 1.5 లీటర్ పెట్రోల్ ఇంజన్, 6 స్పీడ్ మాన్యువల్/6 స్పీడ్ ఆటోమేటిక్ 1.5 లీటర్ డీజిల్, 7 స్పీడ్ డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్‌తో మొత్తం 7 ట్రిమ్స్‌లో లభిస్తాయి. లెవెల్–2 అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్‌తో తయారైంది. రెండు 10.25 అంగుళాల స్క్రీన్స్‌తో ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 6 ఎయిర్ బ్యాగ్స్ వంటి హంగులు జోడించింది.

రికార్డు స్థాయిల్లో లాభాల స్వీకరణ

- ఐటీ, ఇంధన, రియల్టీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి
- అయిదు రోజుల ర్యాలీకి బ్రేక్
- ఇంట్రాడేలో తాజా గరిష్టాల నమోదు



ముంబై: ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల అందడంతో రికార్డు గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా స్టాక్ సూచీల అయిదు రోజుల వరుస ర్యాలీకి మంగళవారం ముగింపు పడింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని ప్రథమార్థంలోనే జీవితకాల గరిష్టాలు నమోదు చేశాయి. సెన్సెక్స్ 100 పాయింట్లు పెరిగి 73,428 వద్ద, నిఫ్టీ 27 పాయింట్లు బలపడి 22,124 వద్ద ఆల్‌టైం హై స్థాయిలు తాకాయి. సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఐటీ, రియల్టీ, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణ చేసుకోవడంతో సెన్సెక్స్ 199 పాయింట్ల నష్టపోయి 73,427 వద్ద, నిఫ్టీ 65 పాయింట్లు పతనమై 22,032 వద్ద ముగిశాయి. చిన్న, మధ్య తరహా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో బీఎస్‌ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 0.31%, 0.43% చొప్పున పతనమయ్యాయి. మరోవైపు మెటల్, ఎఫ్‌ఎంసీజీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆయిల్‌అండ్‌గ్యాస్ షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు.

''ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలతో ఇటీవల భారీగా ర్యాలీ చేసిన ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటుకుంది. చిన్న, మధ్య తరహా షేర్ల విలువలు భారీ పెరిగిపోవడంతో మార్కెట్ ర్యాలీ కొనసాగకపోవచ్చు. ట్రేడింగ్‌ను ప్రభావితం చేసే తాజా అంశాలేవీ లేకపోవడంతో ఎఫ్ఐఐలు నుంచి ఎలాంటి సంకేతాలు లేవు. భౌగోళిక ఉద్రిక్తతలతో క్రూడాయిల్ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- జ్యోతి సీఎన్‌సీ ఆటోమేషన్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర(రూ.331)తో పోలిస్తే షేరు బీఎస్‌ఈలో 12% ప్రీమియంతో రూ.372 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 34% ఎగసి రూ.445 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. చివరికి 31% లాభపడి రూ.433 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.9,851 కోట్లుగా నమోదైంది.
- క్యూ3 లో నికర లాభం 56% క్షీణించడంతో జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 7% నష్టపోయి రూ.249 వద్ద నిలిచింది. ట్రేడింగ్‌లో 8% పతనమై రూ.247 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. షేరు భారీ పతనంతో కంపెనీ ఒక్క రోజులోనే రూ.11,372 కోట్ల మార్కెట్ క్యాప్‌ను కోల్పోయింది.
- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించడంతో గత రెండు రోజుల్లో భారీగా పెరిగిన దేశీయ అగ్రగామి ఐటీ కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. హెచ్‌సీఎల్ టెక్ 2%, విప్రో 2%, టెక్ మహీంద్ర 1.40%, ఇన్ఫోసిస్ 1.27%, టీసీఎస్ 1% చొప్పున నష్టపోయాయి.
- గతవారంలో 8% ర్యాలీ చేసిన రిలయన్స్ ఇండస్ట్రీస్ క్యూ3 ఆర్థిక ఫలితాల వెల్లడి(శుక్రవారం)కి ముందు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో ఒకటిన్నర శాతం నష్టపోయి రూ.2747 వద్ద ముగిసింది.

స్వల్పకాల డిపాజిట్లపై 7.6% వరకూ వడ్డీ: బీఓబీ



ముంబై: స్వల్పకాలిక రిటైల్ డిపాజిట్లపై వడ్డీరేటును 7.1 నుంచి 7.6 శాతం వరకూ ఆఫర్ చేస్తున్నట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రకటించింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 7.6 శాతం, ఇతరులకు 7.1 శాతం రేటు వర్తిస్తుందని బ్యాంక్ ప్రకటన పేర్కొంది. 'బీఓబీ360' పేరుతో ప్రారంభించిన ఈ తాజా బల్క్ డిపాజిట్ స్కీమ్ సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. బ్యాంక్ ప్రస్తుత లేదా కొత్త కస్టమర్లు ఈ బల్క్ డిపాజిట్ స్కీమ్‌ను ఏదైనా బ్రాంచ్‌లో, ఆన్‌లైన్ లేదా మొబైల్ యాప్ ద్వారా తెరవవచ్చు. కాగా, రెండు వారాల క్రితమే బీఓబీ రూ.2 కోట్ల లోపు స్వల్పకాలిక స్థిర డిపాజిట్లపై వడ్డీరేట్లను 125 బేసిస్ పాయింట్ల (100 బేసిస్ పాయింట్లు 1%) వరకూ పెంచింది. 7–14 రోజుల డిపాజిట్ రేట్లు అత్యధికంగా 3 శాతం నుంచి 1.25% పెరిగి 4.25 శాతానికి చేరింది. 15–45 రోజుల డిపాజిట్ రేటు 1 శాతం పెరిగి 4.50%కి చేరింది. 271 రోజుల బల్క్ డిపాజిట్లపై బ్యాంక్ 6.25 శాతం వడ్డీరేటును ఆఫర్ చేసింది.

కీళ్లు, కండరాల నొప్పుల నివారిణి రుమా ఆయిల్

హైదరాబాద్: కీళ్లు, కండరాల నొప్పులను నివారించేందుకు రుమా ఆయిల్ చక్కగా పనిచేస్తుందని బైద్యనాథ్ ఆయుర్వేద్ ఒక ప్రకటనలో తెలిపింది. ఎరాండ్‌మూల్, దతూర పంచాంగ్, అశ్వగంధ, శాతావారి, అమ్లాలేద్, కుచల, ప్రసార్ని ఆయిల్, గంధపురి, టర్పెంటైన్ వంటి ఆయుర్వేద మూలికలతో ఈ రుమా ఆయిల్‌ను తయారు చేసినట్లు పేర్కొంది. ప్రతి రోజూ ఈ నూనెతో మసాజ్ చేసుకుంటే ఎముకలు, కండరాలు పటిష్టంగా తయారవుతాయని కంపెనీ తెలిపింది.



భవిత

ఇకపై ఈ ప్రముఖ సాక్షి ఎడ్యుకేషన్ వాట్సప్ చానల్‌లో.. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సమాచారం, ప్రవేశ పరీక్షలు, ఎడ్యుకేషన్ న్యూస్, టిప్స్, ఇంటర్ సమాచారం.. ఇలా ఎన్నో.. తాజా అప్‌డేట్స్ కోసం ఈ చానల్ ఫాలో అవ్వండి. ఇంకెందుకు ఆలస్యం ఇప్పుడే.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.. చానల్ ఫాలో అవ్వండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

డీఆర్‌డీవో-సీవీఆర్‌డీఈ, చెన్నైలో 60 ఐటీఐ అప్రెంటిస్‌లు

చెన్నై అవడిలోని డీఆర్‌డీవో–కంబాట్ వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అస్టాబ్లిష్‌మెంట్(సీవీఆర్‌డీఈ).. అప్రెంటిస్‌షిప్ శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 60
» **ట్రేడులు:** కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్‌మ్యాన్(మెడికల్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్, మెకానిక్, టర్నర్, వెల్డర్.
» **అర్హత:** సంబంధిత ట్రేడులో ఐటీఐ 2021/2022/2023 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులు.
» **వయసు:** 01.12.2023 నాటికి 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.7,700 నుంచి రూ.8,050
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** వార్తాపత్రికలో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** drdo.gov.in

నార్త్ వెస్టన్ రైల్వేలో 1646 యాక్ట్ అప్రెంటిస్‌లు

జైపూర్(రాజస్థాన్)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–నార్త్ వెస్టన్ రైల్వే ఎస్‌డబ్ల్యూఆర్ పరిధిలోని వర్క్‌షాప్/యూనిట్‌లలో యాక్ట్ అప్రెంటిస్ శిక్షణ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1646
» **వర్క్‌షాప్‌లు/యూనిట్లు:** డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీసర్(అజ్మీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(బికనీర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జైపూర్), డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్(జోధ్‌పూర్), బీటీసీ క్యారేజ్(అజ్మీర్), బీటీసీ లోకో(అజ్మీర్), క్యారేజ్ వర్క్స్‌షాప్(బికనీర్), క్యారేజ్ వర్క్స్‌షాప్(జోధ్‌పూర్).
» **అర్హత:** కనీసం పదోతరగతిలో 50శాతం మార్కులతో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ట్రేడులు:** ఎలక్ట్రికల్, కార్పెంటర్, పెయింటర్, మేసన్, పైప్ ఫిట్టర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, వెల్డర్, మెకానికల్, డీజిల్ మెకానికల్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్ తదితరాలు.
» **వయసు:** 10.02.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.02.2024
» **వెబ్‌సైట్:** www.rrcjaipur.in

సర్కారీ కొలువుల మేళా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో.. నూతన సంవత్సరంలో ఉద్యోగార్థులకు సర్కారీ కొలువులు స్వాగతం పలుకుతున్నాయి. ఉన్నత స్థాయి పోస్టులైన గ్రూప్-1, గ్రూప్-2 సహా పలు ఉద్యోగాలకు ఏపీపీఎస్సీ ఇప్పటికే ఎంపిక ప్రక్రియ ప్రారంభించింది! టెక్ కొలువులు, నాన్-టెక్నికల్ ఉద్యోగాలు, గతంలో భర్తీకానీ పోస్టులు.. ఇలా అన్నింటికీ నోటిఫికేషన్లు ఇచ్చి.. లక్షల మంది అభ్యర్థుల సర్కారీ కొలువుల ఆశలు నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అంతేకాకుండా పండగ తర్వాత డీఎస్సీకి సన్నాహకాలు చేస్తున్నట్లు మరో తీపి కబురు చెప్పింది. ఇలాంటి కొలువుల నామ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలువడిన ఉద్యోగ నోటిఫికేషన్లపై ప్రత్యేక కథనం..

» ఏపీలో గ్రూప్-1, 2 సహా పలు కీలక నోటిఫికేషన్లు
» త్వరలోనే డీఎస్సీకి ప్రభుత్వం సన్నాహకాలు
» ఒకే అర్హతతో పలు పరీక్షలకు పోటీ పడే అవకాశం
» ఉమ్మడి ప్రిపరేషన్‌తో సర్కారీ కొలువు ఖాయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్–1, గ్రూప్–2, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్, పాలిటెక్నిక్ లెక్చరర్స్, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్స్(పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది.

గ్రూప్-1 సర్వీసెస్

ఏపీపీఎస్సీ తాజాగా విడుదల చేసిన గ్రూప్1 నోటిఫికేషన్ ద్వారా మొత్తం 81 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(పురుషులు), డివిజినల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్స్, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి, కో–ఆపరేటివ్ సర్వీస్ డిప్యూటీ రిజిస్ట్రార్, మున్సిపల్ కమిషనర్ (గ్రేడ్–1), అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్,డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్,అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ తదితర ఉన్నతస్థాయి పోస్టులు ఉన్నాయి.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారు. మొత్తం 240 మార్కులకు ప్రిలిమినరీ పరీక్ష ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్–1 (జనరల్ స్టడీస్ 120 ప్రశ్నలు –120 మార్కులు); పేపర్–2 (జనరల్ ఆప్టిట్యూడ్ 120 ప్రశ్నలు–120 మార్కులు).
- **మెయిన్ ఎగ్జామినేషన్:** మెయిన్‌లో అయిదు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 150 మార్కులు చొప్పున 750 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. అవి.. పేపర్–1 జనరల్ ఎస్సే; పేపర్–2-ఏపీ, భారతదేశ చరిత్ర, సంస్కృతి, భౌగోళిక శాస్త్రం; పేపర్–3-పాలిటీ, రాజ్యాంగం, పాలన, లా,ఎథిక్స్; పేపర్–4 ఎకానమీ, భారతదేశ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి; పేపర్–5 సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ అంశాలు. మెయిన్ ఎగ్జామినేషన్‌లో సాధించిన మార్కుల ఆధారంగా.. చివరగా 75 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- **గ్రూప్–1 ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 21, 2024
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** మార్చి 17, 2024

899 పోస్టులతో గ్రూప్-2

ఏపీపీఎస్సీ గ్రూప్–2 నోటిఫికేషన్ ద్వారా 899 ఎగ్జిక్యూటివ్, నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. వీటిలో 333 ఎగ్జిక్యూటివ్ పోస్టులు; 566 నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లలో ప్రతిభ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.
- **స్క్రీనింగ్ టెస్ట్:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ సబ్జెక్ట్ పేపర్‌తో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** స్క్రీనింగ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశ మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను రెండు పేపర్లుగా 300 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్–1లో సెక్షన్–1: సోషల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఆంధ్రప్రదేశ్‌లోని సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలు); సెక్షన్–2: భారత రాజ్యాంగం సమీక్షల నుంచి 150 ప్రశ్నలు (150 మార్కులు) అడుగుతారు. పేపర్–2లో సెక్షన్–1: భారత్, ఏపీ ఆర్థిక వ్యవస్థ; సెక్షన్–2 సైన్స్ అండ్ టెక్నాలజీల నుంచి 150 ప్రశ్నలు(150 మార్కులు) అడుగుతారు.
- **గ్రూప్–2 ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** జనవరి 17, 2024
- **గ్రూప్–2 స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఫిబ్రవరి25, 2024

47 జూనియర్ లెక్చరర్స్

ఏపీ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ సర్వీస్ పరిధిలో మొత్తం 47 జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. ఇందులో ఇంగ్లిష్ –9; తెలుగు–2; ఉర్దూ–2; సంస్కృతం–2, ఒరియా–1; మ్యాథమెటిక్స్–1; ఫిజిక్స్–5; కెమిస్ట్రీ–3; బోటనీ–2; జువాలజీ–1; ఎకనామిక్స్–12; సివిక్స్–2; హిస్టరీ–5 పోస్టులు ఉన్నాయి.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్ట్‌తో పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష ఇలా:** రాత పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. అవి.. **పేపర్–1:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ(150 ప్రశ్నలు–150 మార్కులు); **పేపర్–2:** సంబంధిత సబ్జెక్ట్ పేపర్ (150 ప్రశ్నలు–300 మార్కులు). రాత పరీక్ష మొత్తం 450 మార్కులకు జరుగుతుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 31–ఫిబ్రవరి 20, 2024
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్/మేలో నిర్వహించే అవకాశం.

240 డిగ్రీ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ఆయా సబ్జెక్టులలో మొత్తం 240 డిగ్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. బోటనీ–19; కెమిస్ట్రీ–26; కామర్స్–35; కంప్యూటర్ అప్లికేషన్స్–26; కంప్యూటర్ సైన్స్–31; ఎకనామిక్స్–16; హిస్టరీ–19; మ్యాథమెటిక్స్–17; ఫిజిక్స్–11; పొలిటికల్ సైన్స్–21; జువాలజీ–19.

- **అర్హత:** సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు నెట్ లేదా స్లెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **రాత పరీక్ష:** పేపర్–1 జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2 (సంబంధిత సబ్జెక్ట్ పేపర్)–150 ప్రశ్నలు–300 మార్కులు. మొత్తం 450 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ పరీక్ష 100 మార్కులకు ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు.
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్/మే నెలలో నిర్వహించే అవకాశం ఉంది.

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్

ఏపీ ఎడ్యుకేషన్ సర్వీస్ విభాగంలో.. 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

- **అర్హత:**బీఈడీ కోర్సు చేసేందుకు అర్హత ఉన్న సబ్జెక్ట్‌తో పీజీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.



- **స్క్రీనింగ్ టెస్ట్:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ పేపర్ 150 ప్రశ్నలు–150 మార్కులకు ఉంటుంది.
- **మెయిన్ ఎగ్జామినేషన్:** స్క్రీనింగ్ టెస్ట్‌లో చూపిన ప్రతిభ ఆధారంగా 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి రెండో దశలో మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్‌లో మూడు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్–1–జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2–ఎడ్యుకేషన్–1 (150 ప్రశ్నలు–150 మార్కులు); ఎడ్యుకేషన్–2 (150 ప్రశ్నలు–150 మార్కులు). మొత్తం 450 మార్కులకు మెయిన్ ఎగ్జామినేషన్ ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 9–జనవరి 29, 2024.
- **స్క్రీనింగ్ టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 13, 2024.

అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలిలో.. 21 అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది.

- **అర్హత:** సివిల్/మెకానికల్/ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లతో బీటెక్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో మూడు ఉంటాయి. పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ 150 ప్రశ్నలు–150 మార్కులు); పేపర్–2 సబ్జెక్ట్ పేపర్ (150 మార్కులు– 150 ప్రశ్నలు; పేపర్–3 (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (150 ప్రశ్నలు – 150 మార్కులు).
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 30–ఫిబ్రవరి 19, 2024.
- **పరీక్ష తేదీ:**ఏప్రిల్ లేదా మేలో నిర్వహించే అవకాశం

99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో 21 సబ్జెక్టులలో మొత్తం 99 పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది.

- **అర్హత:** సబ్జెక్టును అనుసరించి బీటెక్ లేదా సంబంధిత సబ్జెక్టులో పీజీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలి
- **ఎంపిక విధానం:** రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు. రాత పరీక్షను రెండు పేపర్లుగా 450 మార్కులకు నిర్వహిస్తారు. **పేపర్–1:** జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ–150 ప్రశ్నలు–150 మార్కులు; **పేపర్–2:** సంబంధిత సబ్జెక్ట్ పేపర్–150 ప్రశ్నలు–300 మార్కులకు ఉంటుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జనవరి 29 నుంచి ఫిబ్రవరి 18, 2024.
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ లేదా మేలో నిర్వహించే అవకాశం.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

'ఉమ్మడి'గా రాణించేలా ప్రిపరేషన్

ఏపీపీఎస్సీ ద్వారా పలు నియామక పరీక్షలకు ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. గ్రూప్–1, గ్రూప్–2లకు తొలి దశ పరీక్ష తేదీలను సైతం ప్రకటించారు. మిగతా పోస్టులకు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా పరీక్షలకు సంబంధించి దాదాపు 70 నుంచి 80 శాతం వరకు సిలబస్ అంశాలు ఒకే విధంగా ఉండటం అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. ఒకే ప్రిపరేషన్‌తో పలు పరీక్షల్లో రాణించే అవకాశముంది.

సిలబస్ పరిశీలన

ఒకే సమయంలో పలు పరీక్షలకు హాజరవ్వాలనుకునే విద్యార్థులు తొలుత ఆయా పరీక్షల సిలబస్‌ను పరిశీలించాలి. సిలబస్‌లో వేర్వేరుగా ఉన్న టాపిక్స్ తెలుసుకోవాలి. ఉమ్మడి టాపిక్స్ సిలబస్‌కు, ప్రత్యేక టాపిక్స్ సిలబస్‌కు సమయం కేటాయించుకోవడం; ఆయా సబ్జెక్టులు, టాపిక్స్‌కు సంబంధించి ప్రామాణిక మెటీరియల్‌ను సేకరించుకోవడం; సదరు పరీక్షల్లో ప్రశ్నలు అడుగుతున్న తీరుపై అవగాహన పెంచుకోవడం ద్వారా విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు.

ఆబ్జెక్టివ్.. డిస్క్రిప్టివ్

ఒక పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో, మరో పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటే ఎలా చదవాలి? అనే ప్రశ్న ఎదురవుతుంది. ముఖ్యంగా గ్రూప్–1 ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో జరిగే పరీక్ష. అదే సమయంలో పూర్తిగా ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహించే పరీక్ష గ్రూప్–2. పరీక్ష విధానం ఏదైనా డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫలితంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది. దీని ద్వారా రెండు రకాల పరీక్షల్లో విజయానికి అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.


కరీంనగర్‌లో ఓ ఇంటిముందు రామమందిరం ముగ్గులు వేస్తున్న మహిళ

రాముడి కోసం రంగవల్లిక

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆర్మూర్‌కు చెందిన వెంకటేశ్వర కాలనీలో గిర్వానీ అనే యువతి అయోధ్య రామమందిరం- రాముడు, సీత, హనుమంతుడి చిత్రపటాలతో వేసిన ముగ్గు ఆకట్టుకుంటోంది. కరీంనగర్‌లోని వివిధ కాలనీల్లో కూడా సోమవారం కొందరు మహిళలు రామ మందిరం నమూనా, సీతారామాంజనేయుల చిత్రాలను ముగ్గులతో తీర్చిదిద్ది రామభక్తి చాటుకున్నారు.

-కరీంనగర్/నిజామాబాద్


గిర్వానీ వేసిన అయోధ్య రామమందిరం ముగ్గు

జోగుళాంబ అమ్మవారికి 'అగ్గిపెట్టె చీర'

• సిరిసిల్ల నేతశిల్పి నల్ల విజయ్‌కుమార్

సిరిసిల్ల/జోగుళాంబ శక్తిపీఠం: సిరిసిల్లకు చెందిన నేతశిల్పి నల్ల విజయ్‌కుమార్ అగ్గిపెట్టెలో ఇమిడే చీరను జోగుళాంబ అమ్మవారికి మంగళవారం బహూకరించారు. ఈ చీరను రెండు గ్రాముల బంగారు పోగులతో కలిపి నేశాడు. అయ్యప్పమాల ధరించిన విజయ్‌కుమార్ జోగుళాంబ అమ్మవారిని దర్శించుకొని ఆలయ అధికారి పురేందర్ కుమార్‌కు చీరను అందించారు. చీర బరువు వంద గ్రాములు ఉందని, దీని విలువ దాదాపు రూ.18 వేల వరకు ఉంటుందని ఆలయ ఉద్యోగి బ్రహ్మయ్యఆచారి తెలిపారు.


జోగులాంబ అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీరను అందిస్తున్న దృశ్యం

అయోధ్యలో సిద్దిపేట సంస్థ అన్నప్రసాద వితరణ

- అమర్‌నాథ్ సేవా సమితికి చాన్స్
- ఈ నెల 22 నుంచి 45 రోజుల పాటు భక్తులకు అన్నదానం

సాక్షి, సిద్దిపేట: సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితికి అరుదైన అవకాశం దక్కింది. అయోధ్యలో ఈ నెల 22న జరిగే శ్రీరామ విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఈ సంస్థ అన్నప్రసాద వితరణ చేయనుంది. భక్తులకు ప్రసాద వితరణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో దేశంలోని నాలుగు ప్రముఖ సంస్థలను ఎంపిక చేశారు. మొత్తం నాలుగు లంగర్‌లు కాగా.. దక్షిణ భారత దేశానికి సంబంధించిన ఏకైక లంగర్, సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ సంస్థకు దక్కింది. ట్రస్ట్ కేటాయించిన ఈ లంగర్‌లో ఈ నెల 22 నుంచి 45 రోజుల పాటు అన్నప్రసాద వితరణ జరగనుంది. ఇందుకోసం సుమారు రూ.కోటి విలువ చేసే నిత్యావసర సరుకులతో లారీలు ఇప్పటికే అయోధ్య చేరుకున్నాయి. 8 మంది వంట మనుషులు, 12 మంది సహాయకులు, 30 మంది వలంటీర్లు అయోధ్యకు వెళ్లారు. రోజుకు 10 వేల మందికి అన్నప్రసాద వితరణ చేయనున్నారు.


అయోధ్యలో ప్రసాద వితరణ కోసం ఏర్పాటు చేసిన షామియానాలు

పన్నెండేళ్లుగా అమర్‌నాథ్‌లో..

సిద్దిపేటకు చెందిన కొందరు భక్తులు పన్నెండేళ్ల క్రితం అమర్‌నాథ్‌కు వెళ్లిన సమయంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారు మరి కొందరితో కలిసి 12 ఏళ్ల క్రితమే సిద్దిపేటలో అన్నదాన సేవా సమితిని ఏర్పాటు చేసి, వెనువెంటనే అమర్‌నాథ్‌లో ఉచితంగా అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. నాలుగేళ్లుగా కేదార్‌నాథ్‌లో కూడా ఇది కొనసాగిస్తున్నారు. ఈ సంస్థలో ప్రస్తుతం మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిలతో పాటు 170 మంది సభ్యులున్నారు.

పూర్వజన్మసుకృతం...



అయోధ్యలో అన్నప్రసాద వితరణకు అవకాశం దక్కడం మా పూర్వజన్మసుకృతం.12 ఏళ్లుగా అమర్‌నాథ్‌లో, నాలుగేళ్లుగా కేదార్‌నాథ్‌లో అన్నప్రసాద వితరణ చేస్తుండటంతో ఈ అవకాశం మాకు దక్కింది.

– చీకోటి మధుసూదన్, వ్యవస్థాపక అధ్యక్షుడు, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి, సిద్దిపేట

అయోధ్య లడ్డూ @ 1,265 కిలోలు



కంటోన్మెంట్ (హైదరాబాద్): అయోధ్య రాముడికి నైవేద్యంగా సమర్పించేందుకు భాగ్యనగరవాసి ఒకరు భారీ లడ్డూను తయారు చేశారు. పికెట్‌కు చెందిన శ్రీరామ్ క్యాటరర్స్ నిర్వాహకుడు నడిమింటి నాగభూషణం రెడ్డి, కృష్ణకుమారి దంపతులు 1,265 కిలోల అఖండ లడ్డూను తయారు చేశారు. మంగళవారం లడ్డూ తయారీ పూర్తయిన నేపథ్యంలో వాల్మీకి నగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో లడ్డూను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ.. అయోధ్య రామాలయ భూమి పూజ జరిగినప్పటి నుంచి ప్రాణప్రతిష్ట వరకు 1,265 రోజులవుతున్నందున 1,265 కిలోల లడ్డూను తయారు చేసినట్లు తెలిపారు. తాడ్‌బంద్‌లో పూజలు జరిపి.. నైవేద్యం లడ్డూను బుధవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పికెట్ సంతోషిమాత ఆలయ సమీపంలోని శ్రీరామ్ కేటరర్స్ ఆవరణలో భక్తుల సందర్శనార్థం ఉంచనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి లడ్డూ శోభాయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అక్కడ పూజల అనంతరం రోడ్డు మార్గంలో లడ్డూను ఈ నెల 21 నాటికి అయోధ్యకు తరలించనున్నట్లు నాగభూషణంరెడ్డి తెలిపారు. రూ.2 కేజీల చొప్పున రూపొందించిన 5 లడ్డూలను గర్భగుడిలో పూజించి, నైవేద్యం లడ్డూను రామాలయంలో ప్రసాదంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అయోధ్య మందిరం @ ఆన్ వీల్స్

- నమూనా రూపొందించిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత సుధాకర్

చార్మినార్ (హైదరాబాద్): అయోధ్య వెళ్లి రామ మందిరాన్ని కళ్లారా చూడలేని వారి కోసం పాతబస్తీ బహదూర్‌పురాలో 'అయోధ్య మందిర్ ఆన్ వీల్స్' పేరుతో రామ మందిర నిర్మాణం నమూనా అందుబాటులోకి వచ్చింది. సుధాకార్స్ మ్యూజియంలో రూపుదిద్దుకున్న ఈ నమూనాను ఈ నెల 18 నుంచి నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రదర్శించనున్నారు. వచ్చేనెల 15 వరకు ఉచితంగా ఈ ప్రదర్శన కొనసాగనుంది. మెటాడోర్ ఫోర్ వీలర్ వెహికల్‌పై రూపొందించిన ఈ నమూనా మందిరం ఎక్కడికంటే అక్కడికి 60 కి.మీ. వేగంతో దూసుకుపోతుందని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, ఈ నమూనా రూపకర్త సుధాకర్ తెలిపారు. రెండేళ్లుగా 21 మంది నిపుణులతో రూపొందిస్తున్నారు. మెటల్ స్ట్రక్చర్, ఫైబర్ గ్లాస్ బాడీతో రూపొందుతున్న ఈ నమూనా...పైన జెండాతో కలిపి 26 అడుగుల ఎత్తు, 22×13 అడుగుల వెడల్పుతో నిర్మితమవుతోంది. ఎవరైనా రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల్లో దీనిని ప్రదర్శించడానికి సిద్ధపడితే వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని సుధాకర్ చెప్పారు.


వాహనంపై అయోధ్య ఆలయ నమూనా

లైఫ్ మిషన్‌పై బీఈఈ ప్రత్యేక దృష్టి

- దక్షిణాది రాష్ట్రాలు, యూటీల మీడియా సలహాదారుడిగా బాధ్యతలు స్వీకరించిన చంద్రశేఖర్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : పర్యావరణ హితానికి ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'లైఫ్‌మిషన్' (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) సమర్థ అమలుపై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన బ్యూరోఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) దృష్టి సారించింది. 2028 నాటికల్లా ప్రజలంతా ప్రకృతి సిద్ధమైన జీవనశైలిని అనుసరించేలా కనీసం వంద కోట్ల భారతీయులు, ప్రపంచ పౌరులను ప్రోత్సహించడమే లైఫ్‌మిషన్ ధ్యేయం. 'లైఫ్' అనేది ప్రజాఉద్యమం. ప్రజల్ని 'ప్రో-ప్లానెట్'గా మార్చడమే లక్ష్యంగా ఈ మిషన్‌ను చేపట్టారు. బీఈఈకి హైదరాబాద్ కేంద్రంగా దక్షిణాదిప్రాంత మీడియా సలహాదారుగా నియమితులైన చంద్రశేఖరరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంధన సుస్థిరత, సామర్థ్య లక్ష్యాలను సాధించడంలో కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీతోపాటు దక్షిణాదిలోని కేంద్రపాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు ఆయన సహాయ సహకారాలు అందిస్తారు.







Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.